జెవివి మహాసభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

సైన్స్ ఫలితాలు కొందరికే..

- సోషల్ సైన్స్‌తోనే సమాజాభివృద్ధి
- జెవివి రాష్ట్ర మహాసభ ప్రారంభం

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 44 | విజయవాడ, ఆదివారం 14 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 14 September 2025 | Rs

పై చేయి ఎవరిదో..?

- నేడు భారత్ × పాకిస్తాన్ జట్ల మధ్య కీలక పోరు
- ఆసియా కప్ క్రికెట్ టోర్నీ

6

ఎట్టకేలకు మణిపూర్‌కు ప్రధాని

అమానుష హింసాకాండ జరిగిన రెండున్నరేళ్ల తరువాత పర్యటన

- భారీ బందోబస్తు మధ్య సభలు
- మీ వెంటే ఉంటానంటూ ఇప్పుడు హామీ
- మోడీ గోబ్యాక్ : పలుచోట్ల నిరసనలు

చురచాంద్‌పూర్ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ, నిరసన తెలుపుతున్న మహిళలు

ఇంఫాల్ : ఎట్టకేలకు మణిపూర్‌కు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వెళ్లారు. గిరిజనులను లక్ష్యంగా చేసుకుని అమానుష హింసాకాండ జరిగిన రెండున్నరేళ్ల తరువాత శనివారం జరిగిన ఈ పర్యటనకు సైతం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. మోడీ పాల్గొన్న సభలకు వచ్చే వారినిసైతం పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. నిఘా యంత్రాంగం రాష్ట్రమంతా కన్ను వేసింది. అయినా ప్రజలు ఎక్కడికక్కడ కదిలారు. మోడీ గోబ్యాక్ అని నినదిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేశారు. ఒక పథకం ప్రకారం నెలల తరబడి చెలరేగిన హింసలో వందలాది మంది గిరిజనులు మరణించగా, వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఈ దాడుల వెనుక బిజెపికి చెందిన అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ప్రమేయం ఉందన్న విషయం సుప్రీంకోర్టులో నిర్ధారణ కావడంతో ఆయన పదవి నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. హింసాకాండ జరుగుతున్నప్పటి నుండి ప్రధానమంత్రి మోడీ ఈ రాష్ట్రంలో పర్యటించాలని, బాధిత ప్రజలను పరామర్శించాలన్న డిమాండ్ దేశ వ్యాప్తంగా వ్యక్తమైంది. తరచు విదేశీ పర్యటనలకు వెడుతున్న మోడీ దేశంలోని మణిపూర్‌ను విస్మరించిన విషయం పార్లమెంటులోనూ ప్రస్తావనకు వచ్చింది. సోషల్ మీడియాలోనూ పలు విమర్శలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో, తాజాగా జరిగిన పర్యటన తరువాతైనా బాధిత ప్రజానీకానికి ఊరట ఏమైనా లభించిందా అంటే ప్రశ్నార్థకమే! ఇంత ఆలస్యంగా జరిపిన కార్యక్రమంలోనూ 'మీతోనే ఉంటా' వంటి ఊకదంపుడు ప్రసంగానికి, బాధితుల పరామర్శకు మోడీ పరిమితమయ్యారు. ఎప్పుడు ఫలితాలిస్తాయో తెలియని రూ.8,500 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దీంతో మోడీ పర్యటన జరిగిన తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి.

మోడీ ఏమన్నారు?

'ఇక్కడ హింస ప్రజ్వరిల్లడం దురదృష్టకరం. ఈ రోజు నేను మీకు ఓ హామీ ఇస్తున్నాను. భారత ప్రభుత్వం మీతోనే ఉంటుంది. నేను కూడా మీ వెంటే ఉంటాను. రాష్ట్రంలో శాంతిని, సుస్థిరతను సాధిస్తాం' అని ప్రధాని అన్నారు. ప్రజల్లో పొదుపును పెంచి వారి జీవితాలను సుఖమయం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే జిఎస్‌టిని తగ్గించాం. ఫలితంగా మణిపూర్‌లో పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర ప్రజల ఇబ్బందులను తొలగించడానికి కేంద్రం సున్నితంగా వ్యవహరిస్తుంది. 2014కు ముందు మణిపూర్ వృద్ధి రేటు ఒక శాతం కంటే తక్కువగా ఉన్నది. ఇప్పుడు వేగవంతమైన రేటుతో దూసుకుపోతోంది' అని ఆయన అన్నారు.

నిరసనల వెల్లువ

బిజెపి పాలనలో మణిపూర్ తగలబడిపోయిందని పేర్కొంటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్, మణిపూర్ పీపుల్స్ పార్టీ (ఎంపిపి), మహిళా సంఘాలు, విద్యార్థుల ఆధ్వర్యాన ఆందోళనలు జరిగాయి. 'మోడీ గోబ్యాక్' అని నినదించారు. కాంగ్రెస్, ఎంపిపి ఆధ్వర్యంలో ఆయా పార్టీల కార్యకర్తలు ఇంఫాల్‌లో పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించారు. చారిత్రక కాంగ్లా కోట మిగతా 7లో

తప్పుచేస్తే ఏ పార్టీ వాళ్లయినా ఒక్కటే

- నిరసనల పేరుతో జరిగే కుట్రలను సహించొద్దు
- ఎస్‌పిలతో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాప్రతినిధులతో ఎస్‌పిలు సామరస్యంగా, సమన్వయంతో పనిచేయాలని, తప్పు చేస్తే మాత్రం ఏ పార్టీ వాళ్లనైనా శిక్షించాలని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఎస్‌పిల బదిలీల నేపథ్యంలో వివిధ జిల్లా ఎస్‌పిలతో శనివారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొందరు ఎస్‌పిలు ప్రత్యక్షంగా హాజరుకాగా, మరికొందరు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పే దానిలో మంచి ఉంటే పాటించాలని అన్నారు. తప్పు చేయాలని తనతో పాటు, కూటమి ప్రజాప్రతినిధులు ఎవ్వరూ చెప్పరని, ఇది తమ విధానమని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగుంటేనే పెట్టుబడులు వస్తాయని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో పాటు, గ్రోత్‌రేటు పెరుగుతుందన్నారు. రాజకీయముసుగులో నేరాలను ఉపేక్షించొద్దని, నేరాల తీరు మారిందని, కొత్త తరహా నేరాలు, కొత్త తరహా నేరస్తులు వచ్చారన్నారు. ఈ విషయంలో కూడా పోలీసులు అప్‌డేట్ కావాలని, నూటికి నూరు శాతం ఆధునిక సాంకేతికను వినియోగించుకోవాలన్నారు.. వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయంలో ఏం జరిగిందో ప్రతి పోలీస్ అధికారి స్టడీ చేయాలని, దారుణ హత్యను గుండెపోటు అని తొలుత అన్నారని, తర్వాత హత్య అని, ఆ నేరాన్ని తన పైకి నెట్టారన్నారు. సిబిఐ విచారణ కావాలని ఒకసారి, వద్దని మరోసారి అన్నారని చెప్పారు. దేశంలోమరే కేసులోనూ ఇన్ని మలుపులు లేవన్నారు. వాళ్ల కారు కిందపడి కార్యకర్త చనిపోతే కూడా పట్టించుకోలేదని, దాన్ని దాచి పెట్టారన్నారు. . క్రిమినల్ పాలిటిక్స్ ఎలా ఉంటాయో అర్థం చేసుకోవాలని అలాంటి వాళ్లు ఉన్న రోజుల్లో ప్రభుత్వం నడుపుతున్నామనేది ఎస్‌పిలందరూ గుర్తుంచుకోవాలని సిఎం చంద్రబాబునాయుడు సూచించారు. ప్రజాస్వామ్యంలో విపక్షాలు నిరసనలు తెలియజేయవచ్చని అదే సమయంలో కుట్రలకు తెరలేపితే సహించే ప్రసక్తే లేదన్నారు.

సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయండి:

సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయడంతో పాటు మహిళల వ్యక్తిత్వ హననం చేసే వాళ్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని ఎస్‌పిలను సిఎం ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలని అదే సమయంలో క్రిమినల్స్‌కు భయం కూడా ఉందే విధంగా పోలీసింగ్ ఉండాలన్నారు. తప్పు చేస్తే దొరికిపోతామనే భయం ఉంటే నేరాలు ఆటోమేటిక్‌గా తగ్గిపోతాయని సిఎం పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది రియాక్ట్, రీచ్, రెస్పాండ్, రిజల్ట్ విధానంలో పనిచేయాలన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు వెంటనే కింది స్థాయి సిబ్బందిపై వదిలేయకుండా నేరుగా ఎస్‌పిలు రియాక్ట్ కావాలన్నారు. అవసరమైతే సంఘటన జరిగిన ప్రదేశానికి ఎస్‌పిలు వెళితే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

భారీగా ఐపిఎస్‌ల బదిలీ

2

ఎస్‌ఐఆర్‌పై మాదే తుది నిర్ణయం

- సుప్రీంకోర్టుకు తెలిపిన ఇసి

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)ను ఎప్పుడు, ఎలా నిర్వహించాలో పూర్తిగా తమ అధికార పరిధిలోనే ఉంటుందని సుప్రీంకోర్టుకు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎస్‌ఐఆర్ ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించాలా లేదా కుదించి నిర్వహించాలా అనే నిర్ణయం 'పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది' అని తెలిపింది. ఎస్‌ఐఆర్ ప్రక్రియను తమ 'ప్రత్యేక అధికార పరిధి'కి వదిలివేయాలని సుప్రీంకోర్టును కోరింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, ఎన్నికల నియమాల నమోదు 1960 చట్టాలు ఎస్‌ఐఆర్ సమయంపై పూర్తి విచక్షణను ఎన్నికల సంఘానికి కట్టబెట్టాయని తెలిపింది. దేశ ఓటర్ల జాబితాలో నమోదైన విదేశీ చొరబాటుదారులను గుర్తించి, బహిష్కరించడానికి దేశవ్యాప్తంగా 'క్రమం తప్పకుండా' ఎస్‌ఐఆర్‌ను నిర్వహించాలని ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ విచారణలో ఇసి పైవిధంగా స్పందించింది. దేశవ్యాప్తంగా క్రమం తప్పకుండా ఎస్‌ఐఆర్‌ను నిర్వహించాలనే ఆదేశం మిగతా 7లో

గుంటూరు జిల్లాలో తీవ్ర విషాదం

పిడుగుపాటుకు నలుగురు మహిళా వ్యవసాయ కార్మికులు మృతి

దాసరి రాణి, శారమ్మ, డి సామ్రాజ్యం, టి నాగమ్మ

ప్రజాశక్తి- పెదనందిపాడు, పెదకాకాని

భారీ వర్షానికి గుంటూరు జిల్లాలో శనివారం వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడి నలుగురు మహిళా వ్యవసాయ కార్మికులు మృతి చెందారు. మృతుల్లో తోడి కోడళ్లు ఉన్నారు. మృతుల బాధిత కుటుంబ కథనం ప్రకారం... వ్యవసాయ కార్మికులైన పెదనందిపాడు మండలం అన్నపర్రుకు చెందిన తన్నీరు నాగమ్మ (49), దేవరపల్లి సామ్రాజ్యం (61) పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా వారిపై పిడుగు పడింది. దీంతో, వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. నాగమ్మకు భర్త, కుమారుడు, కుమార్తె, సామ్రాజ్యానికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెదకాకాని మండలం నంబూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన వ్యవసాయ కార్మిక మహిళలు నంబూరులో పొలం పనులు చేస్తుండగా వర్షం పడింది. దీంతో, దగ్గరలోని చెట్టు కిందకు వారంతా వెళ్లారు. ఆ చెట్టుపై పిడుగు పడడంతో ఒకే కుటుంబానికి చెందిన తోడికోడళ్లు దాసరి రాణి (42), దాసరి శారమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. యరమోతు మరియమ్మ, పాములు, మణికుమారి దాసరి ప్రభావతి గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రాణికి భర్త, కుమారుడు, శారమ్మకి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉదయం హుషారుగా పొలం పనులకు వెళ్లిన మహిళలు సాయంత్రం విగత జీవులుగా మారడంతో బాధితుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.

రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి..

పెదనందిపాడు, నంబూరుల్లో పిడుగుపాటుకు మరణించిన వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, ఎపి వ్యకాస జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు.

పాలస్తీనాకు అనుకూలంగా భారత్ ఓటు

- మారిన వైఖరి

న్యూయార్క్ : గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న నరమేధంపై భారత్ తన వైఖరిని మార్చుకుంది. పాలస్తీనాకు మద్దతుగా ఐక్యరాజ్య సమితిలో ఓటు వేసింది. కాల్పుల విరమణ పాటించాలంటూ ఐరాస గతంలో ఆమోదించిన తీర్మానాలపై ఓటింగ్ జరిగినప్పుడు భారత్ నాలుగు సందర్భాలలో గైర్హాజరవడాన్ని పలు దేశాలు, అంతర్జాతీయ సంస్థలు విమర్శించాయి. న్యూయార్క్‌లో శుక్రవారం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశం జరిగింది. పాలసీనా సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనాలన్న 'న్యూయార్క్ డిక్లరేషన్'కు భారత్ మద్దతు ప్రకటించింది. ఒకప్పటి పాలస్తీనా భూభాగంలో రెండు దేశాలను (యూదులకు ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజలకు పాలస్తీనా) ఏర్పాటు చేయడం ద్వారా ఇజ్రాయిల్ - పాలస్తీనా సమస్యకు పరిష్కారం సాధించాలన్న ప్రతిపాదనను సమర్థించింది. ఫ్రాన్స్ ప్రతిపాదించిన తీర్మానానికి భారత్ సహా 142 దేశాలు అనుకూలంగా ఓటేయగా, అమెరికా, ఇజ్రాయిల్‌సహా 10 దేశాలు వ్యతిరేకించాయి. 12 దేశాలు గైర్హాజరయ్యాయి.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

- మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి
- యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలో జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని

మహాసభలో ప్రసంగిస్తున్న మాలిని

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

హక్కుల సాధనకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఐక్య పోరాటాలు నిర్వహించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రెండు రోజులపాటు జరగనున్న ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం 5వ రాష్ట్ర మహాసభ అనంతపురంలోని గణేనాయక్ భవన్ (రంజనా నీరులా ప్రాంగణం)లో శనివారం ప్రారంభమైంది. తొలుత సంఘం జెండాను ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పద్మావతి ఎగురవేశారు. ఇటీవల మరణించిన మధ్యాహ్న భోజన కార్మికులకు, ఇతర కార్మికులకు, నేతలకు జోహార్లు అర్పించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరలక్ష్మి, ఎం.నాగమణి అధ్యక్షతన మహాసభ కొనసాగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాలిని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అతి తక్కువ వేతనంతో పిల్లలకు భోజనం వండి పెడుతున్నారని తెలిపారు. 30, 40 సంవత్సరాలుగా సేవలందించినా కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపూ ఉండడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగిస్తున్నారని వివరించారు. రోజువారీ కనీసం రూ.700 చొప్పున వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తోన్నా పాలకులు పట్టించుకోవడం తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులు అనారోగ్యానికి గురై ఆస్పత్రికి వెళ్లినా ఇతరులను ఏర్పాటు చేసి వెళ్లాలని, లేనిపక్షంలో రాజీనామా చేయాలని బెదిరింపులకు దిగుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెరిగిందంటే అది మధ్యాహ్న భోజనం పథకం వల్లేనని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నూతన విద్యావిధానం అమలు చేయడంతో ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు పెరిగి ప్రభుత్వ బడులు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల పేద విద్యార్థులకు, మధ్యాహ్న భోజనం కార్మికులకు నష్టం కలుగుతోందని వివరించారు. ప్రతి రోజూ పని చేస్తున్నా మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.3 వేలు మాత్రమే ఇవ్వడం ఏమి న్యాయమని ప్రశ్నించారు. ఇదీ కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. హర్యానాలో మిగతా 7లో

విశాఖలో స్విగ్గీ, జొమాటో రైడర్ల సమ్మె

- సేవలు బంద్ చేసిన 12 వేల మంది
- పలుచోట్ల నిరసనలు

పిఎం.పాలెంలో నిరసన తెలుపుతున్న స్విగ్గీ, జొమాటో, ఇన్‌స్టామార్ట్ రైడర్లు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విశాఖలో స్విగ్గీ, జొమాటో, ఇన్‌స్టామార్ట్ రైడర్లు సమ్మెకు దిగారు. శని, ఆదివారాల్లో తలపెట్టిన ఈ సమ్మె తొలిరోజు విజయవంతమైంది. 12 వేల మంది రైడర్లు తమ సేవలను బంద్ చేసి సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రభావం స్విగ్గీ, జొమాటో సంస్థలపై పడింది. పలు హోటళ్లు, రెస్టారెంట్లకు ఈ ప్లాట్ ఫారాలపై ఆహార పదార్థాలు ఆర్డర్ పెట్టుకున్న వారికి 'నాట్ డెలివరీ కరెంట్లీ' అన్న సందేశాలు వచ్చాయి. ద్వారకా నగర్, ఎంవిపి.కాలనీ, మధురవాడ, ఎన్ఎడి జంక్షన్, గాజువాక, పెందుర్తి, కూర్మన్నపాలెం సహా నగర వ్యాప్తంగా ఎక్కడికక్కడ స్విగ్గీ, జొమాటో రైడర్లు నిరసనలు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గతంలో ఇచ్చిన రేట్లు పునరుద్ధరించాలని, అన్యాయంగా తొలగించిన రైడర్లకు ఐడిలు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా డైమండ్ పార్క్ జంక్షన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ జొమాటో సంస్థ ఈ ఏడాది రూ.974 కోట్లు లాభం పొందిందని, దీని వెనుక రైడర్ల కష్టం ఉందని తెలిపారు. అలాంటి రైడర్ల సమస్యలను పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. విశాఖ జిల్లాలో ఏడు సంవత్సరాలుగా స్విగ్గీ, జొమాటో ప్లాట్‌ఫారాలపై పనిచేస్తున్న సుమారు 40 వేల మంది రైడర్లు పలు సమస్యలతో కునారిల్లుతున్నారని తెలిపారు. వారికి ఎటువంటి ఉద్యోగ భద్రతా, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రతా లేవన్నారు. ఏదైనా సమస్య వస్తే పరిష్కరించే నాథుడే కరువయ్యాడని తెలిపారు. రోజురోజుకూ పెరిగిపోతున్న జీవన ఖర్చులు, పెట్రోల్ ధరలు, అనిశ్చిత ఆదాయం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి మినిమం గ్యారెంటీ శాలరీ, ఇన్‌కం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీక్ టైం కంపల్సరీ విధానం తగ్గించాలని, ఒకే రకమైన ఇన్సెంటివ్ విధానం ఉండాలని, ఫేక్ నోటిఫికేషన్లను తొలగించాలని, క్యాన్సిలేషన్ ఫీజు చెల్లించాలని, బేస్ ఫెయిర్‌ను కనీసం రూ.30కు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, మిగతా 7లో

యువతి దారుణ హత్య

ప్రజాశక్తి- నెల్లూరు

మైథిలి

నెల్లూరులో కరెంట్ ఆఫీస్ సెంటర్ సమీపంలోని పోస్టల్ కాలనీలో శనివారం వేకువజామున ఓ యువతి దారుణ హత్యకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి ప్రాంతానికి చెందిన మైథిలి ప్రియ (25) వెంకటాచలంలోని ఓ నర్సింగ్ కళాశాలలో బి.ఫార్మసీ చదువుతున్న రోజుల్లో అదే కళాశాల తోటి విద్యార్థి రాం నిఖిల్‌తో పరిచయం ఏర్పడింది. కొన్ని రోజుల అనంతరం వీరు విడిపోయారు. ఆమె నెల్లూరులోని తన చెల్లెలు ఇంటికి వచ్చినట్లు తెలుసుకొని శుక్రవారం రాత్రి నిఖిల్ ఫోన్ చేశాడు. మాట్లాడాలని, తన గదికి రావాలని కోరారు. ఈ విషయం తన చెల్లికి చెప్పి అక్కడికి వెళ్లిన మైథిలిని శనివారం వేకువజామున మూడు గంటల సమయంలో నిఖిల్ హత్య చేశాడు. పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని ఒప్పుకున్నాడు. తన ప్రేమను తిరస్కరించినందుకే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు సమాచారం.

విజయవాడ ఆర్‌ఆర్‌పేటలో ఇళ్లలోనే ఉండిపోయిన వృద్ధురాలిని, బాలికను కుటుంబ సభ్యుల సాయంతో ప్రత్యేక వైద్య శిబిరానికి తీసుకువెళుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు

ఆందోళనకరంగానే అతిసార

- 273కు చేరిన బాధితుల సంఖ్య
- అనధికారికంగా 500 పైనే...
- దసరా ఉత్సవాల నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు
- మంత్రి నారాయణ పర్యటన

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడ నగరంలోని న్యూ రాజరాజేశ్వరిపేటలో అతిసార అదుపులోకి రాలేదు. గంటగంటకూ కేసుల సంఖ్య పెరుగుతోంది. దీంతో, ప్రత్యేక వైద్య శిబిరం, జిజిహెచ్ అతిసార రోగులతో కిటకిటలాడుతోంది. శనివారం రాత్రికి అధికారికంగా మొత్తం కేసులు 273కు చేరాయి. మొత్తం బాధితుల్లో ప్రస్తుతం 121 మంది ప్రత్యేక వైద్య శిబిరం, విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 152 మంది చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. సాయంత్రం నాలుగు గంటల సమయానికి 263 కేసులు ఉండగా, మిగతా 7లో

సైన్స్ ఫలితాలు కొన్ని వర్గాలకే పరిమితం

పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జనరల్ సెక్రెటరీ ఆషామిత్రా

విజయనగరంలో జెవివి రాష్ట్ర మహాసభ ప్రారంభం

మహాసభలో ప్రసంగిస్తున్న ఆషామిత్రా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా సైన్స్ ఫలితాలు కొన్ని వర్గాలకే పరిమితమయ్యాయని. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జనరల్ సెక్రెటరీ ఆషామిత్రా అన్నారు. విజయనగరంలోని గురజాడ అప్పారావు ప్రాంగణం (జిల్లా పరిషత్ సమావేశ హాలు)లో రెండు రోజులపాటు జరగనున్న జెవివి 18వ రాష్ట్ర మహాసభ శనివారం ఘనంగా ప్రారంభమైంది. వైద్యులు, ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, జర్నలిస్టులు తదితర రంగాలకు చెందిన మేధావులు హాజరయ్యారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్ అధ్యక్షతన జరిగిన మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ సమయంలోనే ప్రజాసైన్స్ ఉద్యమానికి బీజాలు పడ్డాయని, మేఘనాథ్ సాహా, బిసి రాయ్ వంటి శాస్త్రవేత్తలు సామాన్య ప్రజలకు సైన్స్ ఉపయోగపడేలా కృషిచేశారని వివరించారు. ఆ తర్వాత కాలంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ వల్ల సైన్స్ ఫలితాలు కొన్ని వర్గాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం, సమానత్వం ఎక్కడ ఉంటుందో అక్కడే సైన్స్ అభివృద్ధి చెందుతుందన్నారు. దీనికి ఆయువు పట్టులాంటి రాజ్యాంగ ఉల్లంఘన జరగడం ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో దక్షిణ భారత దేశంలో బలమైన సైన్స్ ఆర్గనైజేషన్‌గా జన విజ్ఞాన వేదిక పనిచేస్తోందన్నారు. ప్రజాసైన్స్ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా కర్తవ్యాలు తీసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. సైన్సును సరళీకృతం చేసి సామాన్య ప్రజలకు చెరువు చేసే పనిని పీపుల్స్ సైన్స్ ఉద్యమం కూడా తోడ్పాటు నందిస్తోందన్నారు.

సోషల్ సైన్స్‌తోనే సమాజాభివృద్ధి : ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

సోషల్ సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, అందుకనుగునంగా జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. నేటి పరిస్థితుల్లో సమాజంలో శాస్త్ర విజ్ఞానం మిళితం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన వక్తగా హాజరైన నాగేశ్వర్ మాట్లాడుతూ... ఓవైపు శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, అదే స్థాయిలో మూఢ నమ్మకాలు, విశ్వాసాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ శాస్త్ర విజ్ఞాన ఫలితాలు సాధారణ ప్రజానీకానికి అందకపోవడమే ఇందుకు కారణమన్నారు. దీనికితోడు రకరకాల శక్తులు మూఢనమ్మకాలను, అంధవిశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా వ్యాపింపజేస్తున్నాయని వివరించారు. ప్రజల జీవితాల్లో మార్పుకోసం కాకుండా లాభాల కోసం, కొందరి ప్రయోజనాల కోసం, యుద్ధాల కోసం శాస్త్ర విజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారని విమర్శించారు. మతంపై కాకుండా, మతం మత్తులోకి లాగే సంస్థలకు వ్యతిరేకంగా పనిచేయాలని కోరారు. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, మూఢ నమ్మకాలతో నష్టపోయే ప్రజలకు అండగా నిలబడాల్సిన అవసరం జనవిజ్ఞానవేదికపై ఉందన్నారు.

జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు అతిథులకు ఆహ్వానం పలకగా. ఆహ్వాన సంఘం అధ్యక్షులు (జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) డివి రమణ స్వాగతోపన్యాసం చేశారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ తొలి పలుకులు పలికారు. మహాసభ ప్రారంభ సూచికగా జెవివి జెండాను నారు సింహాద్రినాయుడు, జాతీయ జెండాను ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు జెఎసి చైర్మన్ విద్యాసాగర్, తెలంగాణ జెవివి తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రాజేశ్వరరావు, రాజా తమ సందేశాలు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రమణ్యం, పాకలపాటి రఘువర్మ మాట్లాడారు. విజ్ఞానం, శాస్త్రీయం, అభ్యుదయ గేయాలతో సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆలోచింపజేశాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వైషమ్యాలు సృష్టించే వారి ఉచ్చులో పడొద్దు

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారి ఉచ్చులో పడొద్దని, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని కూటమి పార్టీల శ్రేణులకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెల్స్ రూపంలోనూ, విశ్లేషకుల ముసుగులోనూ రెచ్చగొట్టేవారిని, అభ్యంతరకర రీతిలో మాట్లాడేవారిని న్యాయ సంహిత ప్రకారం చట్టం ముందు నిలపాలన్నారు. వీరి వెనుక ఉండి వ్యవస్థీకృతంగా రెచ్చగొట్టి కుట్రలు చేసే వారిపై ఫిర్యాదులు చేసి కేసులు నమోదు చేయించాలన్నారు. మచిలీపట్నం వివాదం విషయంలో పార్టీలో అంతర్గత విచారణ చేయాలని నాయకులకు ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో పాలుపంచుకున్న వారికి నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలన్నారు. కులాల మధ్య విభేదాలు తీసుకొచ్చే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదులు చేయాలన్నారు. ఎవరూ ఆవేశాలకు లోనై ఘర్షణలకు తావియ్యొద్దని హితవు పలికారు. రాష్ట్రంలో అభివృద్ధి దిశగా సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్న ఈ తరుణంలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేలా కుట్రలు మొదలయ్యాయని, ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రాంతీయ అసమానతలు సమసిపోవాలి

- జెవివి రాష్ట్ర మహాసభలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

జెవివి రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రాంతాల మధ్య అసమానతలు, విద్య, వైద్యం, జీవన ప్రమాణాల్లో వెనుకబాటుతనం పోయినప్పుడే రాష్ట్ర సమగ్రాభివృద్ధి జరుగుతుందని విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి' అనే అంశంపై జెవివి రాష్ట్ర మహాసభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రం విడిపోయి 11 ఏళ్లయినా అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ అని కేంద్ర ప్రభుత్వం, స్వర్ణాంధ్రప్రదేశ్ కావాలని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటనలు చేశాయని, అందులో భాగంగానే పి4 విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదలను ధనిక కుటుంబాలు దత్తత తీసుకోవాలన్నది దీని లక్ష్యమని, మరి రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. నాల్గవ ఆర్థిక వ్యవస్థగా మన దేశం ముందుకు వచ్చిందని రెండేళ్ల క్రితం నీతి ఆయోగ్ ప్రకటించిందన్నారు. ఆర్థిక వ్యవస్థ పెద్దదై ఉండొచ్చు కానీ అందులో ఉన్న గణాంకాలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన దేశంలో 40 శాతం సంపద ఒక్క శాతం కుటుంబాల్లోనే ఉందని తెలిపారు. 125 దేశాల్లో ఆకలి సూచీలో 111వ స్థానంలో మన దేశం ఉందని, 80 శాతంగా ఉన్న బడుగు బలహీన వర్గాల కోసం నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థ ఏమి చేసిందని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే ప్రాంతాల మధ్య సమతుల్యత, సుస్థిర అభివృద్ధి, మానవాభివృద్ధి జరగాలన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాలు విద్య, ఆరోగ్యంలో, పారిశ్రామికంగా, జీవన ప్రమాణాల్లో వెనుకబాటు తనంలో ఉన్నాయన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే అసమానతలు లేకుండా పోతాయని వివరించారు. మానభివృద్ధిలో 130 స్థానంలో ఇండియా ఉందని, దివాళా తీసిన శ్రీలంక 92 స్థానంలో ఉందన్నారు. మన రాష్ట్రం అన్ని విభాగాల్లో 12వ స్థానంలో ఉందని వివరించారు. రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీలకు 60 శాతం కేంద్రం, రాష్ట్రం 40 శాతం నిధులు మంజూరు చేయాలని, కానీ ప్రస్తుత ప్రభుత్వం పిపిపి మోడ్‌లో ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయం చేయడం ప్రమాదకరమన్నారు. ఇసుక,మైనింగ్ దోపిడీని అరికట్టాలన్నారు. జిల్లాలో అభివృద్ధికి కావలసిన వాటిపై అధ్యయనం చేసి పోరాటాలకు రూపకల్పన చేసి ప్రభుత్వాలు దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు.

భారీగా ఐపిఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఐపిఎస్‌లను బదిలీ చేసింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 1690ని శనివారం విడుదల చేసింది. రాష్ట్రంలో 14 జిల్లాలకు కొత్త ఎస్‌పిలను నియమించింది. 7 జిల్లాలకు కొత్త అధికారులను నియమించగా, మరో 7 జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి బదిలీ చేసింది. 12 జిల్లాల్లో ప్రస్తుతం ఉన్నవారినే ఎస్‌పిలుగా కొనసాగించింది. ప్రకాశం ఎస్‌పి ఎఆర్ దామోదర్‌ను విజయనగరం ఎస్‌పిగా బదిలీ అయ్యారు. గుంతకల్లు రైల్వే ఎస్‌పి రాహుల్ మీనా.. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ ఎస్‌పిగా, అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు కృష్ణా జిల్లా ఎస్‌పిగా నియమితులయ్యారు. విజయనగరం ఎస్‌పి వకుల్ జిందాల్ గుంటూరు ఎస్‌పిగా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ ఎస్‌పి బి కృష్ణారావు పల్నాడు ఎస్‌పిగా, సిఐడి ఎస్‌పి (అడ్మిన్)గా ఉన్న డి ఉమామహేశ్వర్ బాపట్ల ఎస్‌పిగా ప్రభుత్వం బదిలీ చేసింది.

తిరుపతి ఎస్‌పి హర్షవర్ధన్ రాజును ప్రకాశం ఎస్‌పిగా, విశాఖపట్నం డిసిపి (లా అండ్ ఆర్డర్) నెల్లూరు ఎస్‌పిగా నియమితులయ్యారు. తిరుపతి కేంద్రంగా ఎర్రచందనం నిరోధక టాస్క్‌ఫోర్స్ ఎస్‌పిగా ఉన్న ఎల్ సుబ్బరాయుడు తిరుపతి ఎస్‌పిగా బదిలీ అయ్యారు. బాపట్ల ఎస్‌పి తుషార్‌దుడిని చిత్తూరు ఎస్‌పిగా, అల్లూరి సీతారామరాజు అడిషనల్ ఎస్‌పిగా ఉన్న ధీరజ్ కునుబిల్లిని అన్నమయ్య జిల్లా ఎస్‌పిగా ప్రభుత్వం నియమించింది. ఇంటెలిజెన్స్ ఎస్‌పి నాచికేత్ విశ్వనాథ్‌ను కడప ఎస్‌పిగా, విశాఖపట్నం గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ సునీల్ సెహరాన్‌ను నంద్యాల ఎస్‌పిగా, గుంటూరు (అర్బన్) ఎస్‌పి సతీష్‌కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పిగా ప్రభుత్వం బదిలీ చేసింది.

7న రాష్ట్రస్థాయి ధర్నా

- ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ, విద్యారంగ, ఆర్థిక పరమైన సమస్యలపై అక్టోబరు 7న రాష్ట్రస్థాయి ధర్నాకు ఫ్యాప్టో పిలుపునిచ్చింది. ఈ మేరకు ఫ్యాప్టో చైర్మన్ ఎల్ సాయిశ్రీనివాస్, ఎస్ చిరంజీవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని, మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీరాజ్ యాజమాన్యం వద్ద పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని, కలెక్టర్ పూల్ ద్వారా వెంటనే పోస్టింగులు ఇవ్వాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57ను అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోపిమూర్తి

తిరుపతిలో నేడు మహిళా సాధికారత జాతీయ సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి వేదికగా ఆది, సోమవారాల్లో తొలిసారి మహిళా సాధికారతపై పార్లమెంటరీ, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. సంబంధిత శాఖాధికారులు, పోలీసు విభాగం, ట్రాఫిక్ సిబ్బంది, ఆరోగ్య, మున్సిపల్ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం తిరుపతి రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.50 గంటలకు లోక్‌సభ స్పీకర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర శాసన వ్యవహారాల శాఖ మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, పార్లమెంట్, అసెంబ్లీల మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్లు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 15న ఉదయం 10 గంటలకు రాష్ట్ర గవర్నర్, ఇతర ప్రముఖులు ప్రసంగిస్తారు.

కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ పున:ప్రారంభించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి
- 17, 18 తేదీల్లో మహిళా లెక్చరర్ల దీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే పున:ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపిమూర్తి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాలేజీస్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన విజయవాడలోని మాకివేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులు వై జాన్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోపిమూర్తి మాట్లాడారు. గత ప్రభుత్వం జిఓ 114ను తీసుకొచ్చి కొన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసిందని చెప్పారు. ఈ జిఓను విద్యాశాఖలో కూడా అమలు చేసి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా క్రమబద్ధీకరించకపోవడం అన్యాయమన్నారు. రానున్న శాసనమండలి సమావేశాల్లో క్రమబద్ధీకరణ అంశాన్ని ప్రస్తావిస్తానని చెప్పారు. ఇప్పటికే ఈ అంశంపై ప్రభుత్వానికి ప్రశ్నను పంపించానని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై జాన్‌బాబు, మాణిక్యం మాట్లాడుతూ.. క్రమబద్ధీకరణ జరిగేలోపు గతంలో అమలు చేసిన 12 నెలల రెన్యువల్, 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ పెంపు, 2024-25 మే నెల వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాయిరాజు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల పోస్టులను మినహాయించి ఖాళీ పోస్టులను ఎపిపిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి కె ప్రసన్నకుమార్ రెగ్యులర్ కోసం చేసే ఆందోళనకు విద్యార్థుల తరపున మద్దతు ఉంటుందని చెప్పారు. ఎపి రైతు సంఘం అధ్యక్షులు వి కృష్ణయ్య, ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎం సూర్యారావు, డిగ్రీ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షులు దాసరి రాజు, 108 ఉద్యోగుల సంఘం నాయకులు వై రమేష్, కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర నాయకులు కె వాసవి, ఎయిడెడ్ అసిసోయేషన్ రాష్ట్ర నాయకులు టీ ప్రేమ్‌కుమార్, మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు విజయ్ ప్రసంగించి వారి మద్దతు తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో మహిళా కాంట్రాక్టు లెక్చరర్లతో 36 గంటల దీక్ష చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జివిఎల్ మాణిక్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బిజె గాంధీ, ట్రెజరర్ కె రత్నకుమారి, పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో కుండపోత

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గుంటూరులో దాదాపు రెండు గంటలపాటు ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. నగరంలోని పలు లోతట్టు కాలనీల్లోకి వరద నీరు చేరింది. రహదారులు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంటూరులోని మూడు వంతెనల రహదారి, కంకర గుంట ఆర్‌యుబి వద్ద నీరు నిలిచింది. తెనాలి, పొన్నూరు, మంగళగిరి, గుంటూరు నియోజకవర్గాల్లోని పొలాల్లోకి నీరు చేరడంతో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. పల్నాడు జిల్లాలోని అమరావతి, సత్తెనపల్లి, నర్సరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

విరిగిపడిన కొండచరియలు

ప్రకాశం రాచర్ల మండలం జె.పుల్లల చెరువు గ్రామ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో నెమలిగుండ్ల రంగనాయక స్వామి గుడి సమీపంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. శనివారం ఉదయం 11 గంటలకు మూడు పెద్దపెద్ద బండరాళ్లు విరిగిపడి రహదారిపై పడ్డాయి. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు ఆలయం వద్దకు వెళ్లే రహదారిని మూసివేశారు. ఆలయానికి వస్తున్న యాత్రికులను తిరిగి వెనక్కు పంపారు.

గుంటూరు జిల్లా బ్రాడీపేటలో నీటమునిగిన కాలనీ రహదారి

గోదావరికి మళ్లీ వరద

గోదావరికి మళ్లీ వరద తాకిడి మొదలైంది. భద్రాచలంలో 32 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతుంది. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. వేలేరుపాడు మండలంలో ఎడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్‌వే శనివారం నీట మునిగింది. దీంతో కోయిదా, కట్కూరు, టేకూరు, యడవల్లి తదితర సుమారు 15 గ్రామాలకు మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. పోలవరం నుంచి 4,35,010 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

సీతారాం ఏచూరి వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎంఎ గఫూర్, వేదికపై కె ప్రభాకర్‌రెడ్డి, గౌస్‌దేశాయ్ తదితరులు

కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం

- ఏచూరి వర్ధంతి సభలో ఎంఎ గఫూర్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే సీతారాం ఏచూరికి అర్పించే ఘనమైన నివాళి అని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. కర్నూలు నగరంలో ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో శనివారం సిపిఎం పూర్వపు ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సభ జరిగింది. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో "వర్తమాన రాజకీయాలు- సిపిఎం వైఖరి" అనే అంశంపై గఫూర్ మాట్లాడారు. సీతారాం ఏచూరి భారత రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించారన్నారు. బిజెపి మతోన్మాదాన్ని ఎదుర్కోకపోతే దేశం 50 యేళ్లు వెనక్కి వెళ్తుందని సీతారాం చెప్పేవారని తెలిపారు. చంద్రబాబు, జగన్, పవన్ ముగ్గురు ఏకమై ఈ రాష్ట్రాన్ని నరేంద్ర మోడీకి తాకట్టు పెట్టారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ మాట్లాడారు. జిల్లా నాయకులు జి రామకృష్ణ, ఎన్ అలివేలు, నగర నాయకులు ఎం విజయ్, నరసింహులు, నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఇ. రాజు బృందం విప్లవ గీతాలు ఆలపించారు.

ప్రజల్లో సంతృప్తే ముఖ్యం : చంద్రబాబు

- రేపు, ఎల్లుండి కలెక్టర్ల కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం అందిస్తున్న పౌరసేవలతో పాటు అమలుజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తే ముఖ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అందుకనుగుణంగానే మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్సుపై మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. పౌరసేవలు, సంక్షేమ పథకాలపై పబ్లిక్ పర్సెప్షన్‌ను విశ్లేషిస్తున్నామని సిఎం చెప్పారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 10.5 శాతం వృద్ధి రేటుకు చేరుకున్నామని తెలిపారు. 2029 నాటికి జిఎస్‌డిపి రూ.29 లక్షల కోట్లకు చేరే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. 2034కు తలసరి ఆదాయం రూ.10.55 లక్షలకు చేరేలా కార్యాచరణ చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిఎస్‌డిపిలో వ్యవసాయం అనుబంధ రంగాలే కీలకంగా ఉన్నాయని చెప్పారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, రాష్ట్రస్థాయిలో విభాగాధిపతులు పనిచేయాల్సి ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 3 శాతం వృద్ధి తగ్గిన కారణంగా రాష్ట్రం సుమారుగా రూ.6 లక్షల కోట్ల సంపద కోల్పోయిందని అన్నారు. ఈసారి జిల్లా కలెక్టర్ల సదస్సును విభిన్నంగా నిర్వహించాలని ఆదేశించారు. పౌరసేవలు, పథకాల అమలుపై జిల్లాల వారీ జవాబుదారీతనం ఉండేలా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంక్షోభ సమయాల్లో సరిగ్గా స్పందిస్తేనే ప్రజల్లో విశ్వాసం, నమ్మకం పెరుగుతాయని చెప్పారు. ఆర్‌టిజిఎస్ ద్వారా నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగువారిని వెనక్కు తీసుకొచ్చే ఆపరేషన్ విజయవంతమైందని, మంత్రి నారా లోకేష్ సహా అధికారులు కృషి చేశారని కొనియాడారు. జిఎస్‌టిని రెండు స్లాబులకు కుదిస్తూ తెచ్చిన సంస్కరణ విజయవంతమైందన్నారు. రాష్ట్రంలోనూ నాలా పన్ను రద్దు చేసి నెక్స్‌జెన్ సంస్కరణను అమలు చేశామని తెలిపారు. దీనిపై మరింత అధ్యయనం చేసేందుకు మంత్రులు, అధికారులతో కమిటీ వేయాలని సూచించారు. చిన్నచిన్న కోర్టు వివాదాల కారణంగా ప్రభుత్వ సమయంతో పాటు ధనం వృథా అవుతోందని పేర్కొన్నారు. ఆర్బిట్రేషన్ ద్వారా కొన్ని అంశాలను పరిష్కరించుకునే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు.

అమరావతిలో నిర్మించే ఎన్‌టిఆర్ విగ్రహం, కృష్ణానదిపై చేపట్టనున్న ఐకానిక్ వంతెన డిజైన్లను సిఎం చంద్రబాబు సమీక్షించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, భాష, సాహిత్యం, కళలు, ప్రాచీన చరిత్ర తదితర అంశాలకు పెద్దపీట వేస్తూ దీనిని చేపట్టాలని సూచించారు.

రాష్ట్రంలో బెంబేలెత్తిస్తున్న విష జ్వరాలు

- గుంటూరు జిల్లాలో కొత్త రెడ్డిపాలెంలో తీవ్రం

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో విషజ్వరాలు బెంబేలెత్తిస్తున్నాయి. వందలాది మంది మంచాన పడ్డారు. గుంటూరు జిల్లాలో ఇటీవల తురకపాలెంలో జ్వరాలు, ఇతర కారణాలతో రెండు నెలల్లో 22 మంది చనిపోగా..అక్కడ పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది. ఇదే నేపథ్యంలో జిల్లాలోని చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెంలోనూ జ్వరాలు విస్తరిస్తున్నాయి. ఒక ఆశా కార్యకర్త చనిపోయారు. దీంతో వైద్య బృందాలు గ్రామంలో ఇంటింటికి తిరిగి జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహించారు. ఐదుగురిలో కొకొయ్ బ్యాక్టీరియా లక్షణాలు ఉన్నట్టు తేలింది. అయితే మెలియోయిడోసిస్ లక్షణాలేవని వైద్యులు తెలిపారు. తురకపాలెంలో సంభవించిన బ్యాక్టీరియాకు కొత్త రెడ్డిపాలెంలో నెలకొన్న సమస్యలకు సంబంధం లేదన్నారు. కాగా కొత్తరెడ్డిపాలెంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు.

ఆత్మకూరు గురుకులంలో..

నెల్లూరు జిల్లా ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు విషజ్వరాలు ప్రబలాయి. ఇక్కడ 434 మంది విద్యార్థినులున్నారు. వీరిలో 13 మంది జ్వరాల బారినపడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పాఠశాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

15న లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి

- బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడికి ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో కార్మికులు వేల సంఖ్యలో పాల్గొనాలని ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ రమణరావు, ఆర్‌వి నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు నుంచి అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను గత వైసిపి ప్రభుత్వం ఆపేసి భవన నిర్మాణ కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసిందని గుర్తుచేశారు. వెల్ఫేర్ బోర్డును పునురుద్ధరించి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీనిచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా ఈ హామీ అమలు కావడం లేదని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు ఆయా రాష్ట్రాల వెల్ఫేర్ బోర్డుల ద్వారా వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో రూ.3 వేల కోట్ల నిధులు ఉండి ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే కూటమి ప్రభుత్వం బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకాల అమలు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాదని తెలిపారు. అవసరమైన నిధులు చట్ట ప్రకారం వసూలు చేసిన సెస్ ద్వారా బోర్డులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేదంటే భవిష్యత్తులో జరగబోయే సమరశీల పోరాటాలకు ప్రభుత్వమే పూర్తి నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కొనసాగుతోన్న అల్పపీడనం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాయువ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల్లో అల్పపీడనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ తెలిపారు. రానున్న 48 గంటల్లో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గడ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అల్పపీడనానికి అనుబంధంగా ఛత్తీస్‌గడ్, విదర్భ మీదుగా దక్షిణ మహారాష్ట్ర వరకు ద్రోణి కొనసాగుతుందన్నారు. ఈ ప్రభావంతో ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ నెల 14న శ్రీకాకుళం, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు. బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

లింగపాలెంలో 87.2 మిల్లీమీటర్ల వర్షపాతం

రాష్ట్రంలోని పలుచోట్ల శనివారం వర్షపాతాలు నమోదయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి, ఏలూరు జిల్లా లింగపాలెంలో శనివారం సాయంత్రం 5 గంటలకు 87.2 మిల్లీమీటర్లు, గుంటూరు జిల్లా పెదకాకానిలో 77.2, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో 75, గుంటూరు జిల్లా వల్లభాపురంలో 74, గుంటూరులో 72.2, నూజివీడులో 71, కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో 70.7, కౌతవరంలో 70.2, ప్రకాశం జిల్లా దర్శిలో 68.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా 47 ప్రాంతాల్లో 40 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

మద్యం మత్తులో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎగువ తాడికొండకు చెందిన తోయక చంద్రశేఖర్ (32) మద్యం మత్తులో శుక్రవారం రాత్రి తన గొంతు తానే కోసుకున్నారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆయన చనిపోయారు. చంద్రశేఖర్ పుట్టకతోనే మూగవాడని, మతిస్థిమితం కూడా సరిగా ఉండేది కాదని బంధువులు తెలిపారు.

కలర్‌షైన్ ఫ్యాక్టరీలో భారీ ప్రమాదం

- జింక్ ద్రావణం పడి కార్మికుడు మృతి
- మరో 10 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా గూడూరు రూరల్ పరిధిలోని 'కలర్‌షైన్' ఫ్యాక్టరీలో శనివారం భారీ ప్రమాదం చోటుచేసుంది. ఈ ప్రమాదంలో జింక్ ద్రావణం మీద పడి ఒక కార్మికుడు చనిపోయారు. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత నెల్లూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమించడంతో చెన్నయ్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి జిల్లా గూడూరు రూరల్ పరిధిలోని తుంగపాలెంలో 'కలర్‌షైన్' పరిశ్రమ ఉంది. ఇందులో రంగురంగుల లేటెస్టు రేకులను తయారు చేస్తుంటారు. జింక్‌పాట్ (తొట్టె) వద్ద 600 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. హైడ్రోజన్ ఎంత వాల్యూమ్ ఉందో తెలుసుకునేందుకు సల్ఫర్ రాడ్‌ను వెలిగిస్తారు. అందులో గ్యాస్ తక్కువ మోతాదులో ఉంటే ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఎక్కువ మోతాదులో గ్యాస్ నిల్వలు ఉంటే ప్రమాదం. శనివారం ఎప్పటిలాగే హైడ్రోజన్ వాల్యూమ్ ఎంత ఉందో గుర్తించే ప్రయత్నం చేయగా గ్యాస్ నిల్వలు ఎక్కువగా ఉండడంతో ఒత్తిడికి గురై జింక్‌పాట్ ఒక్కసారిగా పగిలిపోయింది. జింక్ ద్రావణం మొత్తం వెదజల్లి అక్కడ ఉన్న పది మంది మెయింటినెన్స్

పరిశ్రమలో జింక్‌పాట్ ప్రదేశం, ఇన్‌సెట్‌లో (మృతుడు ఆదిత్యకుమార్ ఫైల్)

డిపార్టుమెంట్ కార్మికులపై పడింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్యకుమార్ (30) జింక్‌పాట్‌లో పడి శరీరం పూర్తిగా ద్రవంలో కరిగిపోయింది. శ్యాంసుందర్, సతీష్‌కుమార్, అమాన్‌దివేది, సోమియాపాండా, హీరేంద్రప్రతాప్ సింగ్, బబ్బులు భగత్, శశికాంత్ మిశ్రా, విక్కీకుమార్, గణేష్‌రాయ్, అభ్యకుమార్ సింగ్‌కు గాయాలవడంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలవడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నయ్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఓ కార్మికునికి కంట్లో జింక్ ద్రావణం పడడంతో కన్ను పోయినట్లు సమాచారం. గూడూరు రూరల్ సిఐ కిషోర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగిందని, ఒకరు మృతిచెందారని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్యకుమార్ చనిపోయినట్లుగా గుర్తించామని తెలిపారు. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ ప్రసాద్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుడు ఆదిత్యకుమార్‌కు భార్య, మూడేళ్ల బాబు, మూడు నెలల పాప ఉన్నారు. మృతదేహం కరిగిపోవడంతో తోటి కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. భార్య బాధ వర్ణనాతీతం. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబ పోషణకు ప్రతినెలా కొంత నగదును కంపెనీ నుంచి కుటుంబ సభ్యులకు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. గాయపడిన క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున ఇవ్వాలని, మెరుగైన చికిత్స అందించి వారిని కాపాడాలని కోరుతున్నారు.

ఉత్తరాంధ్రకు ఆయువుపట్టు భోగాపురం విమానాశ్రయం

- జూన్ 2026కు నిర్మాణం పూర్తి
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- డిసెంబర్‌లో వేలిడేషన్ ఫ్లైట్

ప్రజాశక్తి-విజయనగరంకోట, భోగాపురం

భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు ఆయువుపట్టుగా నిలుస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. భోగాపురంలో నిర్మాణదశలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విమానాశ్రయ నిర్మాణ పనులు చేపడుతున్న జిఎంఆర్ అధికారులతో సమీక్ష సమావేశంలో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న నిర్మాణ పనుల గురించి మంత్రికి అధికారులు వివరించారు. అనంతరం రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడుతున్న జూన్ 2026 నాటికల్లా విమానాశ్రయ నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమవుతుందని తెలిపారు. గడిచిన 14 నెలలుల్లో 86 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్

భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు

నాటికి వ్యాలిడేషన్ ఫ్లైట్‌ను రన్ చెస్తామని తెలిపారు. మూలపేటలో పోర్టు, భోగాపురంలో ఎయిర్ పోర్ట్, విశాఖపట్నంలో ఐటి విప్లవం ద్వారా భవిష్యత్‌లో ఉత్తరాంధ్ర మరింత వృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఆర్‌డిఒ డి కీర్తి, డిఎస్‌పి శ్రీనివాసరావు, జిఎంఆర్ సిఇఒ కన్వర్‌బీర్ సింగ్ కలరా, సిడిఒ కోటేశ్వరరావు, ప్రాజెక్ట్ హెడ్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులను రద్దు చేయాలి

- 15 నుండి యుటిఎఫ్ రణభేరి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయులకు పాఠశాలల్లో బోధనేతర పనులను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఈ నెల 15 నుండి 19 వరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు జాతాల బృందాలతో రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం యుటిఎఫ్ కర్నూలు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం కూడా గత వైసిపి ప్రభుత్వం తరహాలోనే ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగిస్తోందని విమర్శించారు. ఎన్నికల వేళ ఉపాధ్యాయులను బోధనకు తప్ప ఇతర కార్యక్రమాలకు వినియోగించబోమని చెప్పిన టిడిపి కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో మాదిరే బోధనేతర పనుల భారం మోపుతోందని విమర్శించారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను ప్రకటించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి ఉద్యోగోన్నతులను కల్పించాలని, సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జాతాల కార్యాచరణ ఇలా ..

రణభేరికి ఐదు ప్రాంతాల నుండి ఐదుగురు రాష్ట్ర నాయకులు ఇన్‌ఛార్జులుగా ఉంటారని తెలిపారు. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణ గుంటూరు, తూర్పురాయలసీమ, పశ్చిమ రాయలసీమ ప్రాంతాల నుండి జాతాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. జాతా బృందాలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అక్కడ ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకుంటాయని తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె సురేష్‌కుమార్, కర్నూలు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి పాల్గొన్నారు.

మ్యాప్ ద్వారా పనులు పరిశీలిస్తున్న ఎంటి కృష్ణబాబు

2026 అక్టోబర్‌కు మచిలీపట్నం పోర్టు సిద్ధం

- ఎంటి కృష్ణబాబు

ప్రజాశక్తి- మచిలీపట్నం రూరల్

2026 అక్టోబర్ కల్లా మచిలీపట్నంలో పోర్టు కార్యకలాపాలు ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణ రహదారులు భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు తెలిపారు. నార్త్, సౌత్ బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్, బెర్తులు, రహదారులు, పరిపాలన భవనాలు, గిడ్డంగుల నిర్మాణాలు తదితర పనుల పురోగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎపి మారిటైం బోర్డు సిఇఒ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మీడియాతో కృష్ణబాబు మాట్లాడుతూ... రూ.5,500 కోట్ల వ్యయంతో చేపట్టిన మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసి 2026 అక్టోబర్ కల్లా పోర్టు రవాణా కార్యకలాపాలను ప్రారంభించాలనే కృత నిశ్చయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని తెలిపారు. ప్రణాళికలో భాగంగా మొత్తం 16 బెర్తులను ఏర్పాటు చేస్తున్నామని, మొదటి దశలో నాలుగు బెర్తులను సమయానికి పూర్తి చేసి కార్యకలాపాలను ప్రారంభిస్తామని, మిగిలిన బెర్తుల నిర్మాణ పనులను కొనసాగిస్తామని, ప్రస్తుతానికి 50 శాతం మేర పనులు పూర్తయినట్లు తెలిపారు. త్వరలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు కానున్న నేపథ్యంలో హైదరాబాద్ మార్గంతో పాటు పోర్టుకు సమీపంలోని జాతీయ రహదారులు, రైలు రవాణా మార్గాలను అభివృద్ధి చేస్తామని, అందుకు సంబంధించిన డిపిఆర్‌లను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ పర్యటనలో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, జాయింట్ సిఎఫ్‌ఒ సతీష్, ఎపి మారిటైమ్ బోర్డు సిఇ రాఘవరావు, రైట్స్ టీం లీడర్ విశ్వనాథం అధికారులు ఉన్నారు.

కౌలు రైతుల సమస్యపై 22న 'చలో అసెంబ్లీ'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కౌలు రైతుల సంక్షేమం, హామీల అమలుకు 22న విజయవాడ నుంచి నిర్వహించే చలో అసెంబ్లీ ర్యాలీలో కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు కోరారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శనివారం చలో అసెంబ్లీ ర్యాలీ కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో హరిబాబు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో సాగుదారులలో 80 శాతంగా ఉన్న కౌలు రైతులను ఆదుకోవడంలో కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. కౌలు రైతుల కోసం వైసిపి చేసిన చట్టంలో అనేక లోపాలున్నాయని, వాటిని సరి చేస్తామని, ముసాయిదా సిద్ధం చేశామని 15 నెలలుగా భ్రమలు కల్పిస్తూ నేడు అవే విధానాలు అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు చెప్పడం దుర్మార్గమన్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవా పథకం సకాలంలో ఇవ్వాలని, భూ యజమాని సంతకం నిబంధన తొలగించి, పంట రుణాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో, మండలిలో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కౌలు రైతు కొత్త చట్టం అమలుకు కృషి చేయాలని కోరారు. వై రాధాకృష్ణ మాట్లాడుతూ యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని చెబుతున్న ప్రభుత్వం రైతులకు ఎందుకు పంపిణీ చేయలేకపోతోందని ప్రశ్నించారు. కౌలు రైతుల సంక్షేమం కోసం సంఘం ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, సంఘం నాయకులు టి పెద్దిరాజు, కె ఆంజనేయులు, అమరలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

- సొమ్మసిల్లిన మహిళా రైతు

ప్రజాశక్తి - విజయనగరం, శ్రీకాకుళం

యూరియా కోసం విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎరువుల దుకాణం వద్ద శనివారం రైతులు బారులు తీరారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం ఉప్పినివలసలో క్యూలోని మహిళా రైతు సొమ్మసిల్లి పడిపోయారు. పోలీసులు స్పందించి ఆమెకు సపర్యలు చేసి ఇంటికి పంపించారు. పాలవలస రైతు సేవా కేంద్రం వద్ద స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. ముందుగా కూపన్లు అందుకున్న రైతులు.. రైతు సేవా కేంద్రాలకు వద్దకు చేరుకున్నారు. పాలవలసలో ఎక్కువ మంది తరలిరావడంతో కార్యాలయంలో రైతుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది స్పందించి రైతులను క్యూలో నిల్చోబెట్టారు. కొంతసేపు యూరియా పంపిణీకి ఆటంకం ఏర్పడింది.

విజయనగరం జిల్లా సంతకవిటి మండల కేంద్రంలోని ప్రయివేటు ఎరువుల దుకాణం వద్ద

సంతకవిటిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

రైతులు భారీగా తరలిరావడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసుల సమక్షంలో ఎరువులు పంపిణీ చేశారు. క్యూలో గంటల తరబడి నిలబడినా యూరియా దొరక్కపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. రాజాం పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డులో ప్రయివేటు ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. మూడు రోజులుగా టోకెన్లు ఇచ్చి పంపిస్తున్నారు తప్ప ఎరువు ఇవ్వడంలేదని రైతులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పి పంపించారు.

భారత్‌పై సుంకాల దాడి చేయండి..!

- చైనాపై కూడా వేయండి
- యూరప్ దేశాలపై అమెరికా ఒత్తిడి
- రష్యా చమురు కొనుగోలు సాకు..

న్యూఢిల్లీ : రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాలపై అధిక సుంకాలను తప్పనిసరిగా విధించాలని గ్రూప్ ఆఫ్ సెవెన్ (జి7) భాగస్వాములపై అమెరికా ఒత్తిడి చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్, చైనా ప్రధాన సహాయకులుగా నిలుస్తున్నాయని పేర్కొంది. శుక్రవారం జి7 ఆర్థిక మంత్రులతో వర్చ్యువల్ మీటింగ్‌లో యుఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్, వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్‌లు పాల్గొన్నారు. వాషింగ్టన్ సుంకాల నిర్ణయాలకు అనుగుణంగా మెలగాలని యూరప్, ఇతర దేశాలపై వారు ఒత్తిడి చేశారు. రష్యా ఇంధన ఆదాయాలను తగ్గించడమనేది ట్రంప్, యుఎస్ లక్ష్యమన్నారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యాపై ఒత్తిడి

తేవడమే సరైన మార్గమన్నారు. ఈ క్రమంలో ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని జామిసన్ గ్రీర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందుకోసం యూరోపియన్ యూనియన్, జి7 దేశాలు భారత్, చైనాపై అదనపు టారిఫ్‌లను విధించాలని ప్రతిపాదించారు. ఇందుకు జి7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించాయని సమాచారం. ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి నిజంగా కట్టుబడి ఉంటే.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ముందుకు రావాలని స్కాట్ బెసెంట్ సూచించారు. ఇప్పటికే భారత దిగుమతులపై అమెరికా అధికంగా 50 శాతం సుంకాలు విధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. యుద్ధం ముగింపునకు కట్టుబడి ఉన్నామంటూ జి7 సభ్యదేశాలు అమెరికాకు హామీ ఇచ్చాయన్నారు. ఈ క్లిష్ట సమయంలో అమెరికాతో కలిసి ఇయు దేశాలు కూడా నిర్ణయాత్మక చర్యలు చేపడుతాయని ఆశిస్తున్నామని గ్రీర్ పేర్కొన్నారు. యుఎస్ సూచనల మేరకు భారత్, చైనాలపై ఇయు అదనపు సుంకాల విధించవచ్చని రిపోర్టులు వస్తోన్నాయి. జి7లో అమెరికా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్‌లతో కూడిన ధనిక, పారిశ్రామిక దేశాలు భాగస్వామ్యం కలిగి ఉన్నాయి.

పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించండి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పని గంటలు పెంచుతూ రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కార్మిక చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెడతామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి ప్రకటించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించడమంటే బిల్లును ప్రవేశపెట్టి తమ మందబలంతో ఆమోదింపజేసుకుంటామని చెప్పటం మినహా మరొకటి కాబోదని పేర్కొన్నారు. అంతకు ముందు మంత్రివర్గం ఆమోదం పొందిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టకుండా రద్దు చేయాలని కోరారు. కార్మికులు ఎక్కువ సెలవులు పొందే విధంగా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసగించటానికేనని తెలిపారు. కర్ణాటక బిజెపి ప్రభుత్వం మొదటగా 2023లో ఫ్యాక్టరీల చట్టానికి సవరణలు చేసి పని గంటలు రోజుకు 12 గంటలు చేసిందని పేర్కొన్నారు. వారానికి 48 గంటల పని కొనసాగుతుందని, వారంలోపే 48 గంటలు పూర్తయితే మిగతా రోజులు వేతనంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించబడతాయని చెప్పిందని తెలిపారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేయకుండా కొనసాగిస్తోందని పేర్కొన్నారు. గుజరాత్ బిజెపి ప్రభుత్వం 2025 జులైలో 12 గంటల పని దినం బిల్లు పాస్ చేసిందని తెలిపారు. అలాగే కార్మిక సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించకుండా బిల్లు పెట్టేందుకు సిద్ధమవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు. కార్మిక సంఘాలతో ముందు చర్చించాలని, అక్కడ వచ్చిన ఏకాభిప్రాయం ప్రకారమే ముందుకు వెళ్లాలని కోరారు. ప్రపంచమంతా ఆమోదించిన 8 గంటల పని, 8 గంటలు కుటుంబం, సామాజిక కార్యక్రమాలు 8 గంటలు విశ్రాంతి పద్ధతిని మార్పు చేయటాన్ని వ్యతిరేకించాలని కార్మికులను కోరారు.

భార్యను హత్యచేసి తాను ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -మర్రిపూడి (ప్రకాశం జిల్లా)

భార్యను హత్యచేసి ఆపై తానూ ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు ఓ భర్త. ఈ సంఘటన ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం రేగలగడ్డ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన ఎం. నారాయణ తన భార్య జయమ్మ(45)పై అనుమానంతో ప్రతిరోజూ వేధించేవారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున రోకలిబండతో తన భార్యపై దాడి చేసి హతమార్చారు. అనంతరం తాను గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న మర్రిపూడి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని పొదిలి వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చే ఏడాది మార్చి వరకు నాలుగో ఆర్థిక సంఘం అమలు పొడిగింపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

నాలుగవ ఆర్థిక సంఘం అమలు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. కొద్ది రోజుల క్రితమే ఐదో ఆర్థిక సంఘం తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించగా, తాజాగా ఎప్పుడో కాలపరిమితి దాటిపోయిన నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. నాలుగో ఆర్థిక సంఘం కాలంలో చేయాల్సిన అనేక కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడంతో దానిని వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2018 లోనే నాలుగో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మూడేళ్ల పాటు కొనసాగే ఈ ఆర్థిక సంఘం ఇచ్చే నివేదికలను 2021 నుంచి 2024 మధ్య కాలంలో అమలు చేయాలని కూడా నిర్ణయించారు. ఇదే సమయంలో నాలుగో ఆర్థిక సంఘం కాలపరిమితి ముగిసిపోయిన రెండేళ్ల వరకు కొత్త ఆర్థిక సంఘాన్ని ఏర్పాటుచేయకపోవడంతో కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, 2023లో ఐదో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటుచేశారు. అయితే ఇప్పటికీ నాలుగో ఆర్థిక సంఘం నివేదిక మాత్రం పూర్తిగా అమలు కాకపోవడం గమనార్హం. ప్రధానంగా స్థానిక సంస్థల అభివృద్ధికి చేయాల్సిన కార్యక్రమాలు ఆగిపోయాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. 2024లోనే ఈ నివేదిక అమలు పూర్తికావాల్సి ఉందని, అయితే అనేక కారణాలతో ప్రగతి కనిపించలేదని అధికారులు చెబుతున్నారు. అందుకే ఈ అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగించాల్సి వచ్చిందని వారంటున్నారు. కాగా ఐదో ఆర్థిక సంఘం కూడా కొద్ది రోజుల క్రితమే తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. దీని అమలు కూడా ప్రారంభం కావాల్సి ఉంది. ఇంకా నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సులే పూర్తిగా అమలు కాని నేపథ్యంలో ఇక ఐదో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు ఎప్పుడు ప్రారంభమవుతాయో చూడాల్సి ఉంది.

తిరుపతితో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం తిరుపతిలోని ఒక ప్రయివేటు హోటల్‌లో నిర్వహించిన సులభతర వాణిజ్య అవగాహన ప్రాంతీయ సదస్సుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్ యువరాజ్ వర్చువల్‌గా సందేశమిచ్చారు. ప్రభుత్వం, పరిశ్రమ కలిసి ముందుడగు వేస్తేనే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ముందువరుసలో ఉంటామని యువరాజ్ అన్నారు. ఇందుకు సరళీకరణ, ఆన్‌లైన్ సౌకర్యాలు, నమ్మకం ఆధారిత విధానం ఉండాలన్నారు. అప్పుడే డబుల్ డిజిట్ గ్రోత్ సాధిస్తుందని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల సమస్య లను వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసిజడ్‌ఎం విజయ్ భరత్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిడి మురళి పాల్గొన్నారు.

ధరలను తగ్గించిన హెచ్‌యుఎల్

న్యూఢిల్లీ : ప్రముఖ ఎఫ్‌ఎంసిజి కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యుఎల్) తమ పలు ఉత్పత్తుల ధరలను తగ్గించనున్నట్లు ప్రకటించింది. సంస్థ విక్రయించే కిసాన్ జామ్, హార్లిక్స్, లక్స్ సోప్, డవ్ షాంపూ వంటి ధరలు దిగి రానున్నాయని పేర్కొంది. కొత్త ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇటీవల జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో పన్ను శ్లాబులను 5. 12 శాతంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్‌యుఎల్ ధరల సవరణ చేసింది. కొన్ని ఉత్పత్తుల ధరలు తగ్గించగా.. రూ.10, రూ.20 ప్యాక్‌ల ధరలు యథాతథంగా కొనసాగనున్నాయని వెల్లడించింది.

కెన్‌స్టార్ నుంచి 5స్టార్ వాటర్ హీటర్ల విడుదల

హైదరాబాద్ : గృహోపకరణాల ఉత్పత్తుల కంపెనీ కెన్‌స్టార్ కొత్తగా 5 స్టార్ బిఇఇ రేటింగ్ పొందిన వాటర్ హీటర్ల శ్రేణీని ఆవిష్కరించినట్లు వెల్లడించింది. విద్యుత్ ఆదా సహా 20శాతం ఎక్కువ వేడి నీరు, 40శాతం ఎక్కువ లైఫ్‌ను అందిస్తాయని పేర్కొంది. ఈ వాటర్ హీటర్లు స్విర్ల్ హీట్ టెక్నాలజీ, జర్మన్ బ్లూ సఫైర్ కోటింగ్, హైడెన్సిటీ పియుఎఫ్ ఇన్సులేషన్‌తో రూపొందించబడ్డాయని కెన్‌స్టార్ సిఇఒ సునీల్ జైన్ తెలిపారు. ఇందులో 3 లీటర్ల నుండి 100 లీటర్ల వరకు సామర్థ్యంతో లభిస్తాయన్నారు.

ఇప్పట్లో డాలర్ ఆధిపత్యం తగ్గకపోవచ్చు

- గీతా గోపీనాథ్ అంచనా

వాషింగ్టన్ : సమీప భవిష్యత్‌లో డాలర్ ఆధిపత్యం తగ్గకపోవచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) మాజీ చీఫ్ ఎకనమిస్ట్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ అన్నారు. ఆమె ప్రస్తుతం హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తోన్నారు. అమెరికా సంస్థల బలం, ఆర్థిక మార్కెట్ల బలహీతనల కారణంగా డాలర్ ఆధిపత్యం దగ్గరలో మారే అవకాశం లేదని గోపీనాథ్ పేర్కొన్నారు. కేవలం వాణిజ్యంలోనే కాకుండా ఆర్థిక రంగంలో, చెల్లింపులలో, రిజర్వ్‌లలో డాలర్ ఆధిపత్యం కనబడుతుందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ కీలక పాత్ర పోశిస్తోందన్నారు.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డ్ ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపత్ మార్గ్, లోయర్ ప్యారెల్(వెస్ట్), ముంబయి-400013 మరియు దీని మరొక ఆఫీసు: రిటైల్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్: హెడ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, ఐ-థింక్ టెక్నో క్యాంపస్, కంజుర్‌మార్గ్ (ఈస్ట్), ముంబయి-400042.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కు తఖాకపెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయాపు సమాచారం మరియు బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("ది బ్యాంక్") యొక్క రుణగ్రహీతలకు తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వద్ద తనఖాపెట్టిన రుణ స్వభావం/ సెక్యూరిటీలపై ఓవర్ డ్రాఫ్ట్‌ల రూపంలో రుణ సౌకర్యం పొందిన సెక్యూరిటీల గురించి దిగువ విధంగా చూపబడినవి.

లోన్ అగ్రిమెంట్ నియమాల ప్రకారం బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత విఫలమైన కారణంగా, దిగువ పేర్కొన్న రుణఖాతా నెంబర్లు డెలింక్వెంట్ స్థితిలో ఉన్నాయి. దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు బ్యాంక్ నుంచి అనేక నోటీసులు పంపడం జరిగింది, చివరిగా దిగువ చూపబడిన తేదీల్లో సేల్ నోటీసు పంపబడింది. దిగువ పేర్కొన్న రుణ ఖాతాలకు సంబంధించి బకాయి ఉన్న మొత్తాన్ని 7రోజుల్లోపు తిరిగి చెల్లించాలి, ఒకవేళ నిర్దిష్ట గడువులోపు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించకపో యినట్టయితే బ్యాంక్ వారు ఇకపై ఎలాంటి నోటీసు జారీ చేయకుండా తనఖాపెట్టిన సెక్యూరిటీలను విక్రయించనున్నారు.

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్‌కు బకాయి ఉన్న మొత్తాలను తిరిగిచెల్లించడంలో రుణగ్రహీతలు అశ్రద్ధచేసి విఫలమయ్యారు కాబట్టి లోన్ అగ్రిమెంట్ ప్రకారం రుణగ్రహీత బ్యాంక్ వద్ద తనఖాపెట్టిన సెక్యూరిటీలను తమకు ఉన్నహక్కులను సద్వినియోగం చేసుకొని **22 సెప్టెంబర్, 2025** తేదీన లేదా ఆ తరువాత బకాయిలను రాబట్టుకునే క్రమంలో విక్రయించనున్నారు. రుణగ్రహీతలకు తెలియజేయునది ఏమనగా ఏ క్షణంలోనైనా బ్యాంక్ వారు తనఖాపెట్టిన సెక్యూరిటీల విలువ స్టాక్ మార్కెట్ అనుగుణంగా తగ్గినట్టయితే ఒక క్యాలెండర్ ఒకరోజు (1)లోపు సదరు సెక్యూరిటీలను ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విక్రయించే అధికారం బ్యాంక్ వారికి ఉంటుందని తెలియజేయనైనది.

తనఖాపెట్టిన సెక్యూరిటీలను విక్రయించిన తర్వాత కూడా బ్యాంక్‌కు రావాల్సిన బకాయి మొత్తం సరిపోక పోయినట్టయితే మిగతా మొత్తాన్ని రుణగ్రహీత/లు బ్యాంక్‌కు చెల్లించాల్సి ఉంటుంది.

క్ర సం.	రుణ ఖాతా నెంబర్	రుణగ్రహీతల పేరు	11-09-2025 నాటికి బకాయి మొత్తం	అమ్మకపు నోటీసు తేదీ
1	XXXXXXXXXX7993	అలవాల బ్రహ్మారెడ్డి	81,015.72	12-09-2025
2	XXXXXXXXXX8614	మాధవ్ కాళీ ప్రసాద్ దాసరి	21,136.93	12-09-2025

తేది: 14-09-2025
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్

సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

వారసత్వం

'రాజకీయ మనేది మన/ బ్రదుకుల కూపిరిలాంటిది' అంటాడు మహాకవి శ్రీశ్రీ. భారతదేశంలో 18 నుంచి 25 ఏళ్ల వయస్సులైన యువతీయువకులు 60 కోట్ల మంది ఉన్నారు. వీరిలో 2019 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు రిజిస్టర్ చేసుకున్న వారి సంఖ్య 1.50 కోట్లు. రాజకీయాల్లో రాణించే శక్తిసామర్థ్యాలు వీరిలో ఉన్నప్పటికీ... ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కడం లేదు. వారసత్వం... ఆస్తుల కోసమే కాదు, రాజకీయ వారసత్వంపై కూడా పెద్ద వార్ నడుస్తున్నది. ప్రాంతీయ పార్టీల్లో వారసత్వం వార్ ఇంకాస్త ఎక్కువగానే వుంటుందన్నది ఇటీవల పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. 'కాసులు గలవాడే రాజు గదరా' అని బద్దెన అన్నట్లు... డబ్బుబలం, కండబలం వంటివి వారసత్వ రాజకీయాలకు కారణమౌతున్నాయి. ముఖ్యంగా భారత రాజకీయాల్లో కుటుంబ నేపథ్యం, రాజకీయ వారసత్వం లేకుండా వచ్చిన మహిళలు చాలా అరుదు. ఎక్కడైనా ఒకటీ అరా వున్నా.. వారు వామపక్ష రాజకీయాల్లో ఎదిగినవారే అయివుంటారు. అర్హత, ఆసక్తి కలిగిన సామాన్య మహిళలకు అవకాశం లభించకపోవడం, రాజకీయాల్లో మహిళల పాత్రను పరిమితం చేస్తోంది. 'ఈ రాజ్యంవెవుడిది. పైసలున్నోడిది. ఆడికి కాపలెవుడు? పోలీసోడు. ఆడు సాలకపోతే? మిలిట్రోడు. మరింక పైసలు మనకీ ఉన్నయంటే రాజ్జింల మనకీ పాలున్నదన్నమాటే!' అంటాడు రావిశాస్త్రి ఓ కథలో.

భారత దేశ ప్రజాస్వామ్యంలో కుటుంబ రాజకీయాలు బలంగా పాతుకుపోయాయి. జనం నెత్తిన వారసత్వాన్ని రుద్దుతున్నారు. దేశవ్యాప్తంగా కొన్ని కుటుంబాల గుప్పిట్లో ప్రజాస్వామ్యం బందీగా మారింది. కుటుంబ వారసత్వమే కీలకంగా వుంటోందని తాజా నివేదిక స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర చట్టసభల్లో మొత్తం 5,204 మంది నేపథ్యాన్ని విశ్లేషించగా, వారిలో ఐదో వంతుకుపైగా ప్రజాప్రతినిధులకు రాజకీయ వారసత్వం వుందని ఎడిఆర్ నివేదిక వెల్లడించింది. లోక్‌సభలో 31శాతం, రాజ్యసభలో 21శాతం మంది ఎంపీలు వారసులే. 'రాజకీయాలు నాకు కొత్తకాదు. నా ఇంట్లోనే ఉద్యమం మొదలైంది. నేనిప్పుడు రంగంలోకివస్తే, ఎదురు నిలబడేవారెవరు?' అని సినీనటుడైన ఓ రాజకీయ నాయకుడు చెప్పిన డైలాగ్ ఇది. ఈ నివేదిక నేపథ్యానికి ఇదో ఉదాహరణ. వారసత్వ రాజకీయాల గురించి విమర్శలు చేసే బిజెపీలోనూ 18శాతం మంది వున్నారు. ఒక్క యుపి లోనే అత్యధికంగా 141 మంది వారసులున్నారు. పార్టీల పేర్లు మారినా, నాయకత్వం మాత్రం ఒకే కుటుంబానికి వారసత్వంగా రావడం, కుటుంబ ఆధిపత్యం... దాదాపు అన్ని పెద్ద పార్టీల్లోనూ కనిపిస్తోంది. వారసుల శాతం అధికంగా వున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. రాష్ట్రంలో మొత్తం 255 మంది చట్టసభల్లో వుంటే, వీరిలో 86 మంది (34శాతం) వంశపారంపర్య నేపథ్యం వున్నవారే. దీనికి భిన్నంగా వారసత్వ రాజకీయాలు సీపిఎంలో అత్యల్పమని నివేదిక విశ్లేషించింది. కేరళలోని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నికైన 21 ఏళ్ల ఆర్య రాజేంద్రన్, గతంలో కొల్లాం మేయర్‌గా ఎన్నికైన సబితాబేగం వంటివారు ఎలాంటి రాజకీయ వారసత్వం లేకుండా ఎదిగినవారే.

వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని రాచరిక వ్యవస్థగా మార్చుతున్నాయి. ఇది ప్రజల ఎంపికకు బదులు కుటుంబ వారసత్వానికే ప్రాధాన్యతనిస్తోంది. దీంతో ప్రజల్లోంచి నాయకత్వం రావడం తగ్గిపోతోంది. పార్టీల్లోనూ అంతర్గత ప్రజాస్వామ్యం దెబ్బతింటోంది. ప్రతిభకంటే వారసత్వానికే ప్రాధాన్యత పెరుగుతోంది. బంధుప్రీతి, అవినీతి, కుల, ప్రాంత ఆధిపత్యం... ప్రజాస్వామ్యం పట్ల నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తున్నది. మేధావులు, ప్రజాస్వామ్య వాదులు ఈ తరహా రాజకీయాలను ప్రక్షాళన చేసే దిశగా ప్రజలను చైతన్యవంతం చేయాలి. 'తత్వవేత్తలు రాజులుగా మారే వరకు... నగరాలు వాటి చెడుల నుండి ఎప్పటికీ విశ్రాంతి పొందవు' అంటాడు ప్లేటో. జ్ఞానవంతులు కాకుండా వారసులు పాలిస్తే, ప్రజల సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావన్నది దీని సారాంశం. మనం రూపొందించుకున్న రాజ్యాంగం, మనం ఏర్పరచుకున్న ప్రజాస్వామ్యం బలపడాలంటే... రాజకీయాల్లో సామాన్యులకు అవకాశం కల్పించాలి. కార్మికుల గొంతు వినిపించాలి. 'రాజకీయ ప్రజాస్వామ్యం పునాదిలో సామాజిక ప్రజాస్వామ్యం లేకపోతే, అది మనుగడ సాగించదు' అంటాడు అంబేద్కర్. సాధారణ ప్రజలు రాజకీయాల్లోకి వచ్చే అవకాశం లేకపోతే... మన ప్రజాస్వామ్యం కేవలం కొన్ని కుటుంబాల ఆటగా మారిపోతుంది. డబ్బు, కుటుంబ నేపథ్యం వున్నవారే రాజ్యమేలుతారు.

మంచి మాట

కులం, మతం ప్రాతిపదికగా కాక... సెక్యులరిజం, సమానత్వం ఆధారంగా భారత పౌరులు మెలగాలి.
- మోక్షగుండం విశ్వేశ్వరయ్య, భారత ఇంజనీరు, పండితుడు, రాజనీతిజ్ఞుడు.

Mokshagundam visvesvaraya

సుప్రీంకోర్టు దృఢ వైఖరితో సమాఖ్యకు రక్ష

ప్రస్తుతం



తెలకపల్లి రవి

ఎంత ఉన్నత పదవిలో వున్న వారికైనా తాము రాజ్యాంగ పరంగా చెప్పవలసింది చెబుతామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ధర్మాసనం ప్రకటించడం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా స్వాగతించదగింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై అభిప్రాయం చెప్పడంలో అంతులేని జాప్యం చేస్తున్న గవర్నర్ల పాత్రపై ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పును తాము తిరగదోడే ప్రసక్తి వుండబోదని కూడా అత్యున్నత న్యాయస్థానం సూచన ప్రాయంగా చెప్పేసింది. రాజ్యాంగ పరంగా ఏమి జరగాలనేది తాము సూచిస్తామే తప్ప గతంలో కోర్టు ఇచ్చిన తీర్పుపై మళ్లీ జోక్యం చేసుకోబోమని సిజెఐ ఇంతకు ముందే తేల్చేశారు. ప్రస్తుతానికి తీర్పును రిజర్వు చేసిన సుప్రీంకోర్టు తమకు న్యాయం చేస్తుందని ప్రత్యేకించి బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించడం సహజం.

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పది బిల్లులను అంతులేని జాప్యంతో అట్టి పెట్టుకోవడంపై స్టాలిన్ ప్రభుత్వం దాఖలు చేసిన కేసును సుప్రీంకోర్టు విచారించింది. తమ ముందుకు వచ్చిన బిల్లులపై మూడు మాసాలలోగా ఆమోదం లేదా నిరాకరణ చేయవలసి ఉంటుందని తేల్చి చెప్పింది. అలా చేయకపోతే ఆ బిల్లులను ఆమోదించినట్టే భావించాల్సి వుంటుందని కూడా నిర్దేశించింది. ఒకవేళ రాష్ట్రపతి పరిశీలనకు పంపేట్లయితే అప్పుడు కూడా మూడు మాసాల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రకటించింది. ఈ తీర్పు తీవ్ర సంచలనం కలిగించింది. ఎందుకంటే కేంద్రంలో మోడీ అధికారం చేపట్టాక నియమితులైన గవర్నర్లు రాజును మించిన రాజభక్తుల్లా ఎన్‌డిఎ ఏతర రాష్ట్ర సర్కార్లను అవస్థ పెట్టడం, అడుగడుగునా గండాలు సృష్టించడం పరిపాటిగా మారింది. వైస్ ఛాన్సలర్ల నియామకం నుంచి బిల్లుల ఆమోదం, శాసనసభల్లో ప్రసంగ పాఠంతో సహా ప్రతిదీ వివాదం చేస్తున్న పరిస్థితి. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశం ఈ అనిశ్చితిని ఆపడానికి దోహదపడుతుందనే హర్షామోదాలు వ్యక్తమైతే బిజెపి అనుకూల పక్షాలూ, న్యాయవాద వర్గాలు రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ఎలా ఆదేశాలిస్తుందని అభ్యంతరాలు లేవనెత్తాయి.

గతంలో రెండు మూడు సందర్భాల్లో అత్యున్నత న్యాయస్థానం ఇంతకంటే సూటిగా రాష్ట్రపతి విధివిధానాలపై నిర్దేశాలు ఇచ్చింది. 1994లో ఎస్.ఆర్ బొమ్మై కేసులో రాష్ట్ర ప్రభుత్వాల రద్దు, రాష్ట్రపతి పాలన విధింపుకు సంబంధించి ఏకపక్ష పోకడలకు సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. మరణశిక్ష పడిన ఖైదీల క్షమాభిక్ష దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవడానికి కూడా నిర్ణీత గడువును సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఆ తీర్పు తర్వాత అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ శరవేగంగా నిర్ణయాలు తీసుకోవటం మనం చూశాం.

వాస్తవానికి మోడీ హయాంలో అనేక రాష్ట్రాలలో నియమితులైన గవర్నర్లు అత్యుత్సాహంతో ప్రత్యక్ష రాజకీయ పాత్రతో అపర సైంధవుల్లా బిజెపి యేతర ప్రభుత్వాలను ముప్పు తిప్పలు పెడుతున్నారు. కేరళలోనూ గవర్నర్ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పంపిన వైస్ చాన్స్‌లర్ల పేర్లను పక్కన పెట్టి తను నిర్ణయించిన వారినే నియమిస్తానని, ఇది పూర్తిగా తన నిర్ణయాధికారమేననీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎడతెగని ఈ అప్రజాస్వామిక వైఖరికి సుప్రీంకోర్టు నిర్దేశం స్వస్తి పలుకుతుందనే ఆశ సిజెఐ మాటలతో కలుగుతుంది.

రాష్ట్రపతి లేఖ వెనక రాజకీయం

ఏప్రిల్ 8వ తేదీన తీర్పు రాగా ఆ మరుసటి రోజునే కేంద్రం దానికి ఎలా విరుగుడు చేయాలని మంతనాలు ప్రారంభించింది అటార్నీ జనరల్ ఆర్. వెంకట రమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇంకా న్యాయశాఖ ప్రతినిధులతో విస్తారంగా చర్చలు సాగించారు. ఈ తీర్పుపై సమీక్ష కోరాలా లేక మరింత విస్తత ధర్మాసనం కోరాలా అని తర్జనభర్జనలు జరిపారు. రాజ్యాంగం 143(1) అధికరణం కింద రాష్ట్రపతి పేరిట సలహా కోరడమే ఉపయోగకరమని నిర్ణయానికి వచ్చారు. చివరకు మే ఏడవ తేదీ నాటికి రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు సమర్పించే ప్రశ్నావళి ప్రస్తావనను ఖరారు చేశారు. రాజ్యాంగంలోని 200వ అధికరణం గవర్నర్ పరిధిని చెప్తుంది. 21వ అధికరణం శాసనసభ ఆమోదించిన బిల్లుల అంగీకార ముద్ర గురించి చెప్తుంది. ఈ రెండు చోట్ల కూడా కాలపరిమితికి సంబంధించిన నిబంధనలేవీ లేనప్పుడు మూడు మాసాలలోనే పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఎలా చెప్తుందనేది ఈ ప్రశ్నల సారాంశం.

ఈ విధంగా రాష్ట్రపతి సుప్రీం కోర్టు అభిప్రాయం కోరడం గతంలోనూ జరిగింది గానీ ఆ సందర్భాలు వేరు. 1960లో కేంద్రం సి జాబితాలోని రాష్ట్రాల ప్రతిపత్తిపై సుప్రీం సూచనలు కోరింది. పాకిస్తాన్‌తో ప్రాదేశిక భూభాగంపై ఒప్పందం చేసుకోవచ్చునన్న విషయం 1951లో సుప్రీంకోర్టు అభిప్రాయం కోరింది. 1978లో ఎమర్జెన్సీ తర్వాత ఆ అత్యాచార కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయవచ్చునా అన్న అంశంపై అభిప్రాయం కోరింది. 1993లో పివి ప్రభుత్వ హయాంలో రాష్ట్రపతి అయోధ్య సమస్యపై అభిప్రాయం కోరగా మా పరిధిలోకి రాదని కోర్టు నిరాకరించింది. 2011లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం వుండగా 2జి స్పెక్ట్రం కేటాయింపులపై కూడా సుప్రీం తీర్పు తర్వాత వేలం ద్వారానే స్పెక్ట్రంను విక్రయించాలా మరే మార్గం అనుసరించరాదా చెప్పాలని రాష్ట్రపతి అభిప్రాయం కోరారు. విచారణ తర్వాత సుప్రీం ధర్మాసనం అదొక్కటే పద్ధతి అని చెప్పలేమని బదులిచ్చింది. ఏమైనా రాజ్యాంగంలోని 142వ అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు మాత్రమే అందులోని అధికరణాలు, నిబంధనలకు చెల్లుబాటుపై తుది మాట చెప్పవలసి ఉంటుంది. కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ మౌలిక స్వభావం తీర్పు తర్వాత ఇది మరింత బలపడింది. కాకపోతే ప్రస్తుతం ద్రౌపదీ ముర్ము పంపిన ప్రస్తావన కేవలం రాజ్యాంగ నిబంధనల అనువర్తింపుకే కాక రాజకీయ సంఘర్షణకు కూడా దారి తీసేలా వుందని పరిశీలకులు సందేహించారు. రాజ్యాంగ పరమైన అనిశ్చిత పరిస్థితికి కారణమవుతున్న ఒక సుదీర్ఘ సమస్యపై న్యాయస్థానం స్పష్టమైన నిర్దేశం చేస్తే దాని అమలుకు చర్యలు తీసుకోవడానికి బదులు సాగదీత సంఘర్షణ ఎందుకని ప్రశ్నించారు.

ఆపేస్తే చచ్చిపోతుందా?

మే నెలలో రాష్ట్రపతి లేఖ తర్వాత సుప్రీం కోర్టు అభిప్రాయం చెప్పడం రాజ్యాంగ బాధ్యత. సిజెఐ గవాయ్, కాబోయే సిజె సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, పిఎస్ నరసింహన్, అతుల్ ఎస్ చందూర్‌లతో కూడిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ ప్రారంభించింది. ఈ నెలలో వరుసగా పదిరోజుల పాటు విచారణ జరిపింది. ఈ క్రమంలో కేంద్రం తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ మెహతా, అటార్నీ జనరల్ వెంకట రమణి బిల్లులు గవర్నర్లు ఆమోదించకపోతే అది చచ్చిపోయినట్టే భావించాలని వ్యాఖ్యానించారు. సభలో చర్చించి పంపిన బిల్లును పదవిని బట్టి ఒక వ్యక్తి ఆలస్యం చేసి పక్కన పడేస్తే ఎలా చచ్చిపోతుందని న్యాయమూర్తులు ప్రశ్నించారు. రాజ్యాంగపరంగా నియమితులైన వారికి కోర్టు ఎలా గడువు విధిస్తుందని పదే పదే అడ్డు సవాళ్లు విసిరారు. తాము గడువు విధించడం లేదనీ, ఒక కాలక్రమణిక మాత్రమే సూచించామని న్యాయమూర్తులు దీటుగా జవాబు చెప్పారు. నిర్దిష్టంగా ప్రతి బిల్లు ఇన్ని రోజుల్లోనే పూర్తి చేయాలని కాదు. అయితే గవర్నర్లు ఏ మాట చెప్పకుండా ఎంత కాలమైనా అట్టిపెట్టుకోవడం మాత్రం ఎలా చెల్లుతుంది? ప్రభుత్వాలు నిర్ణయించి చట్టసభలు చర్చించి ఒక బిల్లు ఆమోదిస్తే ఏ కారణం చెప్పకుండా ఎలాంటి గడువు లేకుండా ఆలా పక్కన పడేసి అది చచ్చిపోయిందనుకోమంటే ఎలా చెల్లుతుంది? పనులు జరగాలంటే ఏదో ఒక వ్యవధి, గడువు అంటూ వుండాలి కదా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు గవర్నర్లు సుహృద్భావంతో కలసి మెలసి వ్యవహరిస్తారనుకున్నారు గనకే రాజ్యాంగ నిర్మాతలు గడువు పెట్టలేదనీ, కానీ రాష్ట్రాలు సమస్య తీసుకువచ్చాక రాజ్యాంగ స్పూర్తితో ఒక నిర్ణయం తీసుకోవాలి కదా అని వ్యాఖ్యానించారు.

చాలా మంది వాదిస్తున్నట్టు సుప్రీంకోర్టు ఏప్రిల్ తీర్పులో రాష్ట్రపతి లేదా గవర్నర్ ఏం చేయాలో ఏ విధంగా నిర్ణయం తీసుకోవాలో ఆదేశించలేదు. తమకు నచ్చిన నిర్ణయం తీసుకోవడానికి మూడు మాసాల వ్యవధి ఉండాలని మాత్రమే చెప్పింది. ఇది రాజ్యాంగ స్పూర్తిని నొక్కి వక్కాణించడమే కానీ అందుకు భిన్నం కాదు. ఈ గడువు కూడా గతంలో ఇందిరా గాంధీ హయాంలో సర్కారియా కమిషన్, వాజ్‌పేయి హయాంలో పూజ కమిషన్ లకు ఆధ్వర్యం వహించిన మాజీ న్యాయమూర్తులు చెప్పిందే.

ఎంతటి వారైతేనేం?

సిజెఐ గవాయ్ ఇంకా సూటిగానే మాట్లాడారు. రాజ్యాంగంలో ఒక విభాగం తన బాధ్యతా నిర్వహణలో విఫలమైతే సుప్రీం కోర్టు అధికారం లేనట్టు నిస్సహాయంగా చూస్తూ కూర్చోవాలా? అని ప్రశ్నిస్తూ తాము అలా కూర్చోవడానికి సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు. రాజ్యాంగ సమస్యల వల్ల మన పక్కనే వున్న నేపాల్‌లో ఏం జరుగుతున్నదో చూస్తున్నారు కదా అని కూడా గుర్తు చేశారు. అయితే గవర్నర్లు ఏదో అడ్డుపడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పడం కేవలం రాజకీయ ప్రేరితమనీ, 1970 నుంచి ఇప్పటి వరకూ చూస్తే గవర్నర్లు 90 శాతం బిల్లులకు ఆమోదం తెలిపారనీ కేవలం 10 శాతం మాత్రమే అట్టిపెట్టుకున్నారని తుషార్ మెహతా వితండ వాదన చేశారు. పది లేదా ఒకటి ఆపేశారన్న సంఖ్య ఎంత అనేది తమకు ముఖ్యం కాదని అసలు ఏ కారణం చెప్పకుండా ఏ సమయం ప్రకటించకుండా అలా అట్టిపెట్టేసుకుంటే ఏం చేయలేమా అని మాత్రమే ఆలోచించామన్నారు. ఇక్కడ ఇంకో కిటుకు వుంది. అన్ని విషయాల్లోనూ మోడీ వచ్చాకే చరిత్ర ప్రారంభమైనట్టు మాట్లాడే బిజెపి నేతలు ఈ బిల్లుల ఆమోదంలో మాత్రం 1970 నుంచి లెక్కవేయడం ఆశ్చర్యకరం. వాయిదా పడిన వాటిలో అధికభాగం మోడీ హయాంలోనే అన్నది అసలు సంగతి. తమిళనాడులోనే పది పక్కన పెట్టేస్తే ఏమనాలి? తమిళనాడు విషయంలో ఇచ్చిన తీర్పు తమ గవర్నర్‌కూ వర్తింపచేయాలని కేరళ కోరుతున్నది. నిస్సందేహంగా ఇదొక రాజకీయ సంఘర్షణే. ఏప్రిల్‌లో ఇచ్చిన మూడు నెలల సమయం తీర్పు నిర్దేశించిన చట్టం సరిగా లేదు గనక రద్దు చేయాలని కేంద్రం తరపున ఎస్‌జి, ఎజిలు నేరుగా కోరారు గానీ న్యాయమూర్తులు అందుకు నిరాకరించారు. రాష్ట్రపతి అడిగిన దానిపై అభిప్రాయం చెబుతామే గానీ గతంలో ఇచ్చిన తీర్పు జోలికి పోమని చెప్పేశారు. ఆ విధంగా ఇది సంచలనాత్మకమైంది.

చాలా మంది వాదిస్తున్నట్టు సుప్రీంకోర్టు ఏప్రిల్ తీర్పులో రాష్ట్రపతి లేదా గవర్నర్ ఏం చేయాలో ఏ విధంగా నిర్ణయం తీసుకోవాలో ఆదేశించలేదు. తమకు నచ్చిన నిర్ణయం తీసుకోవడానికి మూడు మాసాల వ్యవధి ఉండాలని మాత్రమే చెప్పింది. ఇది రాజ్యాంగ స్పూర్తిని నొక్కి వక్కాణించడమే కానీ అందుకు భిన్నం కాదు. ఈ గడువు కూడా గతంలో ఇందిరా గాంధీ హయాంలో సర్కారియా కమిషన్, వాజ్‌పేయి హయాంలో పూజ కమిషన్ లకు ఆధ్వర్యం వహించిన మాజీ న్యాయమూర్తులు చెప్పిందే. మోడీ ప్రభుత్వం వచ్చాక కూడా హోంశాఖ విడుదల చేసిన సర్క్యులర్ ఇదే మూడు మాసాల లోగా ఆమోదించాలని చెప్పింది. గతంలో రెండు మూడు సందర్భాల్లో అత్యున్నత న్యాయస్థానం ఇంతకంటే సూటిగా రాష్ట్రపతి విధివిధానాలపై నిర్దేశాలు ఇచ్చింది. 1994లో ఎస్.ఆర్ బొమ్మై కేసులో రాష్ట్ర ప్రభుత్వాల రద్దు, రాష్ట్రపతి పాలన విధింపుకు సంబంధించి ఏకపక్ష పోకడలకు సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. మరణశిక్ష పడిన ఖైదీల క్షమాభిక్ష దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవడానికి కూడా నిర్ణీత గడువును సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఆ తీర్పు తర్వాత అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ శరవేగంగా నిర్ణయాలు తీసుకోవటం మనం చూశాం.

ఆశాభావం ఫలిస్తుందా?

ఈ ప్రస్తావన పంపడానికి ముందే అప్పటి ఉప రాష్ట్రపతి జగదీప్ కోర్టుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తితే కేంద్రం సంతోషించింది. కానీ తర్వాత ఆయన వాళ్లనే ఇబ్బంది పెట్టడంతో ఇంటికి పంపించి ఇప్పుడు సిపి రాధాకృష్ణన్‌ను తెచ్చారు. సిపి 16వ ఏట నుంచి ఆరెస్సెస్‌తో అనుబంధం కలిగివున్నారు. మహారాష్ట్ర గవర్నర్‌గానే గాక ఇతర చోట్ల కూడా సేవలందించారు. వాస్తవానికి మోడీ హయాంలో అనేక రాష్ట్రాలలో నియమితులైన గవర్నర్లు అత్యుత్సాహంతో ప్రత్యక్ష రాజకీయ పాత్రతో అపర సైంధవుల్లా బిజెపి యేతర ప్రభుత్వాలను ముప్పు తిప్పలు పెడుతున్నారు. కేరళలోనూ గవర్నర్ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పంపిన వైస్ చాన్స్‌లర్ల పేర్లను పక్కన పెట్టి తను నిర్ణయించిన వారినే నియమిస్తానని, ఇది పూర్తిగా తన నిర్ణయాధికారమేననీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎడతెగని ఈ అప్రజాస్వామిక వైఖరికి సుప్రీంకోర్టు నిర్దేశం స్వస్తి పలుకుతుందనే ఆశ సిజెఐ మాటలతో కలుగుతుంది. డిసెంబరు నెలలో పదవీ విరమణ చేయనున్న సిజెఐ గవాయ్ తీర్పు నివ్వాల్సిన కీలక కేసులు మరికొన్ని వుండగా గవర్నర్ల విషయం నేరుగా రాష్ట్రపతి పేరుతో తిరగదోడబడింది గనక ఏం చెబుతారనేది దేశమంతా ఎదురు చూస్తున్నది. ★

అభిప్రాయం

ఆట స్థలాలు లేకుంటే ఎలా!

ఆటలు ప్రతి ఒక్కరికి అవసరం. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం వస్తుంది. కొందరు అప్పుడప్పుడు ఆటలాడుతుంటారు. మరికొందరు వాటి కోసం జీవితాలను ధారపోస్తారు. వివిధ క్రీడల్లో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటారు. ప్రపంచవ్యాపితంగా ఎన్నో క్రీడలు ఉన్నాయి. వివిధ దేశాలు, భాషలు, సంస్కృతి సంప్రదాయాలు ఉన్నప్పటికీ క్రీడల విషయంలో మాత్రం అందరూ ఏకతాటి పైకి వస్తారు.

ఫుట్‌బాల్ ప్రపంచవ్యాపితంగా ఎక్కువమంది ఆదరిస్తున్న ఆట. ఈ క్రీడకు మొత్తం 400 కోట్ల మందికిపైగా అభిమానులున్నారట! రోజురోజుకీ పెరుగుతున్నారు కూడా. ఫుట్‌బాల్‌కి బ్రెజిల్, అర్జెంటీనా, స్పెయిన్, జర్మనీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, ఇండియా లాంటి దేశాల్లో ఎక్కువగా అభిమానులున్నారు. భారత ఉపఖండంతో పాటు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా, వెస్టిండీస్ వంటి దేశాలు ఎక్కువగా ఆదరించే ఆట క్రికెట్. దీనికి ప్రపంచవ్యాపితంగా 250 కోట్ల మందికిపైగా అభిమానులున్నారు. ఈ ఆటకు ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌత్ ఆఫ్రికా, బంగ్లాదేశ్ లాంటి దేశాల్లో ఈ క్రీడకు ఎక్కువగా అభిమానులున్నారు. ఆ తరువాత బాస్కెట్‌బాల్ అమెరికాలో ఎంతో ప్రాచుర్యం పొందిన ఆట. దీనికి 240 కోట్ల మంది అభిమానులున్నారు. టెన్నిస్‌కు 100 కోట్ల మంది అభిమానులున్నారు. ఇది వ్యక్తిగత ఆటగాళ్ళ మధ్య జరిగే కఠినమైన క్రీడల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. హాకీకి ప్రపంచ వ్యాపితంగా గుర్తింపు ఉంది. దీనికి 50 కోట్ల మంది అభిమానులున్నారు. ముఖ్యంగా భారత్, పాకిస్తాన్, యూరోప్ దేశాల్లో ఈ క్రీడకు పెద్ద సంఖ్యలో అభిమానులున్నారు. ఒకనాటి రష్యా, నేటి చైనా ప్రభుత్వాలు ఆటల మీద పెడుతున్న శ్రద్ధ వల్ల అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాల్లో ఉంటున్నాయి. జనాభాలో మనకంటే అతి తక్కువ ఉన్న దేశాలు కూడా ఒలింపిక్ క్రీడలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచాయి.

ఆట స్థలాలు లేక పేద విద్యార్థులు ఆటకు దూరం

ఆటలకు అవసరమయ్యే ఉపకరణాలు (యూనిఫామ్‌లు, క్రీడా సామాగ్రి...తదితరాలు) లేకపోవడం, అలాగే శిక్షణా కేంద్రాలు, అకాడమీలకు ఫీజులు చెల్లించలేకపోవడం, ప్రైవేటు సంస్థలు పెయిడ్ స్టేడియమ్‌లు ఏర్పాటు చేసుకోవడంతో పేద విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ఇందుకుగాను ప్రభుత్వాలు ఉచిత క్రీడా శిక్షణా కేంద్రాలు, అవసరమై సామాగ్రిని ఏర్పాటు చేసి స్కాలర్‌షిప్‌లు అందించాలి. అన్ని పాఠశాలల్లో క్రీడలను తప్పనిసరి చేయడం, ఆటలు ఆడడం ద్వారా వచ్చే ప్రయోజనాల గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేయాలి. కానీ, పట్టణాల్లో ఆట స్థలాలు తగ్గిపోవడంతోపాటు వాణిజ్య కేంద్రాలు, షాపింగ్ మాల్స్ నిర్మాణానికి ఉపయోగిస్తున్నారు. ఆట స్థలాలు కనుమరుగై పోతున్నాయి. ప్రభుత్వాలు ఆటలకు తప్పనిసరిగా స్థలాలు కేటాయించాలి. తక్కువ స్థలం అవసరమైన స్థానిక క్రీడలను ప్రోత్సహించడం ద్వారా పట్టణాల్లో చిన్న చిన్న స్థలాలను సమర్థవంతంగా ఉపయోగించవచ్చు.

ఆటలకు అవసరమయ్యే ఉపకరణాలు (యూనిఫామ్‌లు, క్రీడా సామాగ్రి తదితరాలు) లేకపోవడం, అలాగే శిక్షణా కేంద్రాలు, అకాడమీలకు ఫీజులు చెల్లించలేకపోవడం, ప్రైవేటు సంస్థలు పెయిడ్ స్టేడియమ్‌లు ఏర్పాటు చేసుకోవడంతో పేద విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ఇందుకుగాను ప్రభుత్వాలు ఉచిత క్రీడా శిక్షణా కేంద్రాలను, అవసరమై సామాగ్రిని ఏర్పాటు చేసి స్కాలర్‌షిప్‌లు అందించాలి.

ఆటతీరును మార్చిన ప్రభుత్వాలు

గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంతో ఆటలను ప్రోత్సహించాలంటూ పేద విద్యార్థులకు ఉచిత కిట్లు (క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ వగైరా) అందజేసి రాజకీయ ప్రచారానికి వినియోగించుకున్నారు.

మాటలు ఘనం - ఆచరణ శూన్యం

ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలు అభివృద్ధి పరిచి, రాష్ట్ర యువతను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామంది. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు రాష్ట్రాన్ని వేదికగా మారుస్తామంది. రాబోయే ఐదేళ్ళలో రాష్ట్రాన్ని క్రీడా హబ్‌గా మారుస్తామని గొప్పలు చెప్పింది. కానీ ఆచరణలో ఆటలకు సంబంధించిన చర్యలు తీసుకోవడంలో, సౌకర్యాలు అందించడంలో ఒక్క అడుగు ముందుకు వేయలేదు.

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరా గాంధీ స్టేడియమ్ విద్యార్థులందరికీ అందుబాటులో ఉండేది. రాజకీయ లబ్ధి కోసం శాప్ మేనేజ్‌మెంట్ దీనిని ప్రైవేటు వారికి అప్పగించి డబ్బులు చెల్లించినవారికే కోచింగ్‌లు, ట్రైనింగ్ చేసుకునేలా స్టేడియం బయట బోర్డులు ఏర్పాటు చేస్తున్నది. ఊరు చుట్టూ ఉన్న ఖాళీ ఆటస్థలాలలో ఆడనీయకుండా చెత్త వేయడం కోసం డంపింగ్ యార్డులుగా చేస్తున్నారు. సామాన్య పేద ప్రజల పిల్లల్ని ఆటలు ఆడనీయకుండా అడ్డు పడడం మనం చూస్తున్నాం. ఈ ప్రభుత్వ రెండు నాల్కల విధానం గురించి యువత ఆలోచించాలి.

ప్రభుత్వాలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆట స్థలాలు కేటాయించి క్రీడా మైదానాలు, సముదాయ కేంద్రాలు నిర్మించాలి. దీనికి స్థానిక సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్‌లతో కలిసి ప్రణాళికలు రూపొందించి, వీటి అభివృద్ధి, నిర్వహణ కోసం బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలి. కేటాయించిన నిధులను వీటికోసమే ఖర్చు చేయాలి. అప్పుడే పేద విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది.

- ఆర్. రాఘవేంద్ర



మో మో క్విడ్ ప్రోకో

గురువారం నాడు దేశవ్యాపితంగా అన్ని భాషల పత్రికలలోనూ ఒక పెద్ద మనిషి రాసిన వ్యాసం, అది కూడా మరొకరిపై రాసిన ప్రశంసల వ్యాసం ప్రచురితమైంది. గుర్తొచ్చేసినట్టుంది కదా..! సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ తన మాతృ సంస్థ ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ 75వ జన్మదినం సందర్భాన రాసిందది. అందులో పొగడ్తలు చూస్తే ఎవరికైనా తల తిరగాల్సిందే. 100 ఏళ్ల ఆరెస్సెస్ చరిత్రలో 2009-2025 మధ్య కాలం అంటే మోహన్ భగవత్ నాయకత్వ కాలమే సంచలన పరివర్తనకు కారణమైందని మోడీజీ కీర్తించారు. వివేకానందుడు చికాగోలో సర్వమత సమ్మేళనంలో చారిత్రాత్మక పిలుపునిచ్చిన రోజు ఇదేనని లింకు కూడా కలిపారు (అయితే 1889లో అదే రోజున మహాత్మా గాంధీ తన సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించిన సంగతి గుర్తు లేదా అని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ దెప్పిపొడిచారనుకోండి.). వివేకానందుడు సర్వ మత సమ్మేళనంలో మాట్లాడటానికీ, దేశంలో వారంతా హిందువులేనని ప్రకటించిన మోహన్ భగవత్ తీరుకు పోలిక ఏమిటో కూడా తెలియదు. కాకపోతే ఇక్కడ క్విడ్ ప్రో కో ఒక్కటే. కొంత కాలం కిందట మోడీ ప్రత్యేకంగా నాగపూర్ వెళ్లి నమస్సులు సమర్పించుకున్నా.. మళ్లీ భగవత్ 75 ఏళ్లకే పదవీ విరమణ గురించి మాట్లాడి ఇరుకున పెట్టారు. అయితే మరి ఆయన కూడా 75 దాటతారు కదా అని కొందరు ధర్మ సందేహాలు వెలిబుచ్చారు. భగవత్ ఆ తర్వాత మళ్లీ తనే అలాంటిదేం లేదు పొమ్మన్నారు. నేను ఎవరినీ ఉద్దేశించి అనలేదు, నేను కూడా దిగిపోతానని కాదు అని కుండబద్దలు కొట్టేశారు. దీని ఆధారంగా 2029లో కూడా మోడీనే ప్రధాని అభ్యర్థి అనీ, 2034లో కూడా కావచ్చునీ అయినా ఈ లెక్కలో తర్వాత అమిత్‌షా కు అవకాశం వుంటుందని కొంతమంది తేల్చారు. ఇందుకు ప్రతిఫలంగానే మోడీజీ ఇంత ప్రత్యేకంగా అందరికీ వ్యాసం రాసి మరీ మోహన్ భగవత్‌ను సంతోష పెట్టారని పరిశీలకుల మాట. నిజమే కదా మరి?

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మయన్మార్‌లో వైమానిక దాడి

- 19 మంది మృతి

నేపిదా : పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో జుంటా వైమానిక దాడిలో విద్యార్థులతో సహా 19 మంది మరణించారని మయన్మార్ జాతి మైనారిటీ సాయుధ బృందం శనివారం తెలిపింది. గత ఏడాది కాలంలో రఖైన్‌లో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్న అరకాన్ ఆర్మీ (ఎఎ) మయన్మార్ పాలక సైన్యంతో భీకర పోరాటం చేస్తోంది. క్యుక్తా టౌన్‌షిప్‌లోని రెండు ప్రైవేట్ ఉన్నత పాఠశాలలపై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన దాడిలో 15– 21 సంవత్సరాల మధ్య వయసులు గల విద్యార్థులు మరణించారని, 22మంది గాయాల పాలయ్యారని అరకాన్ ఆర్మీ శనివారం టెలిగ్రామ్ పోస్టులో తెలిపింది. జుంటా యుద్ధ విమానం ఒక హైస్కూలుపై 500 పౌండ్ల బాంబులను విసిరింది. ఆ సమయంలో పాఠశాలలో నిద్రిస్తున్న విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని లోకల్ మీడియా అవుట్‌లెట్ మయన్మార్ తెలిపింది. బాంబు దాడిని యునిసెఫ్ తీవ్రంగా ఖండించింది. రఖైన్ రాష్ట్రంలో పెరుగుతున్న వినాశకరమైన హింసలో పిల్లలు, కుటుంబాలు భారీ మూల్యం చెల్లిస్తున్నాయని యునిసెఫ్ ఒక ప్రకటనలో పేర్కొంది. క్యౌక్టా చుట్టుపక్కల ప్రాంతాలలో ఇంటర్నెట్, ఫోన్ సేవలు అస్తవ్యస్తంగా ఉండడంతో మీడియా అక్కడికి చేరుకోలేకపోయింది. మయన్మార్‌ని సైన్యమే పరిపాలిస్తుంది. దీంతో సైన్యం పాలనను ప్రజలు వ్యతిరేకించడంతో.. పౌర సమాజాలను దెబ్బతీసేందుకు మిలట్రీ ఫిరంగి దాడులకు పాల్పడుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

SBI నరసరావుపేట బ్రాంచి
నరసరావుపేట, పల్నాడు జిల్లా

సవరణ

ది.13-09-2025న 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రచురితమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసరావుపేట బ్రాంచి వారి శ్రీమతి ఐనంపూడి కోటేశ్వరమ్మకు సంబంధించిన వాహనం ఇ-వేలము ద్వారా అమ్మకం ప్రకటనలో ఇ-వేలం పోర్టల్ **M/s. C1 India Pvt. Ltd** కి బదులుగా **Baanknet.com** అని చదువుకొనవలెను.
మిగిలిన నియమ నిబంధనలతో ఎటువంటి మార్పులేదు.

ప్రదేశం: నరసరావుపేట
తేది: 13-09-2025
సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసరావుపేట బ్రాంచ్, నరసరావుపేట.

బ్యాంక్ ఆఫ్ ఇండియా
Bank of India — Relationship beyond banking
జగ్గయ్యపేట బ్రాంచి, డి.నెం.6-1173/1B, కోదాడ రోడ్డు, మైత్రీ హోండా షోరూమ్ ఎదురు, జగ్గయ్యపేట, యన్‌టిఆర్ జిల్లా-521175. ఫోన్: 08654-224757

SARFAESI ACT స్వాధీనతా ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3 క్రింద సంక్రమించిన అధికారములు వినియోగించుకుంటూ **బ్యాంక్ ఆఫ్ ఇండియా** అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు సదరు నోటీసు అందిన తేదీ నుంచి 60 రోజులలోగా **బకాయిమొత్తము: క్యాష్ క్రెడిట్ లిమిట్ క్రింద రూ.28,67,897.40 (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల అరవై ఏడు వేల ఎనిమిది వందల తొంభై ఏడు రూపాయలు మరియు నలభై పైసలు మాత్రమే) + 21-01-2025 తేదీనుండి @ 12.35%** P.A చొప్పున వడ్డీ మరియు GECL క్రింద **రూ.46,267/- (అక్షరాల నలభై ఆరు వేల రెండు వందల అరవై ఏడు రూపాయలు మాత్రమే) + 30-01-2025 తేదీనుండి @ 9.25%** P.A చొప్పున వడ్డీ **వెరశి మొత్తము రూ.29,14,164.40 (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల పద్నాలుగు వేల నూట అరవై నాలుగు రూపాయలు మరియు నలభై పైసలు మాత్రమే) మరియు ఇతర ఖర్చులు & వ్యయాలు** తిరిగి చెల్లించవలసిందిగా <u>ఋణగ్రహీతలు:</u> **M/s. సత్తార్ స్క్రాప్ డీలర్స్ తరపున యజమాని శ్రీ షేక్ సత్తార్** వార్లను కోరుతూ **ది.16-06-2025 తేదీ గల డిమాండ్ నోటీసు** జారీచేశారు.
ఋణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములు వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు **11 సెప్టెంబర్ 2025న స్వాధీనం చేసుకున్నారని** ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
ఆస్తితో ఎటువంటి వ్యవహారములు జరుపరాదని, ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా **చెల్లించవలసిన బకాయి క్యాష్ క్రెడిట్ లిమిట్ క్రింద రూ.28,67,897.40 (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల అరవై ఏడు వేల ఎనిమిది వందల తొంభై ఏడు రూపాయలు మరియు నలభై పైసలు మాత్రమే) + 21-01-2025 తేదీనుండి @ 12.35%** P.A చొప్పున **వడ్డీ మరియు** GECL క్రింద **రూ.46,267/- (అక్షరాల నలభై ఆరు వేల రెండు వందల అరవై ఏడు రూపాయలు మాత్రమే) + 30-01-2025 తేదీనుండి @ 9.25%** P.A చొప్పున **వడ్డీ వెరశి మొత్తము రూ.29,14,164.40 (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల పద్నాలుగు వేల నూట అరవై నాలుగు రూపాయలు మరియు నలభై పైసలు మాత్రమే) మరియు ఇతర ఖర్చులు & వ్యయాలు** కోసం **బ్యాంక్ ఆఫ్ ఇండియా, జగ్గయ్యపేట బ్రాంచి** హక్కుకు లోబడి ఆ విధంగా చేయవచ్చునని ముఖ్యంగా ఋణగ్రహీతను, మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది. సదరు చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించు కొనుటకు తగిన సమయం లభిస్తుందని ఋణగ్రహీతకు విన్నవించటమైనది.

స్థిరాస్తి యొక్క వివరములు

ఆస్తి-I: యన్‌టిఆర్ జిల్లా, జగ్గయ్యపేట జాయింట్ సబ్-రిజిస్ట్రార్ యొక్క లిమిట్స్, జగ్గయ్యపేట (టి&యమ్), ఎర్ర కాలువ రోడ్డు, రంగు బజారు, వెంకటేశ్వర స్కూల్ & BSNL ఆఫీస్ దగ్గర, అసెస్‌మెంట్ నెం.9982, డోర్ నెం.8-213, రీ సర్వే నెం.292/2 నందు 105.2 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **సదరు ఆస్తి శ్రీ షేక్ సత్తార్ పేరున కలదు. ఈ ఆస్తికి సరిహద్దులు: తూర్పు:** రోడ్డు; **దక్షిణం:** షేక్ మస్తాన్ యొక్క ఆస్తి; **పడమర:** రోడ్డు; **ఉత్తరం:** షేక్ మహబూబ్ యొక్క ఆస్తి.
ఆస్తి-II: యన్‌టిఆర్ జిల్లా, జగ్గయ్యపేట జాయింట్ సబ్-రిజిస్ట్రార్ యొక్క లిమిట్స్, జగ్గయ్యపేట మండలం, షేర్‌మొహమ్మద్‌పేట గ్రామము, NH-65 విజయవాడ రోడ్డుకు దగ్గర, SVR ఫుడ్ కోర్ట్ & ఇస్తా రెస్టారెంట్ వెనుకవైపు, డోర్ నెం.10-26, రీ సర్వే నెం.118/2 నందు 648.07 చ॥గ॥ విస్తీర్ణముగల ఖాళీస్థలము మరియు అందులో జిఐ షీట్ రూఫ్డ్ గ్రౌండ్ ఫ్లోర్ కమర్షియల్ షెడ్‌నకు సంబంధించిన యావదాస్తి. **సదరు ఆస్తి శ్రీ షేక్ సత్తార్ పేరున కలదు. ఈ ఆస్తికి సరిహద్దులు: తూర్పు:** 106 అడుగులు - షేక్ జరీనా బేగం యొక్క స్థలము; **దక్షిణం:** 62 అడుగులు - రోడ్డు; **పడమర:** 96 అడుగులు - రోడ్డు; **ఉత్తరం:** 53.5 అడుగులు - మోర్ దారమ్మ & బచ్చుటి నందబాయ్ యొక్క స్థలము.

తేది: 11.09.2025, ప్రదేశం: జగ్గయ్యపేట
సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया — भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)
లబ్బీపేట శాఖ,
డోర్ నెం.39-10-5, వి.యన్.ఆర్ టవర్స్, లబ్బీపేట, విజయవాడ-10 ఫోన్ : 8928903431
మెయిల్ :ubin0803430@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 54 / 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లబ్బీపేట శాఖ,** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు **తేది. 20-06-2025** న డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి **రూ.3,99,028/-** (మూడు లక్షల తొంభై తొమ్మిది వేల ఇరవై ఎనిమిది రూపాయిలు మాత్రమే) చెల్లించవలసినదిగా ఋణగ్రహీత **శ్రీ కిలారు శివ ప్రసాద్ మరియు శ్రీ బోడె వెంకటేశ్వరరావు.**
సదరు మొత్తాన్ని చెల్లించుటలో ఋణగ్రహీతల విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని దిగువ సంతకందారు **తేది.10-09-2025**న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.
ఈ స్థిరాస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన యెడల అవి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి బకాయి మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలకు బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

ఐటమ్ నెం-1: కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్టార్, పోరంకి గ్రామం మరియు పంచాయితీ, ఆర్.యస్ నెం. 430/12 కలిగి మొత్తం 274.10 చ॥గ॥లలో 54.42 చ॥గ॥ల అవిభాజ్యపు ఖాళీ స్థలం. దీనికి హద్దులు: **తూర్పు:** తోటకూర చలపతిరావు గారికి చెందిన సైట్, **దక్షిణం:** బజార్, **పడమర:** బోడె కోటేశ్వరరావు గారికి చెందిన సైట్, **ఉత్తరం:** కర్లపూడి వెంకటేశ్వరరావు గారికి చెందిన సైట్. **ఐటమ్ నెం-2:** పైన పేర్కొన్న షెడ్యూల్-1లో, "అన్నపూర్ణ నిలయం" ఫ్లాట్ నెం. యస్.ఎఫ్-2, 2వ ఫ్లోర్, డి.నెం.13-99లో నిర్మించబడిన రెసిడెన్సియల్ ఫ్లాటు మరియు 815.00 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, 258.00 చ॥అ॥ల బాల్కని ఏరియా, 135.00 చ॥అ॥ల కామన్ ఏరియా, 125.00 చ॥అ॥ల పార్కింగు ఏరియా **శ్రీ కిలారు శివ ప్రసాద్,** తండ్రి: రామ మోహన్‌రావు గారికి చెందినది. దీనికి హద్దులు: **తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:**మెట్లు మరియు కారిడార్. ఈ సరిహద్దులలో 815.00 చ॥గ॥ల ప్లింత్ ఏరియా, బాల్కనీ ఏరియాతో సహా 258.00 చ॥గ॥ల కామన్ ఏరియా (135.00 చ॥గ॥లు) మరియు 125.00 చ॥గ॥ల (పార్కింగ్ ఏరియా) అన్ని హక్కులు మరియు దాని అన్ని సౌలభ్య హక్కులతో సహా.

తేది : 10-09-2025
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మార్చిలో నేపాల్ ఎన్నికలు

- పార్లమెంట్ రద్దు ఖండించిన ప్రధాన పార్టీలు
- ఖాట్మాండుసహా పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ ఎత్తివేత
- సుశీలా కర్కికి ప్రపంచ నేతల అభినందనలు



కర్ఫ్యూ ఎత్తివేతతో ప్రశాంతంగా ఉన్న ఖాట్మాండు వీధులు

ఖాట్మాండు : నేపాల్ పార్లమెంట్‌ను అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ రద్దు చేశారు. వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. రెండు రోజులపాటు తీవ్ర అల్లర్లు చెలరేగిన నేపాల్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఖాట్మాండు వ్యాలీ, ఇతర ప్రాంతాల్లో శనివారం అధికారులు కర్ఫ్యూను ఎత్తివేశారు. నేపాల్ తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తూ తొలి మహిళా ప్రధానమంత్రిగా సుశీలా కర్కి ప్రమాణస్వీకారం చేసిన ఒకరోజు తరువాత దేశంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

పార్లమెంట్ రద్దును ఖండించిన ప్రధాన పార్టీలు

ప్రస్తుత పార్లమెంట్‌ను రద్దు చేయాలనే అధ్యక్షుడి నిర్ణయాన్ని నేపాల్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలు, ఇతర ప్రముఖులు ఖండించారు. అధ్యక్షుడి నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం, ఏకపక్షం, ప్రజాస్వామ్యానికి తీవ్రమైన దెబ్బగా విమర్శించాయి. రాజ్యాంగాన్ని ఉల్లంఘించే ఏ చర్యా ఆమోదయోగ్యం కాదని నేపాల్‌లో అతిపెద్ద రాజకీయ పార్టీ నేపాలీ కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయం ఆందోళనకరమని సిపిఎన్ – యుఎంఎల్ ప్రధాన కార్యదర్శి శంకర్ పోఖారెల్ ఖండించారు. సిపిఎన్ (మావోయిస్టు సెంటర్) కూడా అధ్యక్షుడి నిర్ణయాన్ని వ్యతిరేకించింది.

అనేక రికార్డులు ధ్వంసమయ్యాయి : సుప్రీంకోర్టు

ఇటీవల జరిగిన నిరసనల కారణంగా అనేక ముఖ్యమైన పత్రాలు ధ్వంసమయ్యాయని సుప్రీంకోర్టు తెలిపింది. వీలైనంత త్వరగా కార్యకలాపాలను తిరిగి ప్రారంభిస్తామని పేర్కొంది. నిరసనల్లో కోర్టు భవనాలకు నష్టం జరగడంపై ప్రధాన న్యాయమూర్తి ప్రకాష్‌మాన్ సింగ్ రౌత్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి బాధ్యతలు స్వీకరించనున్న సుశీలా కర్కి

నేపాల్ నూతన ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన సుశీలా కర్కి ఆదివారం నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.
ఇదే రోజున తన మంత్రివర్గాన్ని కూడా ప్రకటించించే అవకాశ ఉందని అధికారులు తెలిపారు. కర్కికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహ పలువురు ప్రపంచ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. కర్కి నియామకం మహిళా సాధికారతకు నిదర్శనమని, నేపాల్‌లో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు ఆమె పాటుపడతారని నమ్మకం ఉందని అన్నారు. శ్రీలంక అధ్యక్షుడు దిసానాయకే కర్కిని అభినందించారు. కర్కి నాయకత్వం నేపాల్‌కు శాశ్వత శాంతి, ప్రజాస్వామ్యం వైపు సజావుగా తిరిగి తీసుకురావడానికి మార్గనిర్దేశం చేస్తుందని అన్నారు. దలైలామా తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

పారిపోయిన ఖైదీలను అదుపులోకి తీసుకుంటున్న అధికారులు

అల్లర్ల సమయంలో వివిధ జైళ్ల నుంచి పారిపోయిన ఖైదీలను తిరిగి అదుపులోకి తీసుకుంటున్నారు. భారత్ సరిహద్దుల సమీపంలో ఇలాంటి ఖైదీలు 75 మంది అరెస్టు చేశారు. బీహార్ సరిహద్దుల్లో 43 మందిని, ఉత్తరప్రదేశ్ సమీపంలో 22 మందిని, ఉత్తరాఖండ్ సమీపంలో ఎనిమిది మందిని, బెంగాల్ సమీపంలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఒంటరి ఏనుగు స్వైరవిహారం

- ఫారెస్టు అధికారిపై దాడి

ప్రజాశక్తి- పలమనేరు, రామకుప్పం

పలమనేరు పట్టణ శివారులో సాయిబాబా ఆలయం సమపంలో ఉన్న గంగవరం మండలంలోకి ఓ ఏనుగు వచ్చిందని గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగారు. ట్రాకర్స్ ఆ ఏనుగును అడవిలోకి మళ్లించే యత్నంలో ఒంటరి ఏనుగు తిరగబడింది. గ్రామస్తులపైకి దాడికి తెగబడింది. పరిగెత్తలేక కింద పడిపోయిన అటవీశాఖ అధికారిపై దాడికి దిగింది. పరిగెత్తలేక కింద పడిపోయిన ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సుకుమార్‌ను తొక్కివేసింది. ఎట్టకేలకు ఏనుగును దారి మళ్లించిన గ్రామస్తులు గాయపడిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుకుమార్‌ను కాపాడి పలమనేరు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పలమనేరు, గంగవరం మండలాల్లోని ప్రజలతోపాటు అటవీ సమీప ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. గతంలో ఏనుగులు అటవీ సమీప ప్రాంతాల్లోని పంటపొలాలపై దాడి చేసి తిని తొక్కి నాశనం చేసేవని, పలుమార్లు పశువులు, రైతులపై కూడా దాడి చేసి చంపిన ఘటనలు చాలానే ఉన్నాయని, అయితే ప్రస్తుతం ఏనుగులు పట్టపగలు కూడా జాతీయ రహదారిపైకి వచ్చి జనంపై దాడికి తెగబడుతున్నాయని, ఇకనైనా అటవీశాఖతోపాటు ప్రభుత్వం ఏనుగుల దాడుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

రాజధానిపై జగన్ రివర్స్ డ్రామా : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రాజధాని అమరావతిపై రివర్స్ డ్రామాకు జగన్ తెరతీశారని రాష్ట్ర మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అమరావతిపై మరో జగన్నాటకానికి తెరతీశారని ఓ ప్రకటనలో విమర్శించారు. 2019 ఎన్నికల సమయంలో అమరావతే రాజధాని అని, తన నివాసం ఇక్కడే ఉందని ప్రజలను నమ్మబలికారన్నారు. అధికారంలోకి రాగానే మాట మార్చేసి మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరతీశారన్నారు. అయిదేళ్లలో ఏ ఒక్క ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా, రాజధాని లేని రాష్ట్రానిగా ఎపిని భ్రష్టు పట్టించారన్నారు. అమరావతిని స్మశానమని, మునిగిపోయే ప్రాంతమని చులకన చేసి జగన్ సహా వైసిపి నాయకులంతా మాట్లాడారన్నారు. ఆంధ్రుల చిరకాల కల అమరావతి కోసం భూములిచ్చిన రైతులు, మహిళలను పెయిడ్ ఆర్టిస్టులంటూ హేళన చేశారన్నారు. జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన యావత్ ఎపి ప్రజలు ఛీ కొట్టి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఇన్ని విధాలా అమరావతిపై విషం కక్కిన జగన్ ఇప్పుడు రాజధానికి అనుకూలమంటూ చెప్పడం మరో జగన్నాటకానికి తెర తీయడమే అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికిని కాపాడుకోడానికి జగన్ ఆడుతున్న రివర్స్ డ్రామా అని ధ్వజమెత్తారు.

బంతిపూల ధరలు పతనం

- కొనేవారు లేక తోటలోనే మగ్గుతున్న పూలు
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు

ప్రజాశక్తి- వి కోట

గత కొంతకాలంగా భారీగా ధర పెరిగి ప్రజలకు చుక్కలు చూపించిన పూల ధరలు నేడు పతనమయ్యాయి. ధర పడిపోవడంతో బంతిపూలు సాగు చేసిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆగస్టు నెలలో ఆశాజనకంగా ఉన్న పూల ధరలను చూసి దసరాపై ఆశతో రైతులు పెద్దఎత్తున పూల పంటను సాగు చేశారు. స్థానిక పూల మార్కెట్‌లో ధరలు పతనం కావడంతో కొనుగోలుదారులు లేక రైతులు తాము తెచ్చిన పూల మూటలను మార్కెట్‌లోనే వదిలి పెట్టి ఒట్టిచేతులతో ఉసురుమంటూ కన్నీళ్ళతో ఇంటికి వెలుతున్న దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.

జూలై, ఆగస్టు నెలల్లో పెళ్లిళ్లు, పండుగలతో పాటు ఇతర శుభకార్యాలు అధికంగా ఉండటంతో బంతిపూల 35 కేజీల బస్తా రూ.80 నుండి 100ల వరకు ధరలు పలికాయి. సెప్టెంబర్ నెల రావడంతో పక్షాలు మొదలయ్యాయంటూ కొనుగోలుదారులు మార్కెట్లో పూలు కొనుగోలు తగ్గించేశారు. ప్రస్తుతం మార్కెట్లో 35 కేజీల బస్తా పూలు రూ.30 నుండి 70ల వరకు ధరలు పలుకుతున్నాయి. ఇక రెండు, మూడో రకం పూలు కొనేవారు లేక తోటల్లోనే వదిలేయడంతో పొలాల్లోనే పూలు వాడి మగ్గిపోతున్నాయి. దసరా నాటికైనా పూల ధరలు పెరుగుతాయో లేదో అన్న అయోమయంలో రైతులు సతమతమవుతున్నారు.

కుప్పం పూలమార్కెట్లో కొనుగోలు తగ్గడంతో అటువైపు వెళ్లే రైతులు కూడా వికోట మార్కెట్‌కు వస్తున్నారు. పూలు అధికం దిగుమతి కావడం కూడా ధరలపై ప్రభావం చూపిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

సాగుచేసిన పూలను మార్కెట్లో నిల్వ ఉంచలేని పరిస్థితులలో తక్కువ ధరలకే పూలను విక్రయిస్తుంటారు. ఇదే అదునుగా కొందరు దళారులు మార్కెట్‌కు వచ్చిన రైతుల నుండి తక్కువ ధరలకు పూలను కొనుగోలు చేసి రాజమండ్రి, హైదరాబాద్, తిరుపతి, విజయవాడతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు ప్రధాన నగరాలకు తరలిస్తుంటారు. అక్కడ మార్కెట్లలో పూలు అమ్ముడుపోలేదని రైతులను మోసగిస్తుండడంతో పంటలపై పెట్టిన పెట్టుబడులు, కూలీలు, రవాణా, సంచులు తదితర వ్యయాలు అంతా రైతులే భరిస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి.

మార్కెట్లపై అధికారులు దృష్టి సారించాలి - బాలు,రైతు, కొత్తూరు

వ్యవసాయ మార్కెట్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ మార్కెట్లకు రైతులు పండించి వ్యవసాయ మార్కెట్లకు తరలించే పూలు, వివిధ రకాల కూరగాయల ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలి. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పూల మొక్కలు ఎరువులు, పురుగుల మందులు అందజేయాలి. పండిన పంటలను మార్కెట్లకు తరలించేందుకు అవసరమైన రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అధికారులు దృష్టి సారించాలి.

ప్రకృతి వనరుల సద్వినియోగంతో...

ఉద్దాన ప్రాంతం అభివృద్ధి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజశర్మ

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఉద్దాన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ సూచించారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి, నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన జుత్తు సింహాచలం అధ్యక్షతన 'ఉద్దానం ప్రాంత అభివృద్ధి–అవకాశాలు, అవరోధాలు' అనే అంశంపై శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.అజశర్మ మాట్లాడుతూ జీడికి గిట్టుబాటు ధర కల్పించి 80 కేజీల బస్తా రూ.16 వేలకు రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఉద్దాన ప్రాంతంలో జీడి బోర్డుతో పాటు జీడి పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కొబ్బరి బోర్డుతో పాటు జీడి, కొబ్బరినార సహకార పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉద్దాన ప్రాంతంలో ఉద్యాన పంటలపై జీవనం సాగిస్తున్నారని, మరింత ఎక్కువ సాగుకు అనుగుణంగా ఉచితంగా మొక్కలు, ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఏటా పంటలకు రుణ సదుపాయం కల్పించాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఉద్దాన ప్రాంతంలో అత్యధికంగా వర్షపాతం నమోదవుతోందని, దాన్ని వినియోగించుకుని పంటలు పండించుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధితో యువకుల నుంచి వృద్ధుల వరకు ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని, కిడ్నీ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పలాస కిడ్నీ ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధిపై పూర్తి స్థాయిలో పరిశోధనలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం చొరవ చూపి పరిశోధనలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తున్నా, నేటికీ పూర్తి కావడం లేదన్నారు. త్వరితగతిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేసి పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి మండలాలకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలని కోరారు. వంశధార ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టి ఇచ్ఛాపురం వరకు పొడిగించి శివారు భూములకు నిరంతరం సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, మత్స్యకారులకు ఉపాధితో పాటు రక్షణ కల్పించాలని కోరారు. ఉద్దాన ప్రాంతంలో నైపుణ్యాభివృద్ధి, సైనిక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్దాన ప్రాంతంలో కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కో కన్వీనర్ జుత్తు సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ కొత్తకోట అప్పారావు, కో కన్వీనర్ పాలవలస ధర్మారావు, వైద్యులు డాక్టర్ ఖగేశ్వరరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, వంశధార జల సాధన కమిటీ ఉపాధ్యక్షులు కె.హేమారావు చౌదరి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇజ్రాయిల్ విధ్వంసం

- గాజాపై దాడుల్లో 32 మంది మృతి
- నివాస ప్రాంతాలను ఖాళీ చేయాలని హెచ్చరిక

గాజా స్ట్రిప్ : గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామని ఇజ్రాయిల్ ప్రకటించిన అనంతరం దాడులను తీవ్రం చేసింది. శనివారం జరిపిన దాడుల్లో 32 మంది మరణించగా, అందులో 12 మంది పిల్లలున్నారు. వైమానిక దాడులు కొనసాగుతున్నాయని, క్షతగాత్రులు శిఫా హాస్పటల్‌కు వస్తూనే ఉన్నారని గాజా ఆరోగ్య సిబ్బంది తెలిపారు. పాలస్తీనియన్లు తక్షణమే గాజాను ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ సైన్యం హెచ్చరించింది. సైన్యం బెదిరింపుల నేపథ్యంలో గాజాలో 10 లక్షల పాలస్తీనియన్లు నివసిస్తుండగా, అందులో 2.5 లక్షల మందికిపైగా తరలిపోయారు. సర్వం కోల్పోయిన వారు రవాణా ఖర్చులు భరించలేక, గృహ వసతి లేక శరణార్థులుగా తాత్కాలిక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఈ శిబిరాలను కూడా వదలకుండా ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడులు చేస్తుంది. శనివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ షేక్ రద్వాన్ ప్రాంతంలోని ఓ ఇంటిపై దాడి చేసింది. ఈ దాడిలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ముగ్గురు పిల్లలతో పాటు 10 మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. లక్షలాది మందిని బలవంతంగా తరలిస్తే అనేక సమస్యలు వస్తాయని, మానవతా సంక్షోభం మరింత తీవ్రతరం అవుతుందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఐరాస సహకారంతో తాత్కాలిక ఆశ్రయాలను ఏర్పాటు చేసింది. దీనిలో 86 వేల టెంట్లు సిద్ధం చేసింది. అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని గాజా ఆరోగ్య అధికారులు తెలిపారు. ఖతార్‌లో శాంతి చర్చలు జరుపుతున్న హమాస్‌పై చేసిన దాడిలో ముఖ్య నేతలు తప్పించుకోవడం, పలు దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తిస్తూ ప్రకటించడం, ఐరాస జనరల్ అసెంబ్లీలో పాలస్తీనా ఏర్పాటుకు 142 దేశాలు అనుకూలంగా ఓట్లు వేయడంతో ఇజ్రాయిల్‌పై ఒత్తిడి పెరిగింది.

यूनियन बैंक ऑफ इंडिया — भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)
లబ్బీపేట శాఖ,
డోర్ నెం.39-10-5, వి.యన్.ఆర్ టవర్స్, లబ్బీపేట, విజయవాడ-10 ఫోన్ : 8928903431
మెయిల్ :ubin0803430@unionbankofindia.bank

డిమాండ్ నోటీస్

13(2) ఆఫ్‌సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్ 54 ఆఫ్ 2002

<u>టు:</u> **1)** శ్రీ రాచకొండ సుబ్రహ్మణ్యం (రుణగ్రహీత), తండ్రి ఆర్ వెంకట సుబ్బారావు, ఫ్లాట్ నెం జి.ఎఫ్-1, గ్రౌండ్ ఫ్లోర్, డి.నెం 77-87/1-12 దగ్గర, ప్లాట్ నెం 21, సింధు ఎన్‌క్లేవ్, ప్రశాంతి కాలనీ, పాయకాపురం, విజయవాడ-520015, **2)** శ్రీమతి రాచకొండ శశికళ (గ్యారంటర్), భర్త. ఆర్ సుబ్రహ్మణ్యం, ఫ్లాట్ నెం జి.ఎఫ్-1, గ్రౌండ్ ఫ్లోర్, డి.నెం 77-87/1-12 దగ్గర, ప్లాట్ నెం 21, సింధు ఎన్‌క్లేవ్, ప్రశాంతి కాలనీ, పాయకాపురం, విజయవాడ-52001.

ఋణ స్వభావం	మొత్తము (రూ.) లక్షలలో	తేది. 20-06-2025 నాటికి బకాయి మొత్తము (రూ.)
545406650000103 (TLU15)	35,73,929.32 పై	35,73,929.32 పై
545402010004799	1,37,000/-	1,37,000/-

డిమాండ్ నోటిసు తేది. 02-07-2025

<u>స్థిరాస్తి వివరములు: ఎ-షెడ్యూల్:</u> విజయవాడ, విజయవాడ సబ్ రిజిస్ట్రార్ పరిమితి, పాయకపురం, ప్రశాంతి కాలనీ, డోర్ నెం. 77-87/1-12 దగ్గర, ఆర్.యస్ నెం.62/1ఎలో మొత్తం 201.60 చ॥గ॥లలో 50.40 చ॥గ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగం అన్ని హక్కులతో ఈ దిగువ హద్దులలో: **తూర్పు:** ప్లాట్ నంబర్ 13, **దక్షిణం:** ప్లాట్ నంబర్ 40, **పశ్చిమం:** 33' వైడ్ రోడ్, **ఉత్తరం:** ప్లాట్ నంబర్ 20. <u>బి-షెడ్యూల్:</u> పైన పేర్కొన్న ఎ-షెడ్యూల్‌లో "సింధు ఎన్‌క్లేవ్" అనే పేరు మరియు శైలి ప్రకారం నిర్మించిన నివాస ఫ్లాట్ నెం. జి.ఎఫ్-1, గ్రౌండ్ ఫ్లోర్, డోర్ నెం 77-87/1-12 దగ్గర, 850.00 చ॥అ॥ల ప్లింత్ ఏరియా మరియు 30.00 చ॥అ॥ల కామన్ ఏరియా మరియు 20.00 చ॥అ॥ల పార్కింగ్ ఏరియాతో శ్రీ రాచకొండ సుబ్రహ్మణ్యం మరియు శ్రీమతి రాచకొండ శశికళ గార్లకు చెందినది. దీనికి హద్దులు: **తూర్పు:** స్టేర్‌కేస్ మరియు కారిడార్, **దక్షిణం:** ప్లాట్ నెం 40, **పడమర:** 33 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం 20

అమ్మ / అయ్యా.
విషయం: మీరు లబ్బీపేట శాఖ నుండి అనుభవించిన ఋణ సౌకర్యములను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ 13 (2) నోటిసు ప్రకారము - నిరర్థక ఆస్తిగా వర్గీకరించడమైనది.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా **లబ్బీపేట శాఖ** వారి నుండి పొందిన ఋణమును బకాయి / వడ్డీ / ఇన్‌స్టాల్‌మెంట్ తిరిగి చెల్లించుటలో విఫలమైనందున **ది. 20-06-2025** తేదిన నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడింది. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు బకాయి చెల్లించుటలో విఫలమైనారు. మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. కావున మీ ఖాతాను ఎన్.పి.ఏ (నిరర్థక ఆస్థి) అయ్యింది.
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌క్షట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఆర్డినెన్స్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన ఋణం రాబట్టుటకు + చార్జ్ చేయని వడ్డీ + ఇతర ఛార్జీలు + ముగింపు తేది వరకు జేబు ఖర్చులతో సహ ఈ నోటిసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేద అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది. మీరు పైన ఉదహరించిన బకాయిని 60 రోజులలో లోపల తిరిగి చెల్లించని యెడల బ్యాంకు వారు సదరు చట్టంలోని అన్ని హక్కులను ఉపయోగించి మరియు అమ్మకము జరిగిన తరువాత పూర్తి బకాయి చెల్లించుటలో విఫలమైన బ్యాంకు వారు కోర్టు ఆఫ్ లా/డెప్ట్స్ రికవరి ట్రిబ్యూనల్ ద్వారా మిగిలిన బకాయిని చట్టరిత్యా వసూలు చేయబడును. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారము ఈ నోటిసు అందిన నుండి మీరు పైన చెప్పబడిన ఆస్తిని సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు, మరియు లావాదేవిలు జరుపరాదు, సదరు సెక్షన్ నిబంధనల అతిక్రమణ జరిగితే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
SARFAESI చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 02-07-2025
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया — भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)
లబ్బీపేట శాఖ,
డోర్ నెం.39-10-5, వి.యన్.ఆర్ టవర్స్, లబ్బీపేట, విజయవాడ-10 ఫోన్ : 8928903431
మెయిల్ :ubin0803430@unionbankofindia.bank

డిమాండ్ నోటీస్

13(2) ఆఫ్‌సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్ 54 ఆఫ్ 2002

<u>ఋణగ్రహీతలు:</u> **1)** లేటు శ్రీమతి రహీమున్నీసా బేగంకు చెందిన ఎస్టేట్ ప్రతినిధులు: ఎ) శ్రీ మొహమ్మద్ హరూన్, బి) శ్రీ మొహమ్మద్ మున్వర్ సి) మరియు లేటు ఎండి ఉస్మాన్ఇతర చట్టపరమైన వారసులు, డి.నెం 11-62-162, కెనాల్ రోడ్ & బిపిఆర్ రోడ్ కార్నర్, వన్ టౌన్, విజయవాడ-520001, **2)** లేటు శ్రీమతి రహీమున్నీసా బేగంకు చెందిన ఎస్టేట్ ప్రతినిధులు: ఎ) శ్రీ మొహమ్మద్ హరూన్, బి) శ్రీ మొహమ్మద్ మున్వర్ సి) మరియు లేటు ఎండి ఉస్మాన్ఇతర చట్టపరమైన వారసులు, డి.నెం 11-62-162, కెనాల్ రోడ్ & బిపిఆర్ రోడ్ కార్నర్, వన్ టౌన్, విజయవాడ-520001, <u>సహ-దరకాస్తుదారులు:</u> **1)** శ్రీ మొహమ్మద్ హరూన్, తండ్రి. లేటు ఎండీ ఉస్మాన్,డి.నెం.11-62-162, రాణిమా కాంప్లెక్స్, కెనాల్ రోడ్ & బిపిఆర్ రోడ్ కార్నర్, వన్ టౌన్, విజయవాడ-520001, **2)** శ్రీ మొహమ్మద్ మున్వర్ తండ్రి. లేటు ఎండీ ఉస్మాన్, డి నెం 11-62-162, రాణిమా కాంప్లెక్స్, కెనాల్ రోడ్ & బిపిఆర్ రోడ్ కార్నర్, వన్ టౌన్, విజయవాడ-520001, **3)** శ్రీ మొహమ్మద్ హరూన్, తండ్రి. లేటు ఎండీ ఉస్మాన్, డి నెం 7-11-3, టిఎస్పి స్ట్రీట్, మహంతిపురం, విజయవాడ-520001, **4)** శ్రీ మొహమ్మద్ మున్వర్, తండ్రి. లేటు ఎండీ ఉస్మాన్, డి నెం 7-11-3, టిఎస్పి స్ట్రీట్, మహంతిపురం, విజయవాడ 520001

ఋణ స్వభావం	మొత్తము (రూ.) లక్షలలో	తేది. 31-07-2025 నాటికి బకాయి మొత్తము (రూ.)
545406680000022 (TLU18)	10,94,538.67 పై	10,94,538.67 పై

డిమాండ్ నోటిసు తేది. 31-07-2025

<u>స్థిరాస్తి వివరములు: ఎ-షెడ్యూల్:</u> విజయవాడ, సబ్ రిజిస్ట్రార్ పరిమితి, పాత డోర్ నెం.11/135, ప్రస్తుత డోర్ నెం.11-62-162, ఎన్.టి.యస్ నెం.262 భాగంలో 120.00 చ॥గ॥ల లేదా 100.33 చ॥మీ॥ల స్థలం అన్ని హక్కులతో. <u>షెడ్యూల్ ఆస్తి:</u> విజయవాడ టౌన్, అసెస్‌మెంట్ నెం.6731 మరియు బ్లాక్ నెం.7, రెవెన్యూవార్డ్ నెం.7, మున్సిపల్‌వార్డు నెం.11, సినిమా థియేటర్స్ రోడ్, కెనాల్ రోడ్, వన్ టౌన్, పాత డోర్ నెం.11/135, ప్రస్తుత డోర్ నెం.11-62-162, ఎన్.టి.యస్ నెం.262 భాగంలో విజయవాడ సబ్ రిజిస్ట్రార్ పరిమితి, యన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ పరిమితిలో 120.00 చ॥గ॥ల లేదా 100.33 చ॥మీ॥ల స్థలం అన్ని హక్కులతో శ్రీమతి రహీమున్నీసా బేగంకు చెందినది. ఈ దిగువ హద్దులలో: **తూర్పు:** పోస్ట్ ఆఫీస్ రోడ్డు, **దక్షిణం:** కెనాల్ రోడ్, **పశ్చిమం:** విక్రేత యొక్క ఆస్తి, **ఉత్తరం:** గెల్లి వారు యొక్క ఆస్తి.

అమ్మ / అయ్యా.
విషయం: మీరు లబ్బీపేట శాఖ నుండి అనుభవించిన ఋణ సౌకర్యములను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ 13 (2) నోటిసు ప్రకారము - నిరర్థక ఆస్తిగా వర్గీకరించడమైనది.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా **లబ్బీపేట శాఖ** వారి నుండి పొందిన ఋణమును బకాయి / వడ్డీ / ఇన్‌స్టాల్‌మెంట్ తిరిగి చెల్లించుటలో విఫలమైనందున **ది. 29-07-2025** తేదిన నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడింది. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు బకాయి చెల్లించుటలో విఫలమైనారు. మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. కావున మీ ఖాతాను ఎన్.పి.ఏ (నిరర్థక ఆస్థి) అయ్యింది.
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌క్షట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఆర్డినెన్స్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన ఋణం రాబట్టుటకు + చార్జ్ చేయని వడ్డీ + ఇతర ఛార్జీలు + ముగింపు తేది వరకు జేబు ఖర్చులతో సహ ఈ నోటిసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేద అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది. మీరు పైన ఉదహరించిన బకాయిని 60 రోజులలో లోపల తిరిగి చెల్లించని యెడల బ్యాంకు వారు సదరు చట్టంలోని అన్ని హక్కులను ఉపయోగించి మరియు అమ్మకము జరిగిన తరువాత పూర్తి బకాయి చెల్లించుటలో విఫలమైన బ్యాంకు వారు కోర్టు ఆఫ్ లా/డెప్ట్స్ రికవరి ట్రిబ్యూనల్ ద్వారా మిగిలిన బకాయిని చట్టరిత్యా వసూలు చేయబడును. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారము ఈ నోటిసు అందిన నుండి మీరు పైన చెప్పబడిన ఆస్తిని సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు, మరియు లావాదేవిలు జరుపరాదు, సదరు సెక్షన్ నిబంధనల అతిక్రమణ జరిగితే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
SARFAESI చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 31-07-2025
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

హిజ్రాలు దాడి చేశారని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయవాడ

హిజ్రాలు దాడి చేశారని మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ గిరిపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గిరిపురానికి చెందిన గోపీచంద్ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన మంజుల అనే యువతిని గత మూడేళ్లుగా ప్రేమిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోపీచంద్ ఇంటిపై ఈ నెల 11న యువతి తరపున 20 మంది హిజ్రాలు దాడి చేసి, యువకుడిని, ఆయన తండ్రి కుమార్‌బాబు, తల్లి కుమారిని విచక్షణా రహితంగా కొట్టారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడి తల్లి కుమారి రెండు రోజుల క్రితం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందారు. దీంతో మహిళ బంధువులు మాచవరం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. హిజ్రాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఐదు కేసుల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు తెలిపారు. సిఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడుకు చెందిన మిథున్ కుమార్, ఉదయ్ కుమార్, ముత్తు రామలింగం గంజాయిని తరలించేందుకు రైల్వే స్టేషన్లో ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని పరిశీలించగా వారి వద్ద ఐదు కేసుల గంజాయి పట్టుబడింది. ఐదుగురినీ అరెస్టు చేసి పోలీసులు కేసు నమోదు చేశారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై గట్టి నిఘా పెట్టామని డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో సిఐ మీసాల చిన్నంనాయుడు, టౌన్ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

కిలో టమోటా రూపాయి

పంటను అక్కడే పారబోసిన రైతన్న

ప్రజాశక్తి-పత్తికొండ (కర్నూలు)

కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో శనివారం కిలో టమోటా రూపాయి పలకడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. తుగ్గలి మండల గిరిగెట్ల గ్రామానికి చెందిన రైతు దాదాపు 60 గంపలు (ఒక గంప 25 కిలోలు) పత్తికొండ మార్కెటుకు తీసుకువచ్చారు.జత గంపను రూ.50తో (కిలో రూ.1) వ్యాపారస్తులు అడగారు. దీంతో కడుపు మండిన రైతన్న తాను తీసుకువచ్చిన పంటను మార్కెట్ ఫ్లాట్ ఫారంపై పారబోసి ఇంటికి వెళ్లిపోయారు. కొందరు రైతులు తాము తీసుకువచ్చిన టామోటాను వెనక్కు తీసుకువెళ్లారు. మరికొందరు ఇంటికి తీసుకువెళ్లలేక వచ్చిన కాడికి అమ్ముకున్నారు. శనివారం ఒక్కరోజే సుమారు 400 క్వింటాళ్లు మార్కెటుకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. నాణ్యత పేరుతో వ్యాపారస్తులు మోసం చేస్తున్నారని, కనీసం ఆటో ఛార్జీలు కూడా రావడం లేదని రైతు రంగమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. 25 కిలోల బాక్స్‌కు రూ. 60 ధర పలికిందని, కూలి, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని మరో రైతు రామచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతులు నాణ్యమైన టమోటాను మార్కెటుకు తీసుకొచ్చి గిట్టుబాటు ధరను పొందాలని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ నబిసాహెబ్ తెలపడం గమనార్హం. నంద్యాల జిల్లా ప్యాపిలిలో శుక్రవారం కిలో నాలుగు రూపాయలు పలకడంతో శనివారం రైతులెవ్వరూ మార్కెటుకు తమ పంటను తీసుకురాలేదు.

అల్లూరు జిల్లా కింద్రలో చికున్‌గున్యా విజృంభణ

- గ్రామాల్లో స్టేట్ జాయింట్ డైరెక్టర్ బృందం సర్వే

ప్రజాశక్తి- రాజవొమ్మంగి (అల్లూరి జిల్లా)

మండలంలోని కింద్ర గ్రామంలో 19 మందికి చికున్‌గున్యా సోకినట్లు అధికారులు వెల్లడించడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రాజవొమ్మంగి, కింద్ర, లాగరాయి, లబ్బర్తి గ్రామాల్లో కాళ్లవాపు, జ్వరాలతో ప్రజల ఇబ్బందులపై కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల వైద్యబృందం కింద్ర గ్రామంలో 21 మంది నుండి రక్తనమూనాలు తీసుకువెళ్లింది. వీటిని పరీక్షించగా 19 మందికి చికున్‌గున్యా ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని రంపచోడవరం అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ డేవిడ్ తెలిపారు. శుక్రవారం విజయవాడ నుండి జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర ట్రైబల్ నోడల్ ఆఫీసర్, ముగ్గురు సూపర్‌వైజర్లు వచ్చి కింద్రలో ఇంటింటా సర్వే చేశారని, ఐదుగురు నుండి రక్తపూతసేకరణ చేశారని డాక్టర్ డేవిడ్ చెప్పారు. శనివారం కూడా మిగతా సర్వే చేసినట్లు డేవిడ్ తెలిపారు. గ్రామాల్లో దోమతెరలు పంపిణీ చేస్తామని చెప్పారు. గ్రామంలో మెడికల్ క్యాంపులు కొనసాగుతాయని, ప్రజల ఆందోళన చెందొద్దని, మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయిన ఇద్దరు మహిళలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కొండ వాగు ఉధృతికి ఇద్దరు మహిళలు గల్లంతయ్యారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంత సమీపంలో తెలంగాణ పరిధిలోని చెన్నాపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని పూచికపాడు గ్రామానికి చెందిన ఎనిమిది మంది కార్మికులు తెలంగాణ రాష్ట్రం కావడిగుండ్ల పంచాయతీ చెన్నాపురం సమీపంలో పత్తి పొలంలో పనిచేసేందుకు వెళ్లారు. ఎగువన కురిసిన భారీ వర్షంతో గోపన్నగూడెం - కావడిగుండ్ల మధ్య కొండ వాగు ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించింది. నలుగురు కార్మికులు వాగు దాటుతుండగా పాలడుగుల చెన్నమ్మ (50), పచ్చితాళ వరలక్ష్మి (55) గల్లంతయ్యారు. తెలంగాణ పోలీసులు, జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ క్రాంతికుమార్‌లు ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు.ఆచూకీ తెలియాల్సి ఉంది.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- జికె వీధి (అల్లూరి జిల్లా)

మండలంలోని పెదవలస చాపరాతి పాలెం గ్రామాల మధ్యలో శనివారం భారీ లారీ అదుపుతప్పి లోయవైపు ఒదిగిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. అటుగా వెళ్లే వాహన దారులు సమాచారం అందించడంతో జెసిబిని తీసుకొచ్చి ఒరిగిపోయిన లారీని సరిచేశారు.

లోయ వైపునకు ఒరిగిన భారీ వాహనం

శ్రీలంక అలవోకగా..

బంగ్లాదేశ్‌పై ఆరు వికెట్ల తేడాతో గెలుపు

అబుదాబి: ఆసియాకప్ క్రికెట్ టోర్నీలో శ్రీలంక జట్టు శుభారంభం చేసింది. బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు 6వికెట్ల తేడాతో అలవోక విజయాన్నందుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టును శ్రీలంక బౌలర్లు కట్టడి చేశారు. దీంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 5వికెట్ల నష్టానికి 139పరుగులు మాత్రమే చేయగల్గింది. ఆ లక్ష్యాన్ని శ్రీలంక జట్టు 14.4ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి 140పరుగులు చేసి గెలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌కు శుభారంభం దక్కలేదు. పరుగుల ఖాతా తెరవకుండానే ఓపెనర్లు ఇద్దరూ పెవీలియన్‌కు చేరారు. 11 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయినా.. జట్టు స్కోర్ 52పరు గులకే చేరేసరికి సగం వికెట్లు కోల్పోయి తేరుకోలేక పోయింది. కెప్టెన్ లింటన్ దాస్(28) రాణించినా.. జాకిర్ అలీ(41), షమీమ్ హొసైన్(42) అజేయంగా నిలిచి జట్టును ఆదుకున్నారు.

శ్రీలంక బౌలర్లు హసరంగకు రెండు, తుషార, ఛమీరకు ఒక్కో వికెట్ దక్కాయి. ఇక లంక జట్టు ఓపెనర్ నిస్సంక(50) అర్ధసెంచరీకి తోడు కమిల్ మిశ్రా(46నాటౌట్; 32బంతుల్లో 4ఫోర్లు, 2 సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కమిల్ మిశ్రాకు దక్కింది.

పోరాడుతున్న సౌత్‌జోన్

సెంట్రల్ జోన్ 511ఆలౌట్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ జట్టు పట్టు బిగించింది. సౌత్‌జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో మూడోరోజు సెంట్రల్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 511పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. దీంతో ఆ జట్టు సౌత్‌జోన్‌పై 362పరుగుల భారీ ఆధిక్యతను సంపాదించింది. కెప్టెన్ రజత్ పటీధర్(101), యశ్ రాథోడ్(194)కి తోడు సరంష్ జైన్(69) బ్యాటింగ్‌లో రాణించారు. సౌత్‌జోన్ బౌలర్లు గురుప్రీత్ సింగ్, అంకిత్ శర్మకు రెండేసి, నిధీస్, కౌశిక్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్‌జోన్ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్లు నష్టపోయి 129పరుగులు చేసింది. రవిచంద్రన్(37), రికీ బుయ్(26) క్రీజ్‌లో ఉన్నారు.

ఫైనల్‌కు లక్ష్యసేన్

సాత్విక్, చిరాగ్‌శెట్టి జోడీ కూడా.. ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీ

హాంకాంగ్: ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లోకి లక్ష్యసేన్‌తోపాటు సాత్విక్, చిరాగ్ శెట్టి జంట కూడా ప్రవేశించింది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో లక్ష్యసేన్.. దూకుడైన ఆటతో చౌ థియెన్ చెన్‌ను చిత్తుగా ఓడించాడు. ఆరో సీడ్ అయిన తైవాన్ ప్లేయర్‌కు ముచ్చెమటలు పట్టిస్తూ రెండు సెట్లలో జయభేరి మోగించాడు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో లక్ష్యసేన్.. దీంతో లక్ష్యసేన్ మరో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. నాలుగో ర్యాంకర్ లీ షిఫెంగ్(చైనా)తో ఫైనల్లో భారత స్టార్ తలపడనున్నాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం.. స్టార్లంతా నిరాశపరిచిన చోట లక్ష్య సేన్ పురుషుల సింగిల్స్ టైటిల్ పోరుకు దూసుకెళ్లాడు. సేన్, చౌ థియెన్ మధ్య సెమీఫైనల్ ఫైట్ నువ్వానేనా అన్నట్టు సాగింది. తొలి సెట్‌ను సేన్ 32-21తో గెలుపొంది చౌ థియెన్‌కు షాకిచ్చాడు. అయితే.. రెండో సెట్ హోరాహోరీగా జరిగింది. మూడు పాయింట్లు (17-20) వెనకబడిన సేన్ అనూహ్యంగా పుంజుకొని ప్రత్యర్థికి షాకిచ్చాడు. వరుసగా పాయింట్లు సాధించి ఆరో సీడ్ ఆటకట్టించాడు. రెండేళ్ల తర్వాత అతడు ఆడుతున్న తొలి సూపర్ 500 ఫైనల్ ఇది. నాలుగో ర్యాంకర్ లీ షిఫెంగ్ (చైనా)తో ఫైనల్లో భారత స్టార్ తలపడనున్నాడు. 2023లో చివరిసారిగా కెనడా 500 ఓపెన్ ఫైనల్ ఆడిన సేన్.. ఇప్పుడు మళ్లీ టైటిల్ ఫైట్‌లో అమీతుమీకి సిద్ధమవుతున్నాడు.

డేవిస్‌కప్‌లో భారత్ సంచలనం

- 32ఏళ్ల తర్వాత యూరోపియన్ జట్టుపై గెలుపు

బీల్(స్విట్జర్లాండ్): డేవిస్ కప్‌లో భారత్ సంచలనం సృష్టించింది. డేవిస్ కప్ టోర్నీలో విదేశీ పర్యటనల్లో భాగంగా 32ఏళ్ల తర్వాత ఒక యూరోపియన్ జట్టును ఓడించింది. శనివారం జరిగిన డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1లో స్విట్జర్లాండ్‌ను ఓడించి వచ్చే ఏడాది డేవిస్‌కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. టెన్నిస్ విభాగంలో భారతజట్టు విదేశీ పర్యటనల్లో సాధించిన అతి పెద్ద విజయాల్లో ఇది ఒకటి. అంతకుముందు 1993లో ఫ్రాన్స్‌పై భారత్ తొలిసారి విజయాన్ని నమోదు చేసుకుంది. నిర్ణయాత్మక నాల్గో సింగిల్స్‌లో సుమిత్ నాగల్ 6-1, 6-3తో 18ఏళ్ల హెన్రీ బెర్నెట్‌పై విజయం సాధించాడు. అంతకుముందు తొలి సింగిల్స్‌లోనూ సుమిత్ స్విట్జర్లాండ్ నంబర్ వన్ ఆటగాడు జెరోమ్ కిమ్‌ను ఓడించి భారత్‌కు 2-0 ఆధిక్యతలో నిలిపాడు. పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ-రిత్విక్ బొల్లిపల్లి జంట 6-7(3-7), 6-4, 7-5తో స్విస్‌కు చెందిన జాకబ్ పాల్-బోమినిక్ స్ట్రిక్చర్‌లను చిత్తుచేశారు. ఈ గెలుపుతో డేవిస్‌కప్‌లో 37వ ర్యాంక్‌లో ఉన్న భారతజట్టు 9వ సీడ్ స్విట్జర్లాండ్‌ను ఓడించినట్లయ్యింది. అలాగే భారత టెన్నిస్ జట్టు 2026 వరల్డ్ గ్రూప్‌కు క్వాలిఫై కాగా.. స్విట్జర్లాండ్ జట్టు వరల్డ్ గ్రూప్-1 ప్లే-ఆఫ్ మ్యాచ్‌లను ఆడాల్సి ఉంది.

120 బంతుల్లో 304 పరుగులు

టి20ల్లో ఇంగ్లండ్ రికార్డు దక్షిణాఫ్రికాపై 146 పరుగుల తేడాతో విజయం

మాంచెస్టర్: టి20ల్లో ఇంగ్లండ్ జట్టు 120బంతుల్లో 304 పరుగులు చేసి రికార్డు పుటల్లోకెక్కింది. దక్షిణాఫ్రికాతో శుక్రవారం జరిగిన రెండో టి20లో ఇంగ్లండ్ జట్టు ఈ ఫీట్ సాధించింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (141నాటౌట్, 60 బంతుల్లో 15ఫోర్లు, 8సిక్సర్లు), జోస్ బట్లర్ (83; 30బంతుల్లో 8ఫోర్లు, 7సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. దీంతో ఇంగ్లండ్ జట్టు 20ఓవర్లలో 2 వికెట్లకు 304 పరుగుల భారీ స్కోరు సాధించింది. సాల్ట్, బట్లర్ తొలి వికెట్‌కు 47బంతుల్లోనే 126 పరుగులు జోడించారు. తర్వాత సాల్ట్.. బెతెల్ (26), బ్రూక్ (41)ల అండతో జట్టు స్కోరును 300 దాటించాడు. సాల్ట్ 39 బంతుల్లోనే శతకాన్నందుకున్నాడు. టి20ల్లో ఇది మూడో అత్యధిక స్కోరు. గత ఏడాది జింబాబ్వే.. గాంబియాపై 344/4తో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. నేపాల్ (314/3, మంగోలియాపై 2023లో) రెండో స్థానంలో ఉంది. భారీ లక్ష్య ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికాను ఇంగ్లండ్ బౌలర్లు 158 పరుగులకే ఆలౌట్ చేశారు. దీంతో 146 పరుగుల భారీ తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో భారీ మార్జిన్‌తో గెలిచిన జట్టుగా ఇంగ్లాండ్ రికార్డు నెలకొల్పింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సాల్ట్‌కు దక్కింది. దీంతో మూడు టి20ల సిరీస్ 1-1తో సమం కాగా.. మూడో, చివరి టి20 ఆదివారం జరగనుంది.

శింబుకు జోడీగా సాయిపల్లవి

కోలీవుడ్‌లో నటుడు శింబుది ప్రత్యేక స్థానం. విమర్శలు, వివాదాల్లో చిక్కుకున్నా, అపజయాలను ఎదుర్కొన్నా, అతడి తీరు వేరు. 50 చిత్రాలకు చేరుకున్న ఈయన తాజాగా కొన్నింటిని చేస్తున్నారు. అందులో ఒకటి వెట్రిమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం. ఇది ఉత్తర చెన్నై నేపథ్యంలో తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ కథా చిత్రం. వెట్రిమారన్ కథలన్నీ సమాజంలోంచి, ముఖ్యంగా అట్టడుగు జనాల జీవితాలను ఆవిష్కరించేవిగా ఉంటాయి. ఇంతకుముందు ధనుష్ కథానాయకుడిగా ఉత్తర చెన్నై నేపథ్యంలో వడచెన్నై అనే చిత్రాన్ని తెరకెక్కించి మంచి విజయాన్ని అందుకున్నారు. మరో కోణంలో శింబు కథానాయకుడిగా చిత్రం చేస్తున్నారు. ఆయన నటిస్తున్న 49 సినిమా ఇదే. జంటగా పూజాహెగ్డే నటించనున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా ఆ పాత్రలో సాయిపల్లవిని ఎంపిక చేశారనేది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈమె ప్రస్తుతం హిందీలో ఏక్ దిన్ చిత్రాన్ని పూర్తి చేసి, రామాయణ 1, 2 చిత్రాలను చేస్తున్నారు. ఇందులో సాయిపల్లవి సీతగా నటిస్తున్నారు. చాలా గ్యాప్ తర్వాత ఆమె మళ్లీ తమిళంలో నటించనున్నారు.

సినిమా టైటిల్ మారింది!

అమిర్‌ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్, సాయి పల్లవి జంటగా ఒక సినిమా రూపొందుతోంది. దీనికి మొదట నిర్ణయించిన 'ఏక్ దిన్' టైటిల్‌ను తాజాగా 'మెరే రహో' అని మార్చినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాను అమిర్‌ఖాన్‌తో పాటు బాలీవుడ్ అగ్ర నిర్మాత మన్సూర్ ఖాన్ నిర్మిస్తున్నారు.

నవంబర్ 8న ఇళయరాజా సంగీత విభావరి

తెలుగు సినీ సంగీత విద్వాంసుడు ఇళయరాజా సంగీత విభావరి నవంబర్ 8వ తేదీన విజయవాడ మహాత్మా గాంధీరోడ్డు (బందరురోడ్డు)లోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనుంది. ట్రెండ్ సెట్టర్స్‌గా పేర్గాంచిన లైవ్ సుధాకర్ ఈ లైవ్ కన్సర్ట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సంగీత కచేరికి సంబంధించిన పోస్టర్ ఇప్పని ఇళయరాజాతో పాటు, రాష్ట్ర పరిశ్రమలశాఖామంత్రి టిజి భరత్ ఇటీవల విడుదల చేశారు. ఈ ఈవెంట్‌కు సంబంధించిన టికెట్లను ఇప్పటికే బుక్ మై షో లో పొందుపర్చగా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం గట్టి భద్రత, సకల సౌకర్యాలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. 40 మంది సభ్యుల బృందంతో ఇళయరాజా ఈ లైవ్ కన్సర్ట్‌కు హాజరవుతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇలాంటి

పైచేయి ఎవరిదో..?

నేడు భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య కీలక పోరు
రాత్రి 8.00గం॥ల నుంచి
ఆసియా కప్ క్రికెట్ టోర్నీ

దుబాయ్: క్రీడాభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. ఆసియాకప్ క్రికెట్ టోర్నీలోనే హై ఓల్టేజ్ క్రికెట్ మ్యాచ్ ఇది. సూపర్-4లో చేరుకోవాలంటే ఇరుజట్లకు గెలుపు తప్పనిసరి. గ్రూప్-ఎలో భాగంగా తొలి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు ఆతిథ్య యుఎఇపై, పాకిస్తాన్ జట్టు ఒమన్‌పై ఘన విజయం సాధించాయి. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య ఆదివారం ఉత్కంఠ పోరు జరగనుంది. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పిన్నర్లపైనే భారం మోపాడు. రెగ్యులర్ పేసర్ బుమ్రా మినహా.. మరో పేసర్‌ను టి20ల్లో ఎంపిక చేసే అవకాశం లేదు. దీంతో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్‌లపైనే ఆశలు ఉన్నాయి. వరుణ్ చక్రవర్తి గత ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్ పేస్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా ఉండనే ఉన్నారు. 'చైనామన్' బౌలర్ కుల్‌దీప్ యాదవ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ఆరు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడే అవకాశం రావడంతో తొలి మ్యాచ్‌లో యుఎఇపై అదరగొట్టాడు. ఆసియా కప్ తొలి మ్యాచ్‌లోనే యూఏఈపై నాలుగు వికెట్ల ప్రదర్శన చేశాడు. వైవిధ్యమైన అతడి బౌలింగ్ ముందు పసికూన నిలవలేకపోయింది. అయితే, చాన్నాళ్లు బెంచ్‌కే పరిమితమైనా తనలోని సత్తా తగ్గలేదని నిరూపించాడు. స్టంప్స్ లక్ష్యంగా అతడి బౌలింగ్‌ను తట్టుకోవడం పాక్ యువ బ్యాటింగ్ విభాగానికి కష్టమే. తన 'స్పిన్' ఎటాక్‌తో విరుచుకుపడతాడని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జస్‌ప్రీత్ బుమ్రాను పాక్ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారో చూడాలి. టీమిండియాపై చెలరేగిపోయే షహీన్ అఫ్రిదిపై మన బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శిస్తే మనకు కష్టమే. బ్యాటింగ్‌లో అభిషేక్-గిల్ జోడీ.. బౌలింగ్‌లో కుల్దీప్-వరుణ్ చక్రవర్తి జోడీ ప్రధాన ఆకర్షణ అనడంలో సందేహం లేదు.

మరోవైపు పాకిస్తాన్ జట్టుకు మహ్మద్ నవాజ్ రూపంలో అత్యంత ప్రమాదకర స్పిన్నర్ ఉన్నాడు. అతడికి తోడుగా అబ్రార్ అహ్మద్ కూడా కీలకమే. ఇక సుఫియాన్ ముకీమ్, సయామ్ అయుబ్ కూడా పార్ట్ స్పిన్‌తో వికెట్లు తీసే బౌలర్లు. అయితే, భారత బ్యాటర్లు వీరిని ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. సీనియర్లు రోహిత్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ వంటి ఆటగాళ్లు లేకుండా తొలిసారి మినీ టోర్నీలో టీమ్‌ఇండియా ఆడుతోంది. స్పిన్‌ను కాచుకొని క్రీజ్‌లో నిలదొక్కుకుంటే దుబాయ్‌లో పరుగులు చేయడం పెద్ద కష్టమేం కాదు.

జట్లు(అంచనా)..

ఇండియా: **సూర్యకుమార్(కెప్టెన్), శుభ్‌మన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, దూబే, హార్దిక్, సంజు(వికెట్ కీపర్), అక్షర్, కుల్దీప్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి.**

పాకిస్తాన్: **అఘా సల్మాన్(కెప్టెన్), హ్యారిస్(వికెట్ కీపర్), ఆయుబ్, ఫర్హాన్, నవాజ్, ఫహీమ్ అష్రాఫ్, షాహిన్ షా అఫ్రిది, రవూఫ్, అబ్రార్ అహ్మద్, హసన్ అలీ, షొరిఫుల్ ముఖీమ్.**

సోషల్ మీడియాకు బానిస కాదల్చుకోలేదు

సోషల్ మీడియాకు పూర్తిగా దూరమవుతున్నట్లు తమిళ నటి ఐశ్వర్య లక్ష్మి తాజాగా ప్రకటించారు. 'ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే సోషల్ మీడియా తప్పనిసరి అని మొదట్లో అనుకున్నాను. కానీ, కాలంతో పాటు మనమూ అప్‌డేట్ అవ్వాలన్న ఆలోచన నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నేను సోషల్ మీడియాకు బానిసగా మారిపోయాను. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను.' అని ఆమె ఇన్‌స్టాలో ఒక పోస్ట్ పెట్టారు. 'సోషల్ మీడియా నా ఆలోచనలను దారి మళ్లించింది. నాలోని క్రియేటివిటీ పోయింది. నాలో నెగిటివిటీని పెంచడమే కాకుండా ఒక సర్కిల్‌లో లాక్ అయ్యేలా చేసింది. నాకు నేను ఏదో ఒక సూపర్ నెట్‌గా మారిపోవడం నాకు ఇష్టం లేదు. ఒక మహిళగా, నేను చాలా కష్టపడి నన్ను నేను మెరుగుపరుచుకున్నాను, కానీ సోషల్ మీడియాకి లొంగిపోవడానికి నేను ఇష్టపడలేదు. ప్రపంచం నన్ను మర్చిపోతుందనే వాస్తవానికి నేను సిద్ధంగా ఉన్నాను. నాలోని కళాకారిణిని, నాలో ఉన్న చిన్న పాపని కాపాడుకోవడానికి నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. నేను ఇంటర్నెట్ నుండి పూర్తిగా అదృశ్యమవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. భవిష్యత్తులో మరింత అర్థవంతమైన బంధాలను, మంచి సినిమాలు చేయాలని ఆశిస్తున్నాను. నేను నిజంగా మంచి సినిమా చేస్తే, మీరు పాత తరహాలోనే ప్రేమను పంచుతారని ఆశిస్తున్నా'నంటూ ఐశ్వర్య సుదీర్ఘ పోస్టు రాశారు. ఈ వారంలోనే మొన్న శుక్రవారం అనుష్క శెట్టి కూడా 'సోషల్ మీడియాని దూరం పెడుతున్నా' అని ప్రకటించిన విషయం తెలిసిందే.

నటీనటులు కావలెను!

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తమ కొత్త సినిమా కోసం నూతన నటీనటుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రకటించింది. తమ బ్యానర్‌లో నిర్మించబోతున్న ప్రొడక్షన్ నెం.37లో నటించేందుకు 18 - 24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతీయువకులతో పాటు 20 - 50 ఏళ్ల మధ్య ఉన్న వయస్సు వారిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపింది. ఆసక్తి ఉన్నవారు తమ ప్రొఫైల్స్, ఫొటోలు, నటనకు సంబంధించిన వీడియోలను ఈమెయిల్ : sitharaentscasting@gmail.com లేదా వాట్సాప్ నెంబర్ (88019 90954)కు పంపవచ్చని వెల్లడించింది.

ఫైనల్‌కు భారత మహిళల జట్టు

చివరి మ్యాచ్‌లో జపాన్‌తో డ్రా
నేడు చైనాతో ఢీ

హాంగ్జౌ(చైనా): ఆసియాకప్ మహిళల హాకీ ఫైనల్లోకి భారత జట్టు దూసుకెళ్లింది. సూపర్-4లో భాగంగా శనివారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారతజట్టు జపాన్‌తో డ్రాగా ముగించింది. మ్యాచ్ ప్రారంభమైన 7వ ని.లోనే బ్యూటీ గోల్ కొట్టి భారత్‌ను 1-0 ఆధిక్యతలో నిలిపింది. ఆ తర్వాత రెండు, మూడు క్వార్టర్‌లలో ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. నాల్గో క్వార్టర్ చివరి వరకు ఏ జట్టూ గోల్ చేయలేదు. మరో రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా.. జపాన్ తరపున కొబయకవల(58వ ని.) గోల్ చేశాడు. దీంతో 1-1గోల్స్‌తో సమమైంది. ఆదివారం జరిగే ఫైనల్లో భారత మహిళలజట్టు పటిష్ట చైనాతో తలపడనుంది. లీగ్ దశలో చైనా చేతిలో భారతజట్టు 1-4గోల్స్ తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. దీంతో సూపర్-4లో జపాన్‌లతో మ్యాచ్‌లను డ్రా చేసుకున్న భారత్.. కొరియాపై గెలిచి ఆతిథ్య చైనా చేతిలో ఓటమిపాలైనప్పటికీ 4పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇక చివరి మ్యాచ్‌లో చైనా 1-0తో ద.కొరియాను చిత్తుచేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఇక 5నుంచి 8స్థానాలకు లీగ్ మ్యాచ్‌లు కూడా ముగిసాయి. 5, 6 స్థానాలకు మలేషియా, సింగపూర్.. 7, 8 స్థానాలకు థాయ్‌లాండ్, చైనీస్ తైపీ జట్లు తలపడనున్నాయి.

సూపర్-4 పాయింట్ల పట్టిక

వ.స.	జట్టు	ఆ	గె	ఓ	డ్రా	చే.గో.	ఇ.గో.	గో.అం.	పా
1	చైనా	3	3	0	0	7	1	+6	9
2	భారత్	3	1	1	1	6	7	-1	4
3	జపాన్	3	0	2	1	2	4	-2	2
4	ద.కొరియా	3	0	1	2	3	6	-3	1

10మీ. ఎయిర్ పిస్టల్‌లో ఈషా సింగ్‌కు స్వర్ణం

- ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ షూటింగ్

నింగ్‌బో(చైనా): భారత షూటర్ ఇషా సింగ్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. ఇక్కడ జరుగుతున్న ఐఎస్-ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్‌లో స్వర్ణ పతకంతో సత్తా చాటింది. శనివారం జరిగిన 10మీ. ఎయిర్ పిస్టల్ విభాగంలో ఇషా సింగ్ 242.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని ముద్దాడింది. నింగ్బో ఒలింపిక్ స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన ఈవెంట్‌లో.. చైనాకు చెందిన ఫేవరేట్ యావో క్వియాన్‌జున్‌ను మట్టికరిపించింది. ఫైనల్ ఉత్కంఠభరితంగా జరిగింది. దక్షిణ కొరియాకు చెందిన క్రీడాకారిణి ఓహ్ యెజిన్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. గోల్డ్ మెడల్ సాధించడం సంతోషంగా ఉన్నట్లు ఇషా సింగ్ పేర్కొంది.

అవయవదానానికి ముందుకొచ్చిన సిపిఎం శ్రేణులు

● 1600 మంది అంగీకార పత్రాలు అందజేత

చెన్నై : సిపిఎం ఆధ్వర్యాన 1600 మంది మరణానంతరం తమ అవయవాలను, శరీరాన్ని వైద్య పరిశోధనల కోసం అందజేసేందుకు ముందుకొచ్చారు. సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా తమిళనాడు అంతటా అవయవదానం, శరీర దానంపై సిపిఎం ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 1600 మంది ఇందుకోసం అంగీకరిస్తూ... అంగీకార పత్రాలను అందజేశారు.

సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం ప్రారంభం

ఢిల్లీ : మూడు రోజుల పాటు జరిగే సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం శనివారం న్యూఢిల్లీలో ప్రారంభమైంది. పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ, త్వరలో జరిగే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు వంటి అంశాలతో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ నివేదికను ప్రవేశపెట్టారు.

ఇపిఎస్-95 పెన్షన్‌ను రూ.9వేలకు పెంచాలి

● కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

● పెన్షనర్ల రాష్ట్ర సదస్సు డిమాండ్

సదస్సులో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇపిఎస్-95 కింద ఇచ్చే కనీస పెన్షన్‌ను కేంద్ర ప్రభుత్వం 9 వేల రూపాయలకు పెంచాలని, డిఎతో కలిపి చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఆర్‌పిఎ) రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. విజయవాడ బందరు రోడ్డులోని ఎంబివికెలో శనివారం ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఎ అబ్బాస్ అధ్యక్షతన ఈ సదస్సులో పలు తీర్మానాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం కనీస పెన్షన్ పెంచాలని ఒక తీర్మానంలో డిమాండ్ చేయగా, మరో తీర్మానంలో కేరళ, పాండిచ్చేరి ప్రభుత్వాల తరహాలో రూ.వెయ్యి పెన్షన్ తీసుకుంటున్న ఇపిఎస్ - 95 పెన్షన్‌దారులందరికీ కనీస పెన్షన్‌గా రాష్ట్రప్రభుత్వం సామాజిక పెన్షన్ రూ.4 వేలు చెల్లించాలని కోరారు. సిపిఎస్, యుపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని, ఆరోగ్యశ్రీ పథకాన్ని అన్ని రకాల వ్యాధులకు, అన్ని ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సదస్సు తీర్మానించింది. పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే విడుదల చేయాలని, 12వ పిఆర్‌సి కమిషనరును నియమించాలని, ఈలోగా మధ్యంతర భృతి చెల్లించాలని, 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.20 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సదస్సు తీర్మానించింది. సీనియర్ సిటిజన్లకు రైలు ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలని, ఇపిఎస్-95 పెన్షనర్లకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కాంట్రాక్టు లెక్చరర్లకు సామాజిక పెన్షన్లు, దహన ఖర్చులు, వైద్య సదుపాయం కల్పించాలని సదస్సు తీర్మానించింది.

ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఇపిఎఫ్ పెన్షనర్ల సంఘం జనరల్ సెక్రటరీ డి మోహనన్ మాట్లాడుతూ.. పెన్షనర్ పెట్టుబడిని వారి మరణం తర్వాత వారి కుటుంబానికి ఇవ్వాలని, పెన్షనర్ మరణించిన సందర్భంలో అంత్యక్రియలకు ప్రభుత్వం రూ.25 వేలు అందించాలని, 2013 భగత్‌సింగ్ కోష్యారీ కమిటీ చేసిన మూడు సిఫార్సులను తక్షణం ఉపశమనంగా అమలుచేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1952 నాటి అసలు ఇపిఎఫ్ చట్టం ప్రకారం ఉద్యోగి, యజమాని ఇద్దరూ ప్రతినెలా కార్మికుని జీతంలో 12 శాతం మొత్తాన్ని ప్రావిడెంట్ ఫండ్‌కు జమ చేయాల్సి ఉండగా, ప్రైవేటు రంగంలోని పెద్ద వ్యాపారవేత్తలను రక్షించడానికి యజమాని సహకారంపై పరిమితి విధించిందన్నారు. ఇటీవల రాజ్యసభలో ఎంపి జాన్‌బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మికశాఖ మంత్రి ఇచ్చిన సమాధానంలో నేడు దేశంలో 81,48,490 మంది పిఎఫ్ పెన్షనర్లు ఉన్నారని, వారిలో 80,94,949 (99.34 శాతం) మందికి రూ.6 వేల కంటే తక్కువ పెన్షన్ చెల్లిస్తున్నట్లు వెల్లడించారని, 78,69,560 (96.58 శాతం) మందికి రూ.4 వేల కంటే తక్కువ పెన్షన్ ఉందని తెలిపారని అన్నారు. దేశ వ్యాప్తంగా 23 లక్షల మందికి నెలకు వెయ్యి కూడా రావడం లేదన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ.. ఇపిఎఫ్-95 పెన్షన్‌దారుల సమస్యలను ఈ నెల 18 నుంచి జరగనున్న శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి పెన్షన్ సంఘాలు ఉమ్మడి వేదిక మీదకు రావడం, ఉమ్మడి కార్యాచరణతో ఐక్యపోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పెన్షన్ సంఘాలు చేసే ఐక్య పోరాటాలకు తమ మద్దతు ఉంటుందన్నారు.

ఈ సదస్సులో ఎపిఆర్‌పిఎ గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీలు కె సుధాకర్‌రావు, కె సత్తిరాజు, తెలంగాణ, ఎపి అసోసియేషన్ నాయకులు ఎం జనార్ధన్‌రెడ్డి, బ్యాంక్ అసోసియేషన్ నాయకులు ఎన్ రామారావు, యుటిఎఫ్ సెక్రటరీ ఎస్‌పి మనోహర్, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి శ్రీనివాసరావు, ఎపి పిఆర్‌ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ నాగేశ్వరరావుతోపాటు పలు అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఐఆర్‌పై మాదే తుదినిర్ణయం

● సుప్రీంకోర్టుకు తెలిపిన ఇసి

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)ను ఎప్పుడు, ఎలా నిర్వహించాలో పూర్తిగా తమ అధికార పరిధిలోనే ఉంటుందని సుప్రీంకోర్టుకు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎస్‌ఐఆర్ ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించాలా లేదా కుదించి నిర్వహించాలా అనే నిర్ణయం 'పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది' అని తెలిపింది. ఎస్‌ఐఆర్ ప్రక్రియను తమ 'ప్రత్యేక అధికార పరిధి'కి వదిలివేయాలని సుప్రీంకోర్టును కోరింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, ఎన్నికల నియమాల నమోదు 1960 చట్టాలు ఎస్‌ఐఆర్ సమయంపై పూర్తి విచక్షణను ఎన్నికల సంఘానికి కట్టబెట్టాయని తెలిపింది. దేశ ఓటర్ల జాబితాలో నమోదైన విదేశీ చొరబాటుదారులను గుర్తించి, బహిష్కరించడానికి దేశవ్యాప్తంగా 'క్రమం తప్పకుండా' ఎస్‌ఐఆర్‌ను నిర్వహించాలని ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ విచారణలో ఇసి పైవిధంగా స్పందించింది. దేశవ్యాప్తంగా క్రమం తప్పకుండా ఎస్‌ఐఆర్‌ను నిర్వహించాలనే ఆదేశం ఈసి ప్రత్యేక అధికార పరిధిని అతిక్రమిస్తుందని తెలిపింది. బీహార్‌లో ఎస్‌ఐఆర్ ప్రక్రియపై వివాదం కొనసాగుతున్న సమయంలో ఈ పిటిషన్ విచారణ జరగడం విశేషం. 2026 జనవరి 1 అర్హత తేదీగా దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్ ఉంటుందని ఎలక్షన్ కమిషన్ నిర్ధారించింది. 2026 జనవరి 1ను దేశవ్యాప్తంగా అర్హత తేదీగా సూచిస్తూ ఓటర్ల జాబితాల ఎస్‌ఐఆర్ కోసం తక్షణ ముందస్తు కార్యకలాపాలను ప్రారంభించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు జూలై 5 న ఒక లేఖ రాసినట్లు ఇసి కోర్టుకు తెలిపింది. దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్‌ను నిర్వహించడానికి ఈ నెల 10న న్యూఢిల్లీలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సిఇఓలతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఇసి తెలిపింది.

సింగరేణి ఉపరితల గనుల్లో మహిళా ఆపరేటర్లు

● ఎంపిక కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి సంస్థలో ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్‌గా లేదా బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న మహిళలకు సింగరేణి యాజమాన్యం ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పని చేయడానికి దరఖాస్తుల్ని అహ్వానిస్తోంది. మైనింగ్ రంగంలో మహిళల సాధికారత, సమాన అవకాశాలు, మానవ వనరుల సమర్థ వినియోగంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ పేర్కొంది. ఈ మేరకు శనివారం సింగరేణి యాజమాన్యం అన్ని గనులకు, శాఖలకు సర్క్యులర్ విడుదల చేసింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో మహిళలకు భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేసే అవకాశం ఇవ్వడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి. ఎంపికైన అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఇపి ఆపరేటర్ ట్రెయినీ కేటగిరి-5 డిసిగ్నేషన్‌తో సంబంధిత ఏరియాలకు పంపించడం జరుగుతుందని పేర్కొంది.

పోక్సో కేసులో దోషికి మరణశిక్ష

మంగుళూరు : పోక్సో కేసులో దోషికి కర్ణాటకలోని మంగుళూరు కోర్టు మరణశిక్ష విధించింది. 13 ఏళ్ల బాలికను హత్యాచారం చేసిన 51 ఏళ్ల వ్యక్తికి మరణ శిక్ష విధిస్తూ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కేఎస్ మన్నూ శుక్రవారం తీర్పు చెప్పారు. నిందితుడు ఫకీరప్ప హనుమప్ప మదరపై పలు కేసులు ఉన్నాయి. బెల్గావి జిల్లాలోని సావదత్తి తాలూకాలోని హంచినాల్ గ్రామం అతని స్వస్థలం. 2024, ఆగస్టు 6న ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై ఎవరూ లేని సమయంలో నిందితుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆపై హత్యచేశాడు. ఈ ఘటన పన్నంబుర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 103(1) కింద నిందితుడికి మరణశిక్షతోపాటు బిఎన్‌ఎస్‌లోని 332(ఎ) సెక్షన్ కింద జీవితకాల శిక్షను వేశారు. పోక్సో చట్టం కింద రూ.50వేల జరిమానా విధించారు.

విశాఖలో స్విగ్గీ, జొమాటో రైడర్ల సమ్మె

(మొదటిపేజి తరువాయి)

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని రైడర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు హోటళ్ల యాజమాన్యాలు సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కెఎం.కుమార్ మంగళం, నాయకులు శ్రీనివాస్, అచ్యుత్, లక్ష్మణ్, పెద్ద సంఖ్యలో రైడర్లు పాల్గొన్నారు. ఎక్కడెక్కడో ఉండే రైడర్లు (గిగ్ వర్కర్లు) అంతా ఐక్యమై సమ్మెకు దిగడం చర్చనీయాంశమైంది. వారి పోరాటానికి పలువురు మద్దతు తెలిపారు.

ఇజ్రాయిల్ చర్యలతో మానవతా విధ్వంసం

● ఐరాస తీర్మానానికి 142 దేశాలు అనుకూలం

న్యూయార్క్ : ఇజ్రాయిల్ చర్యలతో మానవతా విధ్వంసం చోటుచేసుకుందని న్యూయార్క్ డిక్లరేషన్ విమర్శించింది. న్యూయార్క్‌లో శుక్రవారం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశం జరిగింది. 'పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం కోసం, అలాగే రెండు దేశాల విధానం అమలు కోసం న్యూయార్క్ డిక్లరేషన్‌ను ఆమోదించడం' అనే పేరుతో ఫ్రాన్స్ ప్రవేశపెట్టిన తీర్మానానికి భారత్ సహా 142 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. అమెరికా, ఇజ్రాయిల్‌సహా 10 దేశాలు వ్యతిరేకించాయి. 12 దేశాలు గైర్హాజరయ్యాయి. ఈ తీర్మానాన్ని గల్ఫ్ అరబ్ దేశాలన్నీ సమర్థించాయి. ఇజ్రాయిల్, అమెరికా, అర్జెంటీనా, హంగరీ, మైక్రోనేసియా, నారూ, పాలవ్, పపువా న్యూ గునియా, పరాగ్వే, టాంగా వ్యతిరేకించాయి. ఈ డిక్లరేషన్‌ను జులైలో ఐరాస కేంద్ర కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పంపిణీ చేశారు. ఈ సమావేశానికి ఫ్రాన్స్, సౌదీ అరేబియాలు సహ అధ్యక్షత వహించాయి. దశాబ్దాల తరబడి కొనసాగుతున్న ఘర్షణను నివారించడానికి చర్చలు తిరిగి ప్రారంభించాలన్న ఉద్దేశంతో ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు.

డిక్లరేషన్‌లో ఏముంది?

గాజాలో యుద్ధాన్ని నివారించాలని, రెండు దేశాల విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసే ప్రాతిపదికపై ఇజ్రాయిల్ - పాలస్తీనా ఘర్షణలకు న్యాయబద్ధమైన, శాంతియుతమైన, దీర్ఘకాల పరిష్కారాన్ని కనుగొనాలని, పాలస్తీనియన్లు, ఇజ్రాయిలీలతోపాటు ఆ ప్రాంతంలోని ప్రజలందరికీ మెరుగైన భవిష్యత్తు నిర్మించాలని, అందుకోసం ఉమ్మడిగా చర్యలు చేపట్టాలని ఏడు పేజీల డిక్లరేషన్‌లో నేతలు అంగీకారానికి వచ్చారు. గత అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై హమాస్ జరిపిన దాడిని డిక్లరేషన్ ఖండించింది.

ఈ దాడికి ప్రతిగా గాజాలో ఇజ్రాయిల్ చేపట్టిన దాడులను కూడా విమర్శించింది. ఈ దాడుల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగిందని, పౌర మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయని, 'సైనిక చర్య, ఆకలి కేకల' కారణంగా మానవతా విధ్వంసం జరిగిందని తెలిపింది. సార్వభౌమత్వ పాలస్తీనా దేశం సహా రెండు దేశాల పరిష్కారానికి స్పష్టమైన బహిరంగ హామీ ఇవ్వాలని ఇజ్రాయిల్‌ను డిక్లరేషన్ కోరింది.

హింసకు వెంటనే స్వస్తి చెప్పాలని, పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే చర్యలు నిలిపివేయాలని, అన్ని సెటిల్మెంట్లను ఆపేయాలని, తూర్పు జెరూసలేం సహా ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో భూ ఆక్రమణలను, అనుబంధ కార్యకలాపాలను ఆపాలని, సెటిలర్ల హింసకు కళ్లెం వేయాలని ఇజ్రాయిల్‌ను డిక్లరేషన్ కోరింది. పాలస్తీనా ప్రజల హక్కులకు మద్దతు తెలిపింది. రెండు దేశాల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోని పక్షంలో ఘర్షణ తీవ్రతరమవుతుందని, ప్రాంతీయ శాంతికి భంగం వాటిల్లుతుందని హెచ్చరించింది. పాలస్తీనాలో గాజా అంతర్భాగమని, దానిని వెస్ట్‌బ్యాంక్‌తో కలపాలని స్పష్టం చేసింది.

ఇజ్రాయిల్, అమెరికా వ్యతిరేకత

న్యూయార్క్ డిక్లరేషన్‌ను ఇజ్రాయిల్, అమెరికా వ్యతిరేకించాయి. ఐరాస జనరల్ అసెంబ్లీ ఒక రాజకీయ సర్కస్‌లా మారిందని, వాస్తవం నుంచి దూరం జరిగిందని, హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రస్తావించలేదని ఇజ్రాయిల్ ఆరోపించింది. ఈ తీర్మానం హమాస్‌కు ఒక బహుమతి వంటిదని అమెరికా దౌత్యవేత్త మార్గాన్ ఆర్టాగస్ వ్యాఖ్యానించారు.

ఆందోళనకరంగానే అతిసార

(మొదటిపేజి తరువాయి)

రాత్రికి మరో పది కేసులు అదనంగా పెరిగాయి. శుక్రవారం రాత్రితో పోలిస్తే అదనంగా 79 కేసులు నమోదయ్యాయి. అయితే, అనధికారికంగా 500 మందికిపైగా బాధితులు ఆస్పత్రుల పాలయ్యారని, ముగ్గురు మృతి చెందారని సమాచారం. శుక్రవారం జి.నరసింహారావు (37), ఈ నెల 9న శ్రీరామ నాగమణి (61), అదే రోజున గొర్రెముచ్చ కమల (67) ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెబుతున్నారు. అయితే, ఈ మరణాలను ప్రభుత్వం ధ్రువీకరించడం లేదు. మరోవైపు గత కొద్ది రోజుల నుండి అతిసార విజృంభిస్తోన్నా ఇప్పటివరకు అధికారులు వ్యాధి ప్రబలడానికి కారణాలను గుర్తించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి నమూనాలు పరీక్షలకు పంపామని మంత్రులు, అధికారులు చెబుతున్నా ఫలితాలను మాత్రం వెల్లడించడం లేదు. ఇప్పటికీ కారణాలను నిర్ధారించకపోవడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పరీక్షల పేరుతో కాలయాపన చేస్తున్నారని, వాస్తవాలు వెల్లడించడం లేదని, రోగుల సంఖ్య తగ్గించి చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో చికిత్స అందించకుండా వెంటవెంటనే డిశ్చార్జి చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

ఈ నెల 22వ తేదీ నుండి విజయవాడలో కనక దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలతోపాటు విజయవాడ ఉత్సవ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారం యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి చర్యలు చేపడుతోంది. ఈ ఉత్సవాలపై అతిసార ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన నెలకొనడంతో అధికారులు ఆ ప్రాంతంలో పారిశుధ్యం మెరుగుదలపై మరింతగా దృష్టి సారించారు. ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నారు. కేసుల గుర్తింపునకు చర్యలు తీసుకుంటున్నారు. ముందు జాగ్రత్త చర్యగా ఆహార దుకాణాలను మూసివేశారు. పారిశుధ్య చర్యలను, బాధితుల గుర్తింపును వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక బృందాలు సమన్వయం చేసుకుంటున్నాయి. ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాయి.

మంత్రి నారాయణ పర్యటన

అతిసార ప్రబలిన న్యూ ఆర్ఆర్‌పేటలో శనివారం కూడా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ పర్యటించారు. ప్రత్యేక వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. న్యూ ఆర్ఆర్‌పేటలోని ప్రత్యేక వైద్య శిబిరంలోనూ, విజయవాడ ప్రభుత్వాస్పత్రిలోనూ చికిత్స పొందుతున్న బాధితులను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పరామర్శించారు. వారికి అందిస్తోన్న వైద్య సేవలను పరిశీలించారు. ఆర్ఆర్‌పేటలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు.

బాధితులను ఆదుకోవాలని మంత్రికి సిపిఎం నేతల వినతి

అతిసార బాధితులకు సిపిఎం నేతలు పలు రూపాల్లో సేవలందించారు. న్యూ ఆర్ఆర్‌పేటలో ప్రతి వీధికీ, ప్రతి ఇంటికీ వెళ్లి ఆరా తీశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, కార్యదర్శివర్గ సభ్యులు కె దుర్గారావు తదితరులు ఆ ప్రాంతంలో శనివారం పర్యటించారు. ఇళ్లకే పరిమితమైన కొంతమంది బాధితులను గుర్తించి వైద్య శిబిరానికి తరలించారు. రోగుల పరిస్థితి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లను నీటితో శుభ్రం చేశారు. బాధితుల పరిస్థితిని, సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. అతిసార కారణంగా శుక్రవారం మరణించిన జి.నరసింహ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. న్యూఆర్ఆర్ పేటకు వచ్చిన మంత్రి నారాయణను మరోసారి కలిసి బాధితులను, మృతుల కుంటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

కిలో టమోటా రూపాయి

(మొదటిపేజి తరువాయి)

మార్కెటుకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. నాణ్యత పేరుతో వ్యాపారస్తులు మోసం చేస్తున్నారని, కనీసం ఆటో ఛార్జీలు కూడా రావడం లేదని రైతు రంగమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. 25 కిలోల బాక్స్‌కు రూ. 60 ధర పలికిందని, కూలి, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని మరో రైతు రామచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తేలియడం లేదని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రైతులు నాణ్యమైన టమోటాను మార్కెటుకు తీసుకొచ్చి గిట్టుబాటు ధరను పొందాలని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ నబిసాహెబ్ తెలపడం గమనార్హం. నంద్యాల జిల్లా ప్యాపిలిలో శుక్రవారం కిలో నాలుగు రూపాయలు పలకడంతో శనివారం రైతులెవ్వరూ మార్కెటుకు తమ పంటను తీసుకురాలేదు.

ఎన్‌ఇపి రద్దు చేయాల్సిందే

● ఒపిఎస్ అమలు చేయండి

● వారణాసిలో కదంతొక్కిన అధ్యాపకులు

వారణాసి : తమ సమస్యలు ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో దేశ నలుమూలల నుంచి వచ్చిన వేలాదిమంది అధ్యాపకులు వారణాసిలో కదంతొక్కారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని ఖండించారు. దీర్ఘకాల నుంచి ఉన్న తమ డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ అండ్ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐఎఫ్‌యుసిటిఒ) పిలుపు మేరకు వారణిసిలోని కచహరిలోని లాల్ బహదూర్ శాస్త్రి ఘాట్ వద్ద ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాను ఉద్దేశించి ఎఐఎఫ్‌యుసిటిఒ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం నాగరాజన్, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యాపకులను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో పాటు దేశవ్యాప్తంగా విద్య పరిస్థితి దయనీయ స్థితికి చేరుకుందని, జాతీయ విద్యా విధానం (ఎన్‌ఇపి) 2020 సామాన్యులకు విద్య అందకుండా చేస్తుందని విమర్శించారు. విశ్వవిద్యాలయాలను కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. విద్యా వ్యవస్థను వాణిజ్యీకరించడానికి, కార్పొరేటీకరించడానికి, కాషాయీకరణ చేయడానికి కేంద్రం నిశ్చయించుకుందన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి, మంత్రిత్వ శాఖ, యుజిసి ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపడం లేదని విమర్శించారు. ఎన్‌ఇపి 2020ను రద్దు చేయాలని, అధ్యాపకులందరికీ పాత పెన్షన్ పథకం (ఒపిఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ వయసును దేశవ్యాప్తంగా ఏకరీతిగా 65 ఏళ్లు చేయాలని, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతికి పిహెచ్‌డి తప్పనిసరి అనే నిబంధన తొలగించాలని కోరారు. తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చేలా విద్యా మంత్రిత్వ శాఖను ఆదేశించాలని ప్రధానమంత్రి మోడీని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందేశాన్ని మోడీకి తెలియజేయడానికే ఆయన నియోజకవర్గంలో ఆందోళన నిర్వహించినట్లు తెలిపారు.

తమిళనాడుకు బిజెపి ద్రోహం

తిరుచ్చి సభలో విజయ్

తిరుచ్చి : తమిళనాడుకు బిజెపి ద్రోహం చేసిందని ప్రముఖ సినీనటుడు, తమిళగ వెట్రీ కజగం (టివికె) అధ్యక్షులు విజయ్ విమర్శించారు. విజయ్ తన తొలి రాష్ట్రవ్యాప్త రాజకీయ పర్యటనను శనివారం మధ్యాహ్నం తిరుచిరాపలిలో ఆయన ప్రారంభించారు. అనంతరం అరియలూర్, పెరంబలూర్, మరక్కడై సభల్లో విజయ్ ప్రసంగించారు. జాతీయ విద్యావిధానం అమలు చేయనందుకు తమిళనాడుకు నిధులు నిరాకరించడం ద్వారా బిజెపి రాష్ట్రానికి ద్రోహం చేసిందని అన్నారు. 'బిజెపి, డిఎంకె తమిళనాడుకు ద్రోహం చేశాయి. ప్రధాని, ముఖ్యమంత్రులకు ప్రజలను ఎలా మోసం చేయాలో తెలుసు' అని చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే అమలుచేయగల వాగ్దానాలనే ఇస్తుందని అన్నారు. తిరుచిరాపల్లి సభకు విజయ్ అభిమానులు, టివికె కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. ఆయన ఉపయోగించిన కారవాన్ లాంటి ప్రచార బస్సుపై సిఎన్ అన్నాదురై, ఎంజిఆర్ వంటి నాయకుల చిత్రాలను పెయింట్ చేశారు.

ఎట్టకేలకు మణిపూర్‌కు ప్రధాని

(మొదటిపేజి తరువాయి)

ఎదుట కాంగ్రెస్ పార్టీ నిరసన నిర్వహించింది. ప్రధాని సభకు వంద మీటర్ల దూరంలోనే ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూడా నిరసనలు జరిగాయి. మణిపూర్ పీపుల్స్ పార్టీ కూడా ప్రధాని బహిరంగ సభ వేదిక సమీపంలో ప్రదర్శన నిర్వహించింది.' .తౌబాల్ జిల్లాలోని ఖంగాబోక్, లీషాంగ్థెమ్, తౌబాల్ హవోకా తదితర ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. మణిపూర్ విశ్వవిద్యాలయంలో, రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ క్యాంపస్‌లో, కళాశాలల వద్ద నిరసనలు తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు అవమానకరం : కాంగ్రెస్

మోడీ మణిపూర్ పర్యటన రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానకరమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. సహాయ శిబిరాలలో ఉంటున్న ప్రజల ఆక్రందనలను మోడీ వినలేదని ఆయన పేర్కొన్నారు. 2022 జనవరిలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో మోడీ మణిపూర్‌కు వచ్చారని, మళ్లీ మరో ఏడాదిలో ఎన్నికలు జరుపుతున్న సమయంలో ప్రస్తుతం పర్యటనకు వచ్చారని ఆయన ట్వీట్‌చేశారు. ఇంత ఆలస్యంగా పర్యటించడం దురదృష్టకరమని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

చాలా ఆలస్యమైంది : సిపిఎం

ప్రధాని పర్యటన ఇప్పటికే చాలా ఆలస్యమైందని సిపిఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ దానిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 'ప్రతిపక్ష పార్టీగా మేము ఎప్పుడూ ఒకే మాట చెబుతున్నాం. అన్ని పార్టీల ప్రతినిధులతో కలిసి మణిపూర్‌లో పర్యటించాలని ప్రధానిని కోరాం. దీనివల్ల రాష్ట్రంలో శాంతి, ప్రశాంతత నెలకొంటాయి. గత రెండు సంవత్సరాలుగా ఆయన మా మాట వినలేదు. పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చ జరగాలని కోరినప్పటికీ పట్టించుకోలేదు. కనీసం ఇప్పుడు రాష్ట్రానికి వెళ్లారు. కానీ చాలా ఆలస్యమైంది.' అని ఆయన పేర్కొన్నారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

(మొదటిపేజి తరువాయి)

మెటర్నటీ సెలవులు మంజూరు చేస్తున్నారని, నెలకు రూ.7 వేలు వేతనం ఇస్తున్నారని తెలిపారు. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా కలిపి వేతనం ఇవ్వాల్సి ఉందన్నారు. కేంద్రం రూ.600 మాత్రమే ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం మిగతా వేతనం కలిపి ఇస్తోందని వివరించారు. ఇది కూడా కార్మికుల పోరాటంతోనే దక్కిందన్నారు. కనీస వేతనం రూ.10 వేలు పెంచాలని, మెటర్నటీ సెలవులు ఇవ్వాలని, నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటుకు అప్పగించరాదని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి వచ్చే జనవరి నుంచి ఉద్యమాలకు సిద్ధమవుతామని తెలిపారు.

అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. మూడు సంవత్సరాల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలతో ప్రజలపై భారాలు పడుతున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం మతతత్వ విధానంతో కార్మికుల మధ్య చీలిక తేవాలని చూస్తోందని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, మురళి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పక్షాన సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతల హాజరై సంఘీభావంగా మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం కోశాధికారి సుప్రజ, ఆఫీస్ బేరర్స్ మహాలక్ష్మి, సుధా, శివకుమారి, విజయమ్మ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకాశం

ఆకాశం నీలాకాశం
సూర్యుడు చంద్రుడు
మేఘాలు తారల
అందమైన నీలాకాశం
అద్భుతం వినీలాకాశం

ధగ ధగ మెరిసే
సూర్య కిరణాల
భగభగ మండే
తీక్షణ కాంతుల
వెలుగులీను నీలాకాశం

తళ తళ తారల
తళుకు బెళుకుల
మిలమిల మెరిసే
చుక్కల వరుసల
చక్కనైన వినీలాకాశం

వెన్నెల కురిసే
చల్లని రాత్రుల
వన్నెలొలికేటి
చంద్రుని సొగసుల
ముచ్చటైన నీలాకాశం

నల్లని ఛాయల
ముసిరిన మబ్బులు
బిరబిర మంటూ
పరుగులు తీస్తూ
కనువిందు చేయు వినీలాకాశం

కారు మేఘాలు
సందడి చేయగ
ఉరుములు మెరుపుల
అలజడి చేయు
అత్యద్భుతం నీలాకాశం

గాలి సవ్వడుల
మేఘాల ఘర్జనల
టపటపమంటూ
చినుకులు రాల్చే
చల్లనైన వినీలాకాశం

జాబిలి వెలుగులు
వెన్నెల కురియగ
పిల్ల తెమ్మెరల
హాయిని గొలిపే
రమ్యమైన నీలాకాశం

ఏడు రంగుల
హరివిల్లు తీర్చగ
ప్రకృతిని చూడ
ముచ్చటగొలిపే
అందమైన వినీలాకాశం

అంతు చిక్కనిది
వింత గొలుపునది
ఆశ్చరుపొందించు
చుక్కల లోకం
ఆకాశం! వినీలాకాశం!

– నాగరాజు కామర్సు,
దుబ్బాక,
92480 93580.

లెక్క చేయండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్ల బొమ్మలను అంకెలుగా గణించి సమాధానాలు ఇచ్చాం. చివరి వరుస సమాధానాన్ని బట్టి అరటిపండు అంకెను మీరు కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



ఆర్.అంజలీ దేవి,
5వ తరగతి,
ఎంపిపిఎస్, అయ్యంకి,
మొవ్వ మండలం,
కృష్ణా జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అతిసారపై అప్రమత్తం కావాలి

అతిసార వచ్చినప్పుడు, లేదా బాధ పడుతున్నప్పుడు ఏమి తినాలి? ఏమి తినకూడదు? ఏ ఆహారం మంచిది? ఏది ప్రమాదకరం? మందులు వేసుకోవాలా? ఆపేయాలా? ఇలాంటి ప్రశ్నలు మనల్ని వెంటాడుతుంటాయి. తీవ్రమైన వ్యాధుల నుంచి ఒత్తిడి, చెడు ఆహారపు అలవాట్లు డయేరియాకు కారణమవుతాయి. ఇక్కడ ఒక్కొక్కరి పరిస్థితి ఒక్కోలా ఉంటుంది. భిన్నమైన ఆహారాలకు ఒక్కొక్కరి శరీరాలు కూడా భిన్నంగా స్పందిస్తుంటాయి. డయేరియా వచ్చినప్పుడు తగిన మొత్తంలో పానీయాలు తీసుకోవాలి. పిల్లలు, వృద్ధులకు మరింత ఎక్కువగా పానీయాలు అవసరమవుతాయి. చికిత్సలో హైడ్రేషన్, న్యూట్రిషన్ అనేవి మూల స్తంభాలు. ముఖ్యంగా నవజాత శిశువులు, పిల్లల విషయంలో మనం మరింత అప్రమత్తంగా ఉండాలి. సాధారణంగా కొన్ని ఆహారాలు ఎవరైనా తీసుకోవచ్చు. కానీ ఆహారం అనేది సదరు వ్యక్తి శరీరతత్వం, ఆరోగ్య చరిత్ర, డయేరియా తీవ్రతపై ఆధారపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. కొన్ని ఆహారాలు మాత్రం డయేరియాను తీవ్రం చేస్తుంటాయి. అలాంటి ఆహార పదార్థాలను అసలు తీసుకోకుండా ఉండటమే మేలు. కొవ్వు ఎక్కువగా ఉండేవి, కారంగా ఉండేవి, బాగా నూనెలో వేయించినవి, పళ్ల రసాలు, ఆల్కహాలిక్ పానీయాలు, బీన్స్, హోల్‌వీట్ లాంటివి పరిస్థితి తీవ్రం చేస్తుంటాయి.

లక్షణాలు

నీళ్ళ విరేచనాలు : రోజుకు మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు నీళ్ళ విరేచనాలు అవడం. **కడుపునొప్పి** : కడుపులో తీవ్రమైన నొప్పి ఉండటం. **వాంతులు** : వికారం, వాంతులు. **శరీరంలో నీరు తగ్గడం** : నీరసంగా అనిపించడం, శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం.

నివారణా చర్యలు

- చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని లేదా శుద్ధి చేసిన నీటిని తాగాలి.
- బయటి ఆహారం, వర్షాకాలంలో కలుషితమైన ఆహారాన్ని తినకపోవడం మంచిది.
- డయేరియా ఒక వారం కంటే ఎక్కువ కాలం ఉంటే, మలంలో రక్తం లేదా చీము వస్తుంటే, తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు తగ్గకపోతే, శరీరంలో నీటి శాతం తగ్గిపోయినట్లు అనిపిస్తే డాక్టరును సంప్రదించటం మేలు.

అతిసార (డయేరియా)కు చాలా కారణాలు ఉంటాయి. కలుషిత నీరు, కడుపులో ఇన్ఫెక్షన్, ఇన్‌ఫ్లమేషన్, ఫుడ్ పాయిజనింగ్, ఫుడ్ అలర్జీలు, అసమతౌల్య ఆహారం, బోవెల్ సిండ్రోమ్ ... ఇలా చాలా కారణాల వల్ల డయేరియా చుట్టుముడుతుంది. మారిన వాతావరణ పరిస్థితుల్లో కూడా ఈ కేసులు పెరుగు తుంటాయి. డాక్టర్లు ఇచ్చే సూచనలు పాటిస్తే వ్యాధి త్వరగా తగ్గుముఖం పడుతుంది. పిల్లలైనా, పెద్దలైనా చికిత్సలు ఆలస్యం చేయకుండా తీసుకోవటం ఎంతైనా మంచిది.

ఎలా వ్యాపిస్తుందంటే ...

రోజుకు మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు నీళ్ళ విరేచనాలు అవుతూ ఉంటే అతిసారగా గుర్తించొచ్చు. కలుషితమైన ఆహారం, నీరు, బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా ఇది వ్యాపిస్తుంది. లక్షణాల్లో నీళ్ళ విరేచనాలు, కడుపునొప్పి, వాంతులు, నిర్జలీకరణం (శరీరంలో నీటి శాతం తగ్గడం) ఉంటాయి. ముఖ్యంగా పిల్లల్లో తీవ్రస్థాయి అనారోగ్యానికి తీసుకెళ్తుంది. పరిశుభ్రత పాటించడం, సురక్షితమైన నీరు తాగడం, కలుషిత ఆహారాన్ని నివారించడం ద్వారా డయేరియాను నివారించొచ్చు. వర్షాకాలంలో ఆహారం, నీరు కలుషితం కావడం డయేరియాకు ప్రధాన కారణం. వైరస్‌లు, బ్యాక్టీరియాలు ఉదాహరణకు పిల్లల్లో రోటా వైరస్, బ్యాక్టీరియాల ద్వారా డయేరియా వస్తుంది. ఫుడ్ అలర్జీలు, కడుపు ఇన్ఫెక్షన్లు, కొన్ని మందుల దుష్ప్రభావాలు, క్యాన్సర్ వంటి వ్యాధులు కూడా డయేరియాకు దారి తీయొచ్చు.

ఇలాంటి పరిస్థితి ఉంటే ఇబ్బందికరమే!

డయేరియా సాధారణంగానే అనిపించొచ్చు. కానీ, తగిన సమయంలో చికిత్స చేయకపోతే, సదరు రోగి ప్రాణాలు కూడా కోల్పోవచ్చు. వారం రోజుల కంటే డయేరియా ఎక్కువ ఉంటే అత్యవసర వైద్య సాయం అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మలంలో రక్తం, చీము, వాంతులు తగ్గకపోవడం, తీవ్రమైన కడుపునొప్పి, బరువు తగ్గిపోవడం, ఒంటిలో నీటి శాతం పడిపోవడం, మలం రంగు మారడం, విరేచనాలు ... ఇలా ఏ లక్షణాలున్నా వెంటనే అప్రమత్తం కావాల్సిందే.

రోగ నిరోధక శక్తి పెంచుకోవాలి

డయేరియాను ఆపేందుకు మొదట్లో ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడమే మేలు. సదరు బ్యాక్టీరియాతో పోరాడేందుకు మన శరీర రోగ నిరోధక వ్యవస్థ పనిచేస్తుంది. మనం తీసుకునే చర్యలు రోగ నిరోధక వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. పరిస్థితి సద్దుమణగకపోతే వైద్యుల సాయం తీసుకోవటం మంచిది. యాపిల్స్, క్యారట్స్, కొవ్వు తక్కువగా ఉండే చేపలు, అన్నం లాంటివి తీసుకోవాలి. ఇవి డయేరియా లక్షణాలు పెంచవు. వీటిని కానిస్టేపెడ్ ఫుడ్స్ అంటారు. ఇవి పేగుల్లో నుంచి బయటకు విడుదల కావడానికి కాస్త సమయం పడుతుంది. వీటివల్ల డీహైడ్రేషన్, బరువు తగ్గిపోవడం లాంటి సమస్యలను నియంత్రించొచ్చు.

ఆహారంపైనా అశ్రద్ధ వద్దు

కడుపులో ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమయ్యే క్రాన్స్ డిసీజ్ లాంటి వ్యాధులతో బాధపడేవారు తాము ఏమి తింటున్నామో, అవి తమపై ఎలాంటి ప్రభావం చూపిస్తున్నాయో రాసుకోవాలి. తమకు ఏ ఆహార పదార్థాలు పడతాయో, ఏమి పడవో తెలుసుకోవాలి. డయేరియాను అరికట్టడంలో మంచి ఆహారాన్ని ఎంచుకోవడం ఎంత ముఖ్యమో.. ఆహారాన్ని ఎలా వండుతున్నారు? ఎలా సర్వ్ చేస్తున్నారు? ఎలా నిల్వ చేస్తున్నారు అనేది కూడా అంతే ముఖ్యం.

– డాక్టర్ ఆకుల చిరంజీవి
వైద్యాధికారి,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,
తూర్పు తాళ్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

వీటి జోలికెళ్లకండి

- ఆల్కహాల్, కాఫీ, కార్బొనేటెడ్ పానీయాలు
- బాగా వేయించిన, తీపి ఆహార పదార్థాలు
- తీపి పదార్థాలు, పప్పులు
- ఆలివ్ ఆయిల్, ఆయిల్ పెప్పర్
- స్వీట్లు, చాక్లెట్లు
- ఫైబర్
- సాసేజ్‌లు
- వాల్‌నట్లు
- తొక్కతో ఉండే పళ్లు
- అవకాడో
- విత్తనాలు, గింజలు, చీజ్, బార్లీ
- ప్రాసెస్డ్ ఫుడ్స్
- కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాలు
- ఫ్రక్టోస్ ఎక్కువగా ఉండే పళ్ల రసాలు
- డెయిరీ ఉత్పత్తులు

MINISTRY OF YOUTH AFFAIRS AND SPORTS
GOVERNMENT OF INDIA

యువ శక్తి
వికసిత్ భారత్
వైపు దారి చూపుతోంది

VIKSIT BHARAT
YOUNG LEADERS
DIALOGUE 2026
10TH-12TH JANUARY | BHARAT MANDAPAM, NEW DELHI

ప్రధాని నరేంద్ర మోడీ

- యువ నాయకులు తమ వికసిత్ భారత్ దార్శనికతను ప్రధాని మోదీకి ప్రదర్శించనున్నారు.
- భారతదేశం అంతటా మెరిట్ ఆధారిత, బహుళ-స్థాయి ప్రక్రియ ద్వారా పాల్గొనేవారిని ఎంపిక చేస్తారు.
- భారతదేశం యొక్క వికసిత్ భారత్ ప్రయాణాన్ని స్క్రిప్ట్ చేయడానికి ఆశావహులైన యువత క్విజ్‌లో పాల్గొంటారు.

నమోదు చేసుకోవడానికి
చివరి తేదీ
15 అక్టోబర్, 2025

ఈరోజే mybharat.gov.in కి లాగిన్ అవ్వండి

పాల్గొనేవారు www.mygov.in ద్వారా కూడా
క్విజ్‌లో పాల్గొనవచ్చు

VBYLD 2026 కోసం క్విజ్‌లో పాల్గొనడం ద్వారా
మీ మొదటి అడుగు వేయండి.

CBC 47107/13/0011/2526

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68